


ESTD: 1999
www.voodayam.com

# వుదయం




ఆదిలాబాద్ 06-09-2026 ఆదివారం | సంపుటి : 13 | సంచిక :306 | SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal
Follow us on



## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి

# రెండేళ్లు సమయం ఇవ్వండి

**కొడంగల్, సెప్టెంబర్ 5 (వుదయం)**

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తనకు రెండేళ్లపాటు సమయం ఇవ్వాలని, ఆ తర్వాత అడగకుండానే అన్ని డిమాండ్లను పరిష్కరిస్తానని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. కొడంగల్‌లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన అధికారిక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసందించారు. ఈ వేడుకకు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్దఎత్తున హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి సీఎం నివాళులర్పించి, ఉపాధ్యాయ లోకానికి శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ విద్యా వ్యవస్థను దేశానికే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని సీఎం రేవంత్ పేర్కొన్నారు. ఉపాధ్యాయులు వీధుల్లోకి వచ్చి ఆందోళన చేయడం ప్రభుత్వానికి మంచిది కాదని, పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే గురువులు ధర్నాలకు దిగితే సమాజానికి తప్పుడు సంకేతాలు వెళ్తాయని అన్నారు. పీఆర్సీ, ఇంక్రిమెంట్లు, బకాయిలు వంటి సమస్యలన్నింటినీ రాబోయే రెండేళ్లలో సామరస్యంగా పరిష్కరిస్తామని, ఉపాధ్యాయులు లేదా లెక్చరర్లకు అణాపైసా కూడా నష్టం వాటిల్లనీయబోమని భరోసా ఇచ్చారు. ఏవైనా అనుమానాలుంటే సలహాదారు కే.కేశవరావుతో చర్చించాలని సూచించారు.

గత పదేళ్లలో మునుపటి ప్రభుత్వం విద్యా వ్యవస్థను తీవ్రంగా నిర్వీర్యం చేసిందని, ఆ విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రాన్ని నడిపించే బాధ్యత గురువుల మీద ఉందని సీఎం ఉద్ఘాటించారు. ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఎలాంటి వివాదాలకు తావులేకుండా ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టామని, జీవో 317 సమస్యలను పరిష్కరించి పెండింగ్ ప్రమోషన్లు అందించామని గుర్తుచేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేశామని, ఉత్తమ బోధనా పద్ధతుల అధ్యయనం కోసం ఉపాధ్యాయులను విదేశాలకు కూడా పంపామని తెలిపారు.

మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా విధానంలో సమూల మార్పులు తెస్తున్నామని సీఎం స్పష్టం చేశారు. ఐటీఐలను అత్యాధునిక ఏటీసీలుగా మారుస్తున్నామని, పాలిటెక్నిక్ విద్యను స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తెచ్చి విద్యార్థులకు కార్పొరేట్ సంస్థల్లో ఇంటర్న్‌షిప్ ద్వారా స్టైఫండ్ అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పాలిటెక్నిక్ డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో నేరుగా ప్రవేశం పొందవచ్చని, ఈ విషయంలో కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని, విద్యార్థులు వాటిని నమ్మవద్దని హితవు పలికారు.

ఉపాధ్యాయుల కృషితోనే ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు భారీగా పెరిగాయని, జాతీయ స్థాయిలో విద్యారంగ సగటులో 28వ స్థానంలో ఉన్న తెలంగాణను 17వ స్థానానికి తీసుకెళ్లిన ఘనత టీచర్లకే దక్కుతుందని ప్రశంసించారు. గత ప్రభుత్వం రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద సుమారు 8 వేల కోట్లు పెండింగ్ పెట్టి వెళ్తే, ప్రస్తుత ప్రభుత్వం వంద రోజుల్లోనే రూ. 6 వేల కోట్లు చెల్లించిందని గుర్తుచేశారు. ఉపాధ్యాయులపై తనకు సంపూర్ణ విశ్వాసం ఉందని, రాబోయే రెండేళ్లు ప్రభుత్వ లక్ష్యాలను అర్థం చేసుకుని విద్యాభివృద్ధికి సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## ఏఐ దెబ్బకు పెరిగిన కుబేరుల సంపద

**న్యూఢిల్లీ:** కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత ఒకవైపు ఉద్యోగ కోతలకు కారణమవుతుంటే, మరోవైపు అగ్రశ్రేణి కంపెనీలకు అపారమైన సంపదను తెచ్చిపెడుతోంది. ఏఐ రంగంలో పెట్టిన పెట్టుబడులు అనూహ్య లాభాలను పంచడంతో ప్రపంచవ్యాప్తంగా కుబేరుల సంఖ్య భారీగా పెరిగినట్లు ప్రముఖ గ్లోబల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ 'అల్ట్రాటా' తన తాజా వెల్త్ నివేదికలో వెల్లడించింది. గత ఏడాది కాలంలో ప్రపంచవ్యాప్తంగా బిలియనీర్ల సంఖ్య సుమారు 3,800కు ఎగబాకగా, వీరి మొత్తం సంపద ఏకంగా 15.1 ట్రిలియన్ డాలర్లకు (భారత కరెన్సీలో సుమారు రూ.1,417.37 లక్షల కోట్లకు) చేరుకున్నట్లు ఆ నివేదిక స్పష్టం చేసింది. గత ఐదేళ్లలో ఏఐ రంగంలో సగటున 30 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.283.25 కోట్లు) చొప్పున పెట్టుబడులు పెట్టిన కంపెనీలు అసాధారణ మార్కెట్ విలువను సాధించాయని అల్ట్రాటా తెలిపింది. దీనివల్ల బిలియనీర్ల సంపద 12.8 శాతం వృద్ధి చెందగా, సంపన్నుల జనాభా 8.2 శాతం మేర పెరిగింది.

## భారత్‌తో వ్యూహాత్మక బంధాన్ని బలోపేతం చేసుకుంటాం

### ప్రపంచాన్ని నడిపించే అగ్రగామి నేత మోదీ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5 (ఎఎంస్) :**



ప్రపంచ నాయకుల్లో నరేంద్ర మోదీ అత్యంత స్ఫూర్తిదాయకమైన వ్యక్తి అని బెల్జియం ప్రధాని బార్ట్ డె వెవర్ కొనియాడారు. క్లిష్టమైన అంతర్జాతీయ పరిస్థితుల్లో ఆయన అనుసరిస్తున్న వ్యూహాలు, విధానాలు అత్యంత విశిష్టమైనవని ప్రశంసించారు. ఆయన ఆలోచనలు ఎంతో స్పష్టంగా ఉంటాయని, మోదీ మాటలను కేవలం వినడమే కాకుండా ఆచరించాలనిపిస్తుందని అభిప్రాయపడ్డారు. కొవిడ్ కారణంగా గతంలో తన భారత పర్యటన వాయిదా పడిందని, ఎట్టకేలకు ఇక్కడకు వచ్చి మోదీని కలవడం ఎంతో గౌరవంగా ఉందని పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో భారత్ అన్ని రంగాలలోనూ దూసుకుపోతోందని కితాబునిచ్చారు.

**అంతర్జాతీయ వేదికపై భారత్ కీలక పాత్ర**

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా, అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ ఖ్యాతి గడిస్తోందని బార్ట్ డె వెవర్ తెలిపారు. ప్రస్తుత భౌగోళిక రాజకీయ అనిశ్చితి నేపథ్యంలో బ్రస్సెల్స్ భారత్‌ను ఒక నమ్మకమైన భాగస్వామిగా భావిస్తోందన్నారు. కేవలం ఆర్థిక, రాజకీయ సంబంధాలే కాకుండా, వ్యూహాత్మక రంగాల్లోనూ భారత్‌తో బంధాన్ని మరింత ఉన్నత స్థాయికి చేర్చాలని ఆకాంక్షించారు.

**అమెరికా విధానాలపై పరోక్ష విమర్శలు**

అంతర్జాతీయ వాణిజ్యాన్ని దెబ్బతీసేలా కొన్ని దేశాల అనుసరిస్తున్న తీరుపై ఆయన పరోక్షంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. మార్కెట్లను మూసివేయడం, ఆంక్షలు విధించడం, అవాంఛనీయ సుంకాలు వడ్డించడం వల్ల ప్రపంచ వాణిజ్యం తీవ్ర ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. నేడు నిర్ణయం తీసుకుని రేపు రద్దు చేసే అస్థిర ధోరణులు ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీస్తాయని, స్వేచ్ఛా మార్కెట్లు, బలమైన భాగస్వామ్యాల వల్లే అసలు అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు.

## రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం భూములు అమ్మడమే

### కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు
### రాష్ట్రాన్ని ఆర్ఆర్ రియల్ ఎస్టేట్ సంస్థగా మార్చేశారు
### కమీషన్ల కోసమే పేదల భూములను 22ఏలో పెట్టారు



హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం భూములు అమ్ముకోవడం మాత్రమేనని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బాటలోనే ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి కూడా నడుస్తూ భూముల అమ్మకాలకు తెరలేపారని దుయ్యబట్టారు. ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద నిషేధిత భూసమస్యలపై భారతీయ జనతా పార్టీ (భాజపా) ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ప్రజాపాలన ముసుగులో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి విచ్చలవిడిగా దోపిడీకి పాల్పడుతోందని కిషన్ రెడ్డి ఆరోపించారు. కేవలం భూములను దోచుకోవడానికే '22ఏ' నిబంధనను తెరపైకి తెచ్చారని, తమ భూములు కూడా ఆ జాబితాలో ఉన్న విషయం చాలామంది పేదలకు ఇప్పటికీ తెలియదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ధరణి పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలా దోచుకుందో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే రీతిలో రాష్ట్రాన్ని ఒక స్థిరాస్తి వ్యాపార కేంద్రంగా మార్చేసిందని మండిపడ్డారు. అన్ని రకాల చట్టబద్ధ అనుమతులు ఉన్న భూములను సైతం అక్రమంగా నిషేధిత జాబితాలో చేర్చేశారని విమర్శించారు.

ప్రస్తుతం రాష్ట్రంలో భూములు అమ్మకపోతే ప్రభుత్వం నడవలేని దుస్థితి నెలకొందని కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు. వక్ఫ్ భూములు మినహా రాష్ట్రంలోని మిగతా అన్ని భూముల మీద సీఎం రేవంత్ రెడ్డి కన్నేశారని ఆరోపించారు. రాష్ట్రాన్ని ఒక పెద్ద 'ఆర్ఆర్ రియల్ ఎస్టేట్' సంస్థగా మార్చేశారని, ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కూడా సరిగ్గా ఇవ్వలేని ఆర్థిక దివాలా స్థితికి ప్రభుత్వాన్ని తీసుకువచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. ఏకంగా 60 లక్షల ఎకరాలకు పైగా భూములను 22ఏ జాబితాలో బంధించి, కాంగ్రెస్ ప్రజాపాలనలో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని విమర్శించారు.

కాంగ్రెస్ నాయకులను, అధికారులను ఈ సందర్భంగా హెచ్చరిస్తున్నానని, ప్రజాధనాన్ని, భూములను దోచుకున్న ప్రతి రూపాయిని వడ్డీతో సహా వసూలు చేసి మళ్లీ ప్రజలకే పంచుతామని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అన్ని పనుల్లో 30 శాతం కమీషన్లు డిమాండ్ చేస్తోందని ఆరోపించారు. కేవలం ఈ కమీషన్ల కక్కుర్తి వల్లే పేదల భూములను నిషేధిత జాబితాలో చేర్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో 22ఏ చట్టంపై బీజేపీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలను చైతన్యవంతం చేయాలని, రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై తీవ్రస్థాయిలో పోరాడాలని పిలుపునిచ్చారు. 22ఏ జాబితాలో అన్యాయంగా ఇరికించిన పేదల భూములన్నింటినీ తక్షణమే తొలగించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.




**దేశీయ స్టాక్ మార్కెట్లలో భారీ రికవరీ**

**రూ.1.17 లక్షల కోట్లు పెరిగిన మదుపర్ల సంపద**

**76,500 మైలురాయి వద్ద సెన్సెక్స్ స్థిరపడకం**

**రూ.350 కోట్లతో కొనుగోళ్లు**

## యూత్ డిక్లరేషన్ అమలులో విఫలం..


### కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి
### మంత్రిని తీసేస్తే సరిపోదు.. ప్రభుత్వానికే చరమగీతం పాడుతాం
### రేవంత్ సర్కార్ మోసపూరిత పాలనపై కరీంనగర్‌లో బీఆర్ఎస్ నిరసన గళం

**కరీంనగర్, సెప్టెంబర్ 5 (వుదయం) :**



మంత్రిని తొలగిస్తే సరిపోదని, ఏకంగా కాంగ్రెస్ ప్రభుత్వాన్నే బర్తరఫ్ చేసే రోజులు అతి త్వరలోనే వస్తాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కరీంనగర్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ నిరసన దీక్షలో ఆయన ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. పేద ప్రజల భూములతో కాంగ్రెస్ పార్టీ చెలగాటమాడుతోందని, కోట్ల ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చిన ఆ పార్టీనే త్వరలో ప్రజలు నిషేధిత జాబితాలో పెడతారని హెచ్చరించారు. యువతకు ఇచ్చిన హామీల అమలులో రేవంత్ రెడ్డి సర్కార్ పూర్తిగా విఫలమైందని కేటీఆర్ ధ్వజమెత్తారు. యూత్ డిక్లరేషన్‌లో భాగంగా 24 హామీలు ఇచ్చి కనీసం ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. నూట రోజుల్లో అన్నీ ఇస్తామని గొప్పలు చెప్పి, వెయ్యి రోజులు గడిచినా మోసం చేయడమే తప్ప చేసిందేమీ లేదని విమర్శించారు. నిరుద్యోగులను నిండా ముంచిన కాంగ్రెస్ పెద్దపెద్ద మాటలు మాట్లాడుతోందని, బాండ్ పేపర్లు రాసిచ్చి యువతను మోసగించిన వారికి ప్రజలే త్వరలో తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కేసీఆర్ రాజీనామా చేయాలంటూ కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్న తీట మాటలపై స్పందిస్తూ... తెలంగాణ తెచ్చిన కేసీఆర్ రాజీనామా చేయాలా? లేక మోసాలు చేసిన రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలా? అని సభికులను ప్రశ్నించగా... విద్యార్థులు, ప్రజలు ముక్తకంఠంతో రేవంత్ రెడ్డి అని సమాధానమిచ్చారు.

## ఇంతే కదా...!




## అమెరికా స్థావరాలపై ప్రతీకార దాడుల హెచ్చరిక

**వాషింగ్టన్:** పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరుకుంటున్న తరుణంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌ను తీవ్రస్థాయిలో హెచ్చరించారు. ఇరాన్‌లోని 'పికాక్స్ పర్వతం' కింద అత్యంత గోప్యంగా నిర్మించిన భూగర్భ అణు కేంద్రంపై త్వరలోనే దాడులు నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఓవల్ ఆఫీసులో నిర్వహించిన మీడియా సమావేశంలో ట్రంప్ మాట్లాడుతూ.. ఆ ప్రాంతంలో ఇరాన్ సాగిస్తున్న అనుమానాస్పద అణు కార్యకలాపాలపై అగ్రరాజ్యం నిరంతరం నిఘా పెట్టిందని తెలిపారు. టెహ్రాన్ చేతికి ఎట్టి పరిస్థితుల్లోనూ అణ్వాయుధాలు చిక్కకుండా అడ్డుకోవడమే తమ ఏకైక లక్ష్యమని తేల్చిచెప్పారు.




# సెయింట్ ఆంథోనీస్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

- గురువు లేని విద్య గుడ్డివిద్య.. సమాజానికి దిశానిర్దేశం చేసేది ఉపాధ్యాయుడే

**సంగారెడ్డి ,వుదయం**

సంగారెడ్డి పట్టణంలోని శాంతినగర్‌లో గల సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పాఠశాల యాజమాన్యం జ్యోతి ప్రజ్వలన చేసి, పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా సెయింట్ ఆంథోనీస్ విద్యాసంస్థల డైరెక్టర్ ఈ. విజయ్ రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్, ప్రిన్సిపాల్ ఈ. అరుణా రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ హెడ్ ఈ.జయబాలారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ప్రదీప్ లక్కిశెట్టి తదితరులు పాల్గొని అతిథులకు స్వాగతం పలికారు. పదో తరగతి విద్యార్థులు ప్రగమ్య, అస్మిత స్వాగత నృత్యగీత ప్రదర్శనతో కార్యక్రమానికి శుభారంభం పలికారు.డైరెక్టర్ ఈ. విజయ్ రెడ్డి మాట్లాడుతూ, అజ్ఞానమనే అంధకారాన్ని తొలగించి విజ్ఞానమనే వెలుగును ప్రసాదించే చైతన్య శిల్పి గురువు అని అన్నారు. గురువుకు సమాజంలో ఉన్నతమైన స్థానం ఉందని, తల్లిదండ్రుల తర్వాత విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు."బడి అనే నారుమడిలో విద్య అనే విత్తనం వేసి, అక్షరమనే నీరు పోసి, చెడు అనే కలుపు తీసి, మంచి నీతి అనే పంటను సమాజానికి అందించేవారే ఉపాధ్యాయులు" అని ఆయన అన్నారు.భారత ద్వితీయ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని తెలిపారు. రాధాకృష్ణన్ విద్యారంగానికి చేసిన సేవలను, ఆయన ఆదర్శాలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.

అనంతరం విద్యార్థులు వివిధ రకాల నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు వివిధ పోటీలు, ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు పాఠశాల యాజమాన్యం చిరుజ్ఞాపికలు అందజేసి అభినందించింది.

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పాఠశాలలో విద్యాబోధన చేస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు తమ విలువైన సేవలను అందిస్తున్న ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులను యాజమాన్యం ఘనంగా సన్మానించి చిరుజ్ఞాపికలు అందజేసింది.ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం

# రాష్ట్రంలో రాబందుల సర్కార్ హరీష్ రావు

- హాజరైన మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి - రేవంత్ సర్కార్ పై ధ్వజం
- వంట వార్పు కార్యక్రమంలో ప్రభుత్వానికి నిరసన
- రాష్ట్రాన్ని రాబందుల పీక తింటున్నారని విమర్శించిన హరీష్
- కేసీఆర్ తోనే మళ్లీ సంక్షేమ పథకాలు
- రేవంత్ సర్కార్ కు ఓటు గుణపాఠం చెప్పాలని సూచన

**దుబ్బాక , సెప్టెంబర్ 5, వుదయం:**

సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం హబ్సిపూర్ వద్ద శనివారం రైతు మహాధర్నా హోరెత్తింది. దుబ్బాక నియోజకవర్గ రైతులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్న ఈ ధర్నాకు మాజీ మంత్రి హరీష్ రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి హాజరయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు పడుతున్న ఇబ్బందులను రైతులు హరీష్ రావు దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం ఇవ్వాల్సిన బాకీ కార్డులను ప్రదర్శిస్తూ అన్నదాతలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ, రేవంత్ సర్కార్ పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. "మేము గొంతెమ్మ కోరికలు కోరడం లేదు" అని ఆయన అన్నారు. రోజుకు ఆరు గంటలు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో కరెంటు గోసే లేదని, రేవంత్ రెడ్డి ఎన్నికల్లో పాత రోజులు తెస్తానని చెప్పినట్లుగానే కరెంటు లేని పరిస్థితులు గ్రామాల్లో నెలకొన్నాయని విమర్శించారు. ఉచిత కరెంటు ఉత్తదే అన్నట్లు చేశారన్నారు. కరోనా సమయంలోనూ బీఆర్ఎస్ రైతుబంధు ఇచ్చిందని, కాంగ్రెస్ వచ్చాక దానికి ఏసరు పెట్టారని,



ఎన్నికల హామీలో లేకున్నా రైతుబంధు అమలు చేసిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. ఉన్న పథకాలకు ఎగనామం పెట్టి రైతుబంధు, రైతు బీమా ఇవ్వకుండా మోసం చేశారన్నారు. పేద రైతు కుటుంబాలకు కొండంత అండగా ఉండే రైతు బీమాను ఎత్తివేయడం బాధాకరమన్నారు.కాంగ్రెస్ వచ్చాకే యూరియా కష్టాలు మొదలయ్యాయని, గతంలో ఆటో డ్రైవర్ కు చెప్తే ఇంటికి యూరియా బస్తాలు వచ్చేవని గుర్తు చేశారు. రూ.900 ఉన్న డీఏపీని రూ. 2300కు పెంచి బీజేపీ రైతులను గోస పెడుతోందని, షాపుల్లో లేని యూరియా యాప్ లోకి ఎలా వస్తుందని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీ దొందూ దొందేనని విమర్శించారు.రైతులు పండించిన ధాన్యం కొనుగోలులో వివక్ష చూపడంతో పాటు క్వింటాకు ఐదు కిలోల కోత పెట్టారని ఆరోపించారు. మిల్లర్లు, బ్రోకర్ల చేతిలో తోలుబొమ్మగా సీఎం రేవంత్ మారారని, కేంద్రం ఏ ధాన్యం కొనమంటే అదే కొంటానని చెప్పడం సిగ్గుచేటని, ధాన్యం కొనలేని సీఎం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పాలిట రాక్షసుడిలా మారారని, సమయం వచ్చినప్పుడు రెక్కలు విరచడానికి రైతులు సిద్ధంగా ఉన్నారన్నారు.కాళేశ్వరం, మల్లన్నసాగర్ ద్వారా గతంలో మండుటెండల్లోనూ కూడవెల్లి వాగు గలగల పారిందని, రేవంత్ సర్కార్ వచ్చాక ఉమ్మడి మెదక్ జిల్లాలో కాలువల నిర్మాణాలు కూడా చేపట్టలేదని విమర్శించారు. మూడేళ్లుగా కాళేశ్వరం కుంగిందంటూ కాలయాపన చేస్తున్నారని, ఇది కాలం పెట్టిన కరువు కాదని, రేవంత్ తెచ్చిన కరువని ఘాటుగా విమర్శించారు.వెయ్యి రోజుల పాలనలో వెయ్యి అబద్ధాలు తప్ప అభివృద్ధి లేదని, రుణమాఫీ చేస్తానని ప్రమాణాలు చేసి నేటికీ చేయలేదని, దేవుళ్ల మీద ఒట్టుపెట్టి మాట తప్పిన మనిషి రేవంత్ రెడ్డి అని అన్నారు. పాత పద్ధతిలో యూరియా, రైతుబంధు, రైతు బీమా, 24 గంటల కరెంటు కావాలంటే కేసీఆర్ రావాలి, రేవంత్ పోవాలని పిలుపునిచ్చారు.వెయ్యి రోజుల్లో ఒక్కరికీ కొత్త పెన్షన్ రాలేదని, ఉన్న పెన్షన్లకు కోత పెట్టారని, కళ్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, తులం బంగారం జాడలేకుండా పోయాయని, ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. అసెంబ్లీలో రైతు సమస్యలు, కరెంటు కోతలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, దుబ్బాక నియోజకవర్గంలోని బి.ఆర్.ఎస్ నాయకులు పలువురు పాల్గొన్నారు.



# విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- మౌలిక వసతులు, ఉపాధ్యాయుల కొరత లేకుండా చర్యలు
- స్ఫూర్తి తరగతులతో పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం
- 40 వేల మంది విద్యార్థులకు హెల్త్ కార్డులు

**గద్వాల సెప్టెంబర్ 05 (వుదయం బ్యూరో)**

విద్యాపరంగా వెనుకబడ్డ జోగులాంబ గద్వాల జిల్లాను విద్యారంగంలో ముందంజలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు ఉపాధ్యాయుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌తో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. జిల్లాలో పదో తరగతి విద్యార్థుల కోసం 'స్ఫూర్తి' కార్యక్రమం ద్వారా ప్రత్యేక తరగతులు నిర్వహించి వంద శాతం ఉత్తీర్ణతతో పాటు మెరుగైన మార్కులు సాధించేలా కృషి చేయాలని అన్నారు. గట్టు, కేటీ దొడ్డి మండలాల్లో విద్యార్థుల డ్రాప్‌అవుట్‌లను అరికట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. తల్లిదండ్రులు పిల్లలను పనులకు పంపకుండా చదువుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. విద్య ద్వారానే విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగగలరని పేర్కొన్నారు. జిల్లాలో నర్సింగ్, మెడికల్ కళాశాలలు ప్రారంభమయ్యాయని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విద్యాసంస్థలను ఏర్పాటు చేసి గద్వాలను విద్యారంగంలో అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ విద్యార్థులు చదువులో రాణించాలంటే ఆరోగ్యం కూడా ఎంతో ముఖ్యమన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీలు, హైస్కూళ్లు, వసతి గృహాల్లో చదువుతున్న సుమారు 40 వేల మంది విద్యార్థులకు హెల్త్ కార్డులు అందిస్తున్నట్లు తెలిపారు. వీటి ద్వారా విద్యార్థులకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తామన్నారు.ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల్లో 125 మంది విద్యా వలంటీర్లను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. మరుగుదొడ్లు, ప్రహరీలు, మరమ్మతులు తదితర పనులతో ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పించేందుకు విద్యారంగంలోని అన్ని పారామీటర్లలో మెరుగైన ప్రగతి సాధిస్తే జిల్లా టాప్ 10లో నిలిచే అవకాశం ఉందని, ఆ దిశగా ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ సరిత, రాష్ట్ర వాల్మీకి బోయ కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలు, వినయం నేర్పించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు.అనంతరం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూజలు నిర్వహించారు. బాలభవన్ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. 'స్ఫూర్తి' కార్యక్రమం లోగో, పోస్టర్లను ఆవిష్కరించడంతో పాటు హెల్త్ కార్డులను విడుదల చేసి విద్యార్థులకు అందజేశారు. జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ హనుమంతు, మున్సిపల్ చైర్‌పర్సన్ జయలక్ష్మి, డీఈఓ విజయలక్ష్మి, డీఎం హెచ్ఓ సంధ్య కిరణ్మయి, అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# గురువువే మంచిమర్గని చూపే దైవం



**నారాయణఖేడ్ సెప్టెంబర్ 05(వుదయం)**

తల్లిదండ్రుల తర్వాత గురువే మంచిమర్గని చూపి ఉన్నత శిఖరాలకు ఎదిగే విధంగా కృషి

నారాయణఖేడ్ పట్టణంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవం, నూతన విద్యార్థుల స్వాగతోత్సవంలో శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారుఅన్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తల్లిదండ్రుల తరువాత జ్ఞానాన్ని నేర్పి ఉన్నత శిఖరాలకు ఎదిగే విధంగా చేసే వ్యక్తి గురువే అని అన్నారు. గురువుల పాత్ర అమోఘమని గుర్తు చేశారు.ఉపాధ్యాయుల పాత్ర వెలకట్టలేనిది: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైనదని, తల్లిదండ్రుల తర్వాత విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత గురువులదేనని కొనియాడారు.పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉచిత విద్య, పాఠ్యపుస్తకాలు, నాణ్యమైన భోజనం, హాస్టల్ వసతితో పాటు విద్యాభివృద్ధికి అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పిస్తోందని తెలిపారు.జూనియర్ కళాశాల దశ విద్యార్థుల జీవితంలో అత్యంత కీలకమైన మలుపు అని, చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ నిర్దేశిత లక్ష్యంతో చదువుపై దృష్టి పెట్టాలని విద్యార్థులకు సూచించారు.




ప్రభుత్వ కళాశాలల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారని, వారి సేవలను సద్వినియోగం చేసుకోవలన్నారు.కళాశాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ సెట్, రమేష్ చౌహన్, యాదవ్ రెడ్డి మాజీ సర్పంచ్,కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం,స్థానిక ప్రజాప్రతినిధులు,

# పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన సమాజం



**దౌల్తాబాద్ సెప్టెంబర్ 05(వుదయం):**

మండల పరిధిలోని దీపాయంపల్లి గ్రామ అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులకు పోషకాహారం ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. గర్భిణీలు, బాలింతలు నిత్యం పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు చిన్నారులకు సమతుల్య ఆహారం అందించాలని సూచించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ దుర్గేష్ మాట్లాడుతూ.. తల్లి ఆరోగ్యంగా ఉంటేనే శిశువు ఆరోగ్యంగా ఎదుగుతాడని, గర్భిణీలు, బాలింతలు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్, ఏఎన్ఎం కరుణకుమారి, ఆశా కార్యకర్త లక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధురి, అంగన్వాడీ టీచర్ అరుణ, ఆయా నవనీత, గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

# స్టీరింగ్ ఒక చేత.. సెల్‌ఫోన్ ఇంకో చేత!

- కదులుతున్న యమరథంలా ఆర్టీసీ బస్సు: ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం!

**గద్వాల సెప్టెంబర్ 05 (వుదయం కరస్పాండెంట్)**

'వందలాది మంది ప్రయాణికులు ప్రాణాలు చేతిలో పట్టుకుని కూర్చుంటే.. ఆ డ్రైవర్ మాత్రం హాయిగా రీల్స్, చాటింగ్‌లలో మునిగిపోయాడు! ప్రాణాలను గమ్య స్థానాలకు చేర్చాల్సిన చేతులే.. మృత్యువుతో చెలగాటమాడుతున్నాయి!' గద్వాల-మహబూబ్‌నగర్ మార్గంలో ఓ ఆర్టీసీ డ్రైవర్ చేసిన ఘోర నిర్లక్ష్యం ఇప్పుడు తీవ్ర దుమారం రేపుతోంది. ప్రజా రవాణా సంస్థ బాధ్యతారాహిత్యానికి, క్షేత్రస్థాయి అధికారుల నిద్రమత్తుకు ఈ ఘటనే పరాకాష్ఠ! మృత్యువుతో సర్కస్ విన్యాసాలు! శనివారం ఉదయం 8:30 గంటలకు గద్వాల నుంచి మహబూబ్ నగర్‌కు బయలుదేరిన ఆర్టీసీ బస్సు (TS 06 UB 8109)లో ఈ ఘోరం వెలుగుచూసింది. రోడ్డుపై వేగంగా దూసుకెళ్తున్న బస్సు.. కానీ డ్రైవర్ చూపు మాత్రం రోడ్డుపై లేదు, చేతిలోని సెల్‌ఫోన్‌పైనే



ఉంది! క్షణకాలం దృష్టి మళ్లినా వందల కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదమున్నా, సదరు డ్రైవర్‌కు ఏమాత్రం భయం లేకుండా వ్యవహరించాడు. ఈ ప్రాణాంతక డ్రైవింగ్‌ను ఓ ప్రయాణికుడు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి సోషల్ మీడియాలో పెట్టడంతో ఆ వీడియో నెట్టింట తీవ్ర ఆగ్రహజ్వాలలు రేపుతోంది. నిబంధనలన్నీ బూడిదలో పోసిన పన్నీరేనా? కాగితాలకే పరిమితమైన హెచ్చరికలు: డ్రైవింగ్ సమయంలో ఫోన్ వాడితే కఠిన చర్యలు అంటూ ఆర్టీసీ ఇచ్చే మైక్ ప్రకటనలు, సర్క్యులర్లు కేవలం ప్రచారానికేనా అని ప్రయాణికులు మండిపడుతున్నారు. పర్యవేక్షణ శూన్యం: ప్రయాణికుల నుంచి ఛార్జీలు గుంజడంలో ఉన్న శ్రద్ధ.. వారి భద్రతపై అధికారులకు లేకపోవడమే ఈ పరిస్థితికి కారణమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏం జరిగాక స్పందిస్తారు?: బస్సు అదుపుతప్పి లోయలో పడి ఏదైనా ఘోర ప్రమాదం జరిగిన తర్వాత కానీ అధికారులకు కళ్లు తెరవవా? అని ప్రయాణికులు నిలదీస్తున్నారు. సస్పెన్షన్ కాదు.. ఊచలు లెక్కించాల్సిందే! ప్రాణాలతో చెలగాటమాడిన సదరు డ్రైవర్‌పై కేవలం కంటి తుడుపుగా సస్పెన్షన్ వేటు వేసి చేతులు దులుపుకోకుండా, తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేసి డిస్మిస్ చేయాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజా రవాణాను 'మృత్యు రథాలు'గా మార్చేస్తున్న ఇలాంటి బాధ్యతారాహిత్యులపై టీజీ ఎస్ ఆర్ టి సి మేనేజింగ్ డైరెక్టర్ తక్షణమే కఠిన చర్యలకు ఆదేశించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న సదాశివపేట ఉపాధ్యాయులు




**సదాశివపేట్ వుదయం**

భారత మాజీ రాష్ట్రపతి డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ లో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో సదాశివపేట మండలం నుండి ఆరుగురు ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకోన్నారు.

అవార్డు గ్రహీతలు:కృష్ణయ్య ప్రధానోపాధ్యాయులు పెద్దాపూర్ ఉన్నత పాఠశాల,అస్మా సుల్తానా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎస్.ఎ ఫిజికల్ సైన్స్ (ఉర్దూ) సదాశివపేట్,శ్రీనివాస్ ఫిజికల్ డైరెక్టర్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల సదాశివపేట్,



బి. జర్నయ్య సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడు,నిజాంపూర్ ప్రాథమిక పాఠశాల,జి. నవనీత సెకండరీ గ్రేడ్ టీచర్, నిజాంపూర్ కాలనీ,ఎం.డి అర్షద్ ప్రాథమిక పాఠశాల (ఉర్దూ)వెల్టూర్,వీరు ఈ పురస్కారాలను జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంజయ్య, ఎమ్మెల్సీ అంజిరెడ్డి,జిల్లా విద్యాధికారి రోహిణి చేతుల మీదుగా అందుకున్నారు.ఈ సందర్భంగా

మండల విద్యాధికారి శంకర్ మాట్లాడుతూ సదాశివపేట మండలానికి ఆరు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు రావడం సంతోషకరమైన విషయం అన్నారు. ఇందులో ఉపాధ్యాయుల కృషి ఉందన్నారు. అవార్డులను అందుకున్న ఉపాధ్యాయులను మండల విద్యాధికారి యన్ శంకర్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, సాయిలు, రామకృష్ణ, ఉపాధ్యాయులు మల్లేశం తదితరులు

# పేద బడుగు బలహీన వర్గాలకు సీఎం సహాయ నిధి ఒక వరం

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 05(వుదయం)**

బడుగు బలహీన వర్గాలకు సీఎం సహాయక నిధి ఒక వరం అని నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలోని తన నివాసంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్ అన్నరు. నారాయణఖేడ్ నియోజకవర్గం మానూర్ మండలం దూదగొండ గ్రామానికి చెందిన జగన్నాథ్, తండ్రి: శంకరప్ప ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన 4 లక్షల ఎల్ ఓ సి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు సీఎం సహాయనిధి ఒక వరం లా నిలుస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోనే ప్రతి ఇంటికి కాంగ్రెస్ పార్టీ పెట్టిన పథకాలు అందజేస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని గుర్తు చేశారు. నారాయణఖేడ్ నియోజకవర్గం లో కాంగ్రెస్



పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని నేరుగా లబ్దారిని వద్దకే చేరాలంటే అది కేవలం కాంగ్రెస్ వాడుతూనే సాధ్యమని గుర్తు చేశారు.ఈ కార్యక్రమం లో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు శివకాంత్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

# బొమ్మారెడ్డిగూడెం రైతులకు కెనాల్ ద్వారా సాగునీరు అందించాలని కాంగ్రెస్ నాయకుల వినతి..

**సంగారెడ్డి ,వుదయం**

చౌటకూర్ మండలం బొమ్మారెడ్డిగూడెం గ్రామ శివారులోని రైతులకు సాగునీరు అందించేందుకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కుమ్మరి సాయిలు, మేఘరాజ్ నాయక్, మహేష్ రాథోడ్ అధికారులను కలిసి వినతిపత్రం సమర్పించారు.

సింగూర్ కెనాల్ ద్వారా బొమ్మారెడ్డిగూడెం పరిధిలోని పోష్‌కుంట, ఏశ్వమ్ చెరువు, గొల్లకుంట, నాన్ చెరువు, కోమటి చెరువులకు నీటిని అందించాలని కోరారు. ఈ చెరువులకు సింగూర్ కెనాల్ నీరు అందితే సుమారు 1500 ఎకరాలకు చౌటాకుర్ రెవెన్యూ పరిధి లోని గ్రామాలు సాగునీరు అందే అవకాశం ఉందని తెలిపారు.

ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కుమ్మరి సాయిలు, మేఘరాజ్ నాయక్, మహేష్ రాథోడ్ కలిసి ఎస్‌ఈ యశస్వి, ఈఈ భీం గారికి వినతిపత్రం అందజేశారు.

సాగునీటి సమస్యను మంత్రి దామోదర్ రాజనర్సింహ గారి దృష్టికి తీసుకెళ్లగా, మంత్రి వెంటనే సంబంధిత అధికారుల



తో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు.మంత్రి ఆదేశాలతో అధికారులు సైతం సానుకూలంగా స్పందించి, కెనాల్‌కు సంబంధించిన పనులను వెంటనే చేపట్టి, రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు..

# రాష్ట్రంలో రాబందు సర్కార్

- మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఆరోపణ
- జోగిపేటలో బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో విద్యార్థుల ర్యాలీ
- ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్

**వట్టిపల్లి, సెప్టెంబర్ 5 (వుదయం ప్రతినిధి)**

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సంగారెడ్డి జిల్లా జోగిపేటలో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీఆర్ఎస్,వీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన విద్యార్థులతో కలిసి కదం తొక్కారు.విద్యార్థులు, బీఆర్ఎస్,వీ కార్యకర్తలతో కలిసి మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ భారీ ర్యాలీ మరియు మానవహారంలో పాల్గొన్నారు ప్రభుత్వం సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడం వల్ల పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని చంటి క్రాంతి కిరణ్ ఆరోపించారు.రాష్ట్రంలోని హాస్టళ్లలో కనీస సౌకర్యాలు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ఇదే విధంగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని బీఆర్ఎస్‌వీ నేతలు హెచ్చరించారు.ఈ సందర్భంగా పలువురు విద్యార్థునిలు సీఎం రేవంత్ రెడ్డి పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.



పాల్గొన్నారు.




# కేసీఆర్ నగర్ గణేష్‌కు అరుదైన గౌరవం

- ఉత్తమ ఫైటర్‌గా ప్రతిష్ఠాత్మక పురస్కారం

**వుదయం, తెల్లాపూర్ ప్రతినిధి (సెప్టెంబర్ 5)**

రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ డివిజన్ కేసీఆర్ నగర్ ఫేజ్-2లోని 72వ బ్లాక్‌కు చెందిన కరాటే మాస్టర్ గణేష్‌కు ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఫైటర్ అవార్డు లభించింది. మాసబ్‌ట్యాంక్‌లోని ఎస్‌సీఎఫ్ కోచింగ్ ఫౌండేషన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో గణేష్‌ను అవార్డుతో సత్కరించారు. అంతర్జాతీయ స్థాయి మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ షౌకత్ అలీ కార్యక్రమంలో పాల్గొని గణేష్‌ను అభినందించారు. కరాటే రంగంలో ప్రతిభ కనబరుస్తూ, యువతకు శారీరక దృఢత్వంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా శిక్షణ అందిస్తున్న గణేష్‌కు ఈ అవార్డు రావడం పట్ల కేసీఆర్ నగర్ ఫేస్02 వాసులు, కరాటే విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.



# గ్రేటర్ హైదరాబాద్



## హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 200 వారాల మహా అన్నదాన యజ్ఞం

**శేరిలింగంపల్లి ,సెప్టెంబర్ 05 (వుదయం):**

శేరిలింగంపల్లి నియోజకవర్గం లోని చందానగర్ లో నీ హోప్ ఫౌండేషన్ కార్యాలయంలో నిర్వహిస్తున్న అన్న సమారాధన కార్యక్రమం ఇప్పటికీ 200 వారాలు పూర్తి చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా హోప్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కొండ విజయ్ మాట్లాడుతూ ప్రతి శనివారం క్రమం తప్పకుండా హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎందరికో అన్న సమారాధన చేయటం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రతి వారం ఇది ఒక యజ్ఞంగా భావించి జరుగుతున్నామని ఆయన అన్నారు. పేదలు మరియు బడుగు బలహీన వర్గాల ఆకలి తీర్చడంలో ఉన్న సంతృప్తి మరే కార్యక్రమంలోనూ లభించదని ఆయన సంతోషాన్ని వ్యక్తపరిచారు. ప్రతి ఒక్కరి కడుపు నింపడమే చేయంగా మా సంస్థ పని చేస్తుందని అంతేకాకుండా విద్యార్థులకు బడుగు బలహీన వర్గాలకు





ఆర్థిక సహాయాన్ని అందించడంలో మేము ముందుంటామని ఆయన తెలిపారు. ఈ అన్నదాన కార్యక్రమం లో ప్రేమగా ఆప్యాయతతో నిండిన భోజనాన్ని మేము అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

ప్రతి వారం క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న ఈ మహా యజ్ఞంలో సుమారు 4000 మంది కి సంతృప్తికరంగా భోజనాన్ని అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. కేవలం నేనొక్కడినే కాకుండా నా సిబ్బంది కృషి ఎంతో ఉందని ఆయన కొనియాడారు. రానున్న కాలంలో యొక్క నిత్య అన్నదాన మహా యజ్ఞం నిర్విఘ్నంగా కొనసాగుతుందని ఆయన హామీ ఇచ్చారు. రానున్న కాలంలో హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని దానికి ప్రతి ఒక్క రూ సహకరించాలని ఆయన కోరారు.

## కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై ఘన సంబరాలు

- బీఆర్ఎస్ విమర్శలకు ఆదం సంతోష్ కుమార్ ఘాటు కౌంటర్
- సికింద్రాబాద్‌లో 8 డివిజన్ల నుంచి భారీ ర్యాలీ

**ముషీరాబాద్, సెప్టెంబర్ 05(వుదయం)**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా సికింద్రాబాద్ నియోజకవర్గంలో కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా సంబరాలు నిర్వహించారు. నియోజకవర్గంలోని 8 డివిజన్లలో నాయకులు, కార్యకర్తలు టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేస్తూ వేడుకలు నిర్వహించారు. అనంతరం ఆయా డివిజన్ల నుంచి భారీ ర్యాలీలుగా బయలుదేరి సీతాఫల్మండి అంబేద్కర్ చౌరస్తాకు చేరుకున్నారు.అక్కడి నుంచి కాంగ్రెస్ శ్రేణులు ర్యాలీగా రాజీవ్ గాంధీ విగ్రహం వద్దకు చేరుకుని నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదం సంతోష్ కుమార్ రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

**ఆరు గ్యారంటీల అమలుకు పెద్దపీట**

ఈ సందర్భంగా ఆదం సంతోష్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, కొత్త రేషన్ కార్డులు, పెన్షన్ల పెంపు, సన్నబియ్యం పంపిణీ, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, మహిళలకు ఉపాధి అవకాశాలు తదితర సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు.ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తూ తెలంగాణను ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు.

**బీఆర్ఎస్ విమర్శలకు ఘాటు కౌంటర్**

కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకోవడాన్ని చూసి బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేక ప్రజలను మభ్యపెట్టేందుకు నిరసనలు, విమర్శలు చేస్తున్నారని ఆదం సంతోష్ కుమార్ విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నేరుగా ఎదుర్కొనే ధైర్యం లేక ప్రజల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు ప్రతిపక్షాల ప్రచారాన్ని గమనిస్తున్నారని, వాస్తవాలను అర్థం చేసుకుంటున్నారని అన్నారు.

**పదేళ్లు ఎమ్మెల్యేగా ఉండి సికింద్రాబాద్‌కు ఏం చేశారు?**

గతంలో పదేళ్లు ఎమ్మెల్యేగా పనిచేసిన పద్మారావు గౌడ్ సికింద్రాబాద్ అభివృద్ధికి ఏం చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలని ఆదం సంతోష్ కుమార్ ప్రశ్నించారు. సికింద్రాబాద్ ప్రజలకు అవసరమైన వాణిజ్య కార్యకలాపాలు, సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయం, రోడ్ల విస్తరణ వంటి సమస్యలపై ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన రేషన్ కార్యాలయాన్ని నాంపల్లికి తరలించిన ఘనత గత పాలకులదేనని విమర్శించారు.పదేళ్లు అధికారంలో ఉండి సికింద్రాబాద్ అభివృద్ధికి ఏం చేశారో ప్రజలకు వివరించాలని, కుటుంబ రాజకీయ ప్రయోజనాలకు కాకుండా ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన అన్నారు.

**అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలి**

కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ఆరోపణలను నాయకులు, కార్యకర్తలు ఎక్కడికక్కడ ఖండించాలని ఆదం సంతోష్ కుమార్ పిలుపునిచ్చారు. ప్రజల మధ్యకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని సూచించారు.

**రాబోయే రోజుల్లో కాంగ్రెస్**

ప్రభుత్వం మరింత వేగంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రటరీ ర్యాల రాజేంద్ర యాదవ్, జలంధర్ రెడ్డి, అమర్నాథ్ గౌడ్, సందీప్, గండికోట కుమార్, శిల్పా చారి, అనిల్, హైజా, సతీష్, మహేందర్, జగీర్, అనుర్ధిన్, నజీర్, శశాంక్ తదితరులు పాల్గొన్నారు.





## విద్యార్థులకు సృజన శీలత ఉపయుక్తం

- ప్రతిభ విద్యానికేతన్ హై స్కూల్ ప్రిన్సిపల్ సార శ్రీనివాస్
- పాఠశాలలో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి, ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**జిన్నారం 5సెప్టెంబర్ (వుదయం ప్రతినిధి)**

విద్యార్థులకు సృజన శ్రీలత ఎంతో ఉపయుక్తమని జిన్నారం విద్యానికేతన్ హై స్కూల్ ప్రిన్సిపల్ సార శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రమైన జిన్నారంలో గల ప్రతిభ విద్యానికేతన్ హై స్కూల్ లో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ, శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఉపాధ్యాయ విద్యార్థి బృందం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విశ్వ సమాజానికి జ్ఞాన నేత్రాలన్నారు. విద్యార్థులు చదువుల్లో సృజన శీలతతో గొప్పగా రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ లను ప్రత్యేకంగా సన్మానించారు. జన్మాష్టమి వేడుకలను చిన్నారులు ఘనంగా నిర్వహించారు. ఆటపాటలతో పలువురు విద్యార్థులు అలరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా 5సెప్టెంబర్ (వుదయం ప్రతినిధి)**

విద్యార్థి జీవితంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ముఖ్యమైనది, భారతదేశ మాజీ రాష్ట్రపతి, గొప్ప తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణని స్మరించుకుంటూ ఉపాధ్యాయులందరికీ నేడు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ (టీచర్స్ డే) శుభాకాంక్షలు తెలిపారు - జిల్లా కలెక్టర్ మను చౌదరి.ఈ సందర్భంగా జిల్లా విద్యా శాఖ అధికారి రేణుక దేవి, జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి వినోద్ కుమార్, వివిధ ఉపాధ్యాయ యూనియన్ సభ్యులు తో కలిసి జిల్లా కలెక్టర్ మను చౌదరి జ్యోతి ప్రజ్వలన గావించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడతూ జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకున్న ప్రతి ఒక్కరూ తమ విజయంలో పాఠశాల ఉపాధ్యాయుల పాత్రను ఎంతో మరువలేనిదిగా భావిస్తారని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థుల కోణం నుండి ఆలోచించి పాఠాలు అర్థమయ్యేలా చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.ఉపాధ్యాయులు నేర్చుకోవల్సిన అంశాలు విద్యార్థులకు నేర్పించవల్సిన అంశాలు పై చర్చిస్తూ విద్యార్థులో ఆత్మ విశ్వాసం, వ్యక్తిత్వ వికాసం పెంచడం,



నిరంతర అభ్యాసము, విషయ పరిజ్ఞానన్ని తెలుసుకొనే జిజ్ఞాసను పెంచుకొనే విధంగా పిల్లలను తీర్చిదిద్దాలన్నారు.పుస్తకాలు జ్ఞానాని ఇస్తాయి కానీ దాని ఎలా ఉపయోగించుకోవాలో నేర్పేది ఉపాధ్యాయులే, సమాజములో మంచి మనిషిగా ఎదగడానికి క్రమ శిక్షణ తో కూడిన విద్య , ఆచారణాత్మకమైన విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు నేర్పించేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులని కోరారు. విద్యార్థులలో ఉన్న లోపాలను సరిదిద్ది వారిలోని నైపుణ్యాని వెలికి తీసి సులభమైన పద్ధతిలో, అర్థమయే రీతిలో బోధన చేయాలన్నారు. విద్యార్థి విజయాన్ని మెచ్చుకొని సంతోషపడే గురువు అదే విద్యార్థి వైఫల్యం చెందితే ధైర్యము నింపి మళ్ళీ ప్రయత్నించే విధముగా ప్రోత్సహించాలి. ప్రతి రోజు విద్యార్థులు కనీసం ఐదు నుంచి పది నిమిషాల పాటు దినపత్రికలు చదివించేలా చూడాలని తద్వారా విద్యార్థులో సామాజిక విలువలు పెంపొందుతాయని, భవిష్యత్తు లో పోటి పరీక్షలకు ఉపయోగ పడతుందని అన్నారు.

పాఠశాల వదిలి వెళ్ళిన తర్వాత కూడా మనతో నిలిచిపోయేదే నిజమైన చదువు. పాఠశాలలో నేర్చుకున్న విషయాలను విద్యార్థి తన జీవితంలో, సమాజంలో వర్తింపజేయగలిగితే ఉపాధ్యాయుని బాధ్యత సంపూర్ణంగా నెరవేరినట్లు అవుతుందని జిల్లా లో పని చేస్తున్న ఉపాధ్యాయుల అందరికి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

మారుతున్న కాలానికి అనుగుణనంగా ఉపాధ్యాయులు ఆధునికరణను ఆకలింపు చేసుకుంటూ పాఠ్యప్రణాళిక లను రూపొందించుకొని విద్యార్థులకు ఆదర్శమైన, ఆధునికరమైన విద్యను అందిస్తూ విద్య వ్యవస్థను పటిష్టం చేసుకుంటూ ముందుకు పొత్తున్నాము అని జిల్లా విద్య శాఖ అధికారి అన్నారు. దేశానికి కావలసిన బావితరాలను అందించడానికి ఉపాధ్యాయులు ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. అనంతరము జిల్లా లో ఉత్తమ ఉపాధ్యాయులకు అదనపు కలెక్టర్ (లోకల్ బాడిస్) ఫైజాన్ అహ్మద్ శాలువ కప్పి ప్రశంస పత్రాలను అందచేస్తూ పూల మొక్కల తో సత్కరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అజాత శత్రువు ఎల్లన్న: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి





- ఘనంగా కార్మిక నాయకుడు ఎల్లన్న ప్రథమ వర్ధంతి

**రామచంద్రపురం సెప్టెంబర్ 5 (వుదయం):**

కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణతో పాటు ప్రత్యేక తెలంగాణ సాధన కోసం తన చివరి శ్వాస వరకు అంకితభావంతో పని చేసిన మహోన్నత నాయకుడు ఎల్లన్న అని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.శనివారం తెల్లాపూర్ పరిధిలోని జి. ఎల్లయ్య ఎంక్లేవ్‌లో నిర్వహించిన కార్మిక నాయకుడు దివంగత ఎల్లన్న ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎల్లన్న విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం ఎల్లన్న నిరంతరం పోరాటం చేశారని, మలిదశ తెలంగాణ ఉద్యమంలోనూ కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. పార్టీలకు అతీతంగా అందరి మన్ననలు పొందిన ఎల్లన్న అజాతశత్రువుగా చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. ఆయన నిస్వార్థ సేవా జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవానందం,

మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దేవేందర్ యాదవ్, మల్లారెడ్డి, ఎల్లన్న కుటుంబ సభ్యులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ-2026 ప్రక్రియను వేగవంతం చేయాలి

**మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా 5సెప్టెంబర్ (వుదయం ప్రతినిధి)**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 2026లో నోటీసుల జారీ అనంతరం సంబంధిత ఓటర్ల నుండి స్వీకరిస్తున్న ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి.శనివారం జిల్లాలోని అంతాయిపల్లి, ఉప్పరపల్లి గ్రామంలోని పోలింగ్ స్టేషన్ లను ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 2026లో భాగంగా జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ-2026లో హియరింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని తెలిపారు. ఈ క్రమంలో



జిల్లాలో మ్యాప్పింగ్ జరగకుండా ఉన్న ఓటర్లు మరియు ఓటర కార్డ్ లో ఉన్న వ్యత్యాసల (Anomalies) కేటగిరీల ఓటర్లకు జారీ చేసిన నోటీసులకు సంబంధించి ఓటర్లు అందిస్తున్న ధ్రువపత్రాల విచారణ వేగవంతం చేయాలని, అర్హత గల ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని తెలిపారు. జాబితాలో గల ఓటర్లు తమ వివరాలను సమర్పించేలా రాజకీయ పార్టీలు బూత్ స్థాయి ఏజెంట్ల ద్వారా చర్యలు తీసుకోవాలని, ఎస్.ఐ.ఆర్.-2026 ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని తెలిపారు.

కొత్తగా నమోదు చేసుకునే ఓటర్లు ఫారం -6, చిరునామా మార్పు కోసం ఫారం - 7 , మరణించిన/శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలిపోయిన ఓటర్లు ఫారం - 8 ఓటర్లకు అందచేసి, అవగాహన కల్పిస్తూ ఈ ప్రక్రియను తొందరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ధ్రువపత్రాలను ధృవీకరించిన అనంతరము సంబందిత పత్రాలను అప్లోడ్ చేయాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో కీసర ఆర్డిఓ వెంకట రెడ్డి, ఏఈఆర్ఓ మధుసూదన్ రెడ్డి , బిఎల్ఓలు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## తెల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం

- విద్యార్థులకు సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన

**రామచంద్రపురం సెప్టెంబర్ 5 (వుదయం) :**

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కల్లూరు పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్, సబ్‌ఇన్‌స్పెక్టర్‌లు తెల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

అనంతరం విద్యార్థులతో ముచ్చటించిన పోలీసులు సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, పోక్సో



చట్టం, డ్రగ్స్ మరియు మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, లింక్‌ల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.

విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండటంతో పాటు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పోలీసులు సూచించారు. బాలల భద్రతకు సంబంధించిన ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులను సంప్రదించాలని తెలిపారు.

విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, భద్రతపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని పాఠశాల ఉపాధ్యాయులు పేర్కొన్నారు.





**ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని, గౌరవనీయులైన సైబరాబాద్ పోలీస్ కమిషనర్ గారి ఆదేశాల మేరకు అమీన్పూర్ పోలీసుల ఆధ్వర్యంలో బీరంగూడ ZPHS పాఠశాలలోనీ 907 విద్యార్థుల సమక్షంలో 33 ఉపాధ్యాయులకు విద్య రంగం లో వారు చేసిన సేవలను గుర్తిస్తూ SHO శ్రీ ఎం. ప్రవీణ్ రెడ్డి గారు, CI ఆఫ్ పోలీస్ ఘనంగా సన్మానించీ ,భావితరాల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో వారు అందిస్తున్న అంకితభావంతో కూడిన సేవలను అభినందించారు.**

## లద్దాఖ్‌లో భారత్ తొలి రాతి చెక్ డ్యామ్.. పెరిగిన

సింధూ నదీ జలాలను సమర్థంగా వినియోగించుకునేందుకు లద్దాఖ్‌లోని ) ఉప్షీ ప్రాంతంలో భారత్ తొలి రాతి చెక్‌డ్యామ్‌ను నిర్మించింది. సిమెంట్‌ను వినియోగించకుండా రాతితో చేపట్టిన ఈ నిర్మాణంతో నదిలో నీటిమట్టం దాదాపు 10 అడుగుల మేర పెరిగింది. దీంతో చాలాకాలంగా నీటి కొరత ఎదుర్కొంటున్న స్థానిక గ్రామాలకు సాగునీరు అందే అవకాశం సుగమమైంది. ఈ చెక్‌డ్యామ్ సుమారు 40 మిలియన్ లీటర్ల నీటిని నిల్వ చేసే సామర్థ్యం కలిగి ఉంది. ఈ ప్రాంతంలో అత్యంత లోతులో సింధూ నది ప్రవహిస్తుండటంతో గతంలో నీటిని పైకి తోడటం రైతులకు కష్టంగా ఉండేది.

## ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా పాలన లక్ష్యం

- వెయ్యి రోజుల పాలనలో పేదలకు అండగా అనేక సంక్షేమ పథకాలు
- బీఆర్ఎస్ అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మొద్దు: భానూరి శివశంకర్ గౌడ్

**చేవెళ్ల,సెప్టెంబర్05 (వుదయం)**

కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పేదలు, రైతులు, మహిళలు, వృద్ధులకు నేరుగా ప్రయోజనాలు అందుతున్నాయని శనివారం చేవెళ్ల నియోజకవర్గం టీపీసీసీ-ఐఎన్‌టీయూసీ లేబర్ సెల్ ప్రధాన కార్యదర్శి భానూరి శివశంకర్ గౌడ్ అన్నారు.కాంగ్రెస్ ప్రజా పాలనలో వెయ్యి రోజులుగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నామని తెలిపారు.పేదలకు సన్నబియ్యం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు, సీఎం రిలీఫ్ ఫండ్, షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి, వృద్ధులకు పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రైతులకు ఉచిత వ్యవసాయ విద్యుత్, రైతు భరోసా, రైతు రుణమాఫీ, అర్హులైన పేదలకు రేషన్‌కార్డులు వంటి పథకాల ద్వారా ప్రభుత్వం ప్రజలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.గత పాలనపై విమర్శలుగత పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని



భానూరి శివశంకర్ గౌడ్ విమర్శించారు. పేదలకు రేషన్ కార్డులు అందించడంలో, గ్రామాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణంలో ఆశించిన స్థాయిలో ప్రయోజనాలు అందలేదని అన్నారు.ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఒకవైపు ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూనే, మరోవైపు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తోందని తెలిపారు.బీఆర్ఎస్ ప్రచారాలను నమ్మొద్దుకాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఓర్వలేని బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని, వాస్తవాలను గమనించి తగిన బుద్ధి చెప్పాలని భానూరి శివశంకర్ గౌడ్ పిలుపునిచ్చారు.ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

**IN THE COURT OF THE HON'BLE II ADDITIONAL JUNIOR CIVIL JUDGE – CUM- XIII- ADDL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS, RANGAREDDY DISTRICT,AT: RAJENDRANAGAR.**
**O.S.No. 506 OF 2026**

**Between :**
1. Sawan Gupta S/o Rajendra Kumar Gupta Aged about: 52 years, Occ. Private Employee R/o # 501, Spring Block Windsor Four Seasons, Behind Meenakshi Temple, Bangalore South, Bannerghatta Road, Karnataka – 560 076.
2. Madhuvan Gupta S/o Rajendra Kumar Gupta Aged about: 48 years, Occ. Private Employee R/o 6 LH 1203, Lanco Hills, Lanco Hills Road,DPS School, Manikonda, Puppalguda, Rajendranagar, Ranga Reddy District, Telangana – 500 089. ...Plaintiffs

**AND**
1. The Tehsildar, Gandipet Mandal Rangareddy District, Telangana.
2. All Concerned ...Defendants

All Concerned

Please take Notice that the above-named Plaintiffs have filed the suit for Declaration to declare the Plaintiffs No. 1 to 2 as the Legal Heirs of Late. Rajendra Kumar Gupta and Late. Smt. Urvashi Gupta. That if any person having any objections, claims, they may appear before the Hon'ble II Additional Junior Civil Judge, R.R. District, at Rajendranagar on Dt. 23.09.2026 at 10.30 Am in person or through the Counsel failing which the matter will be decided exparte as per law.

**//BY ORDER OF HON'BLE II ADDITIONAL JUNIOR CIVIL JUDGE – CUM- XIII- ADDL. JUDICIAL MAGISTRATE OF FIRST CLASS, RANGAREDDY DISTRICT, AT: RAJENDRANAGAR. //**

**Sd/-**
**Anand Kumar Tiwari**
**Ashish Kumar Pandey**
**AdvocateHyderabad (Town & Dist)-500060. Phone:9440687160.**

**IN THE COURT OF THE HON'BLE Is t. A.J.C.J,L.B.NAGAR,R.DIST**
**I.A.NO. OF 2026**
**O.S.NO. 684 OF 2026**

**Between :**
Uppalapu Ravindar Babu S/O Late, Nancharaiah & Late,Iswaramma,Age:62yrs,Occ:Business,RO,H.NO-3-11-67, 2nd Floor,Road No-5,R.T.C.Colony, Opp:Kamini Hospital,L.B.Nagar,R.R.Dist, And Another, Petitioner's/ Plaintiff's,1&2,

**AND**
1.The Tahsildar, Saroornagar,Mandal, RangaReddy Dist,
2.All Concerned
Respondent's/Defendants

Sub:-The above O.S.NO,684/2026,The Plaintiff's filed Legal hair Certificat,due to The Respondents appear before the Honble court On 05-10-2026,10.30. A.M. other wise the court will decide Exparte.

(AS PER THE COURT ORDER)

Sd/-
P.Ram Mohan,
Advocate
Counsel for Plaintiffs 1&2
Cell No: 9246796092

**IN THE COURT OF THE HON'BLE 25 thADDL CHIEF JUDGE CITY CIVIL COURT AT HYDERABAD**
**MVOP NO. 1816 OF 2025**

**Between :**
Shashank Vadde ...Petitioner
**AND**
Srinivas Mudavath & Others ...Respndents

To,
1). Srinivas Mudavath, S/o:Peerya Nayak, Age:Major, Occ: Business, R/o:8-1-106/A-96, Vinobha Nagar Colony, Shaikpet, Golconda, Hyderabad-500008. 2).Santosh Mudavath, S/o:Peerya Nayak Mudavath, Age:17 yeras, Occ: Rider, R/o:8-1-106/A-96, Vinayak Nagar, Shaikpet, Hyderabad.

Take this notice that the petitioner herein has filed the above M.V.O.P against you ar another respondent by claming compensation before the above mentioned court. Hence the above M.V.O.P is posted for your appearance and counter. If you fail to appear before the abc mentioned court on 16-09-2026 by 10.30 a.m., the matter will be decided in your absence.

**(By Order of the Court)**
At: Chatta Bazar, Hyderabad.
Date:06-09-2026

**Sd/-**
**PUTTA THIRUPATHI REDDY (AP/52/19) MA(Eco),LLM(Con) ADVOCATE**
**Flat No:1, Ravi Residency Apartment, H.No:13-4-48/F/1, Opp: Central Bank India, left side to Rajadhani Theater, Vikas Nagar, Dilsukh Nagar, Hyderabad (Town & Dist)-500060. Phone:9440687160.**




ఉపాధ్యాయులపట్ల గౌరవం చూపాలి

"అంకితభావం, నిబద్ధత గల ఉపాధ్యాయుల పట్ల దేశ పౌరులు సదా గౌరవ భావం చూపాలి. వారి సహకారంతో మన దేశం కొత్త విషయాలను నేర్చుకుంటూ కొంగొత్త శిఖరాలకు చేరుకోవాలని హృదయపూర్వకంగా ఆకాంక్షిస్తున్నాను. మంచి ఉపాధ్యాయులు తమ విద్యార్థులు ఉత్తమమైన వ్యక్తులుగా మారాలన్న తపనతో పనిచేస్తుంటారు. ఈ దశలో నవతరం విద్యార్థులు వ్యక్తిగత, సామూహిక నైపుణ్యాల సాధన కోసం శ్రమిస్తూ 'దేశానికే అగ్ర ప్రాధాన్యం' అనే స్ఫూర్తితో ముందుకు సాగేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి."

**- ద్రౌపదీ ముర్ము, భారత రాష్ట్రపతి**

## వే'మన' పద్యం

**గంగ పాఱు నెపుడు కదలని గతితోడ**
**ముఱికి వాగు పాఱు మ్రోఁతతోడ**
**పెద్ద పిన్నతనము పేరిమి యీలాగు**
**విశ్వదాభిరామ! వినుర వేమ**



# సంపాదకీయం

## క్యాబినెట్‌లో చోటెవరికి?

రాష్ట్ర మంత్రివర్గం నుంచి కొండా సురేఖను బర్తరఫ్ చేసిన నేపథ్యంలో క్యాబినెట్ పునర్ వ్యవస్థీకరణపై ఇప్పుడు అందరి దృష్టి పడింది. అధికార హస్తం పార్టీలో ఇందుకు సంబంధించిన హడావుడి అప్పుడే మొదలైంది. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో అవి ముగియగానే మంత్రివర్గ విస్తరణ ఉంటుందని సమాచారం. సీఎం రేవంత్ రెడ్డి ఈ మేరకు కాంగ్రెస్ హైకమాండ్‌తో సంప్రదింపులు, సమాలోచనలు పూర్తి చేసినట్టు సమాచారం.

నిబంధనల ప్రకారం (అసెంబ్లీలో ఎమ్మెల్యేల సంఖ్యనుబట్టి) రాష్ట్ర క్యాబినెట్‌లో 18 బెర్తులున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే 16 మందిని మంత్రివర్గంలోకి తీసుకున్నారు. ఆ రెండు ఖాళీల తోపాటు ఇప్పుడు కొండా సురేఖ బర్తరఫ్‌తో మరో మంత్రి పదవి ఖాళీ అయ్యింది. అంటే ఇప్పటికప్పుడు మంత్రివర్గాన్ని పునర్ వ్యవస్థీకరిస్తే మొత్తం మూడు బెర్తులను నింపాలి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్టానం, సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పలు అంశాలపై దృష్టి సారించారు. ముఖ్యంగా సామాజిక సమీకరణాలు, సీనియారిటీ, పార్టీకి విధేయులుగా ఉండటం, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లటం, రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు నాయకులు, కార్యకర్తలతో మమేకం కావటం, వివిధ సందర్భాల్లో క్యాడర్‌ను సమన్వయం చేసుకుని, పార్టీ కార్యక్రమాలను జయప్రదం చేయటం, ప్రతిపక్షాలు, ముఖ్యంగా బీఆర్ ఎస్‌ను ఎండగట్టటం తదితరాంశాల ప్రాతిపదికగా తీసుకోవాలని వారు నిర్ణయించారు. ఈ విషయాలన్నింటిలో చేయి తిరిగిన వారిని తీసుకుంటే ఇటు పార్టీకి, అటు ప్రభుత్వానికి లాభమని సీఎం భావిస్తున్నారు. అలాంటి వారికే మంత్రివర్గంలో చోటు కల్పించాలని ఆయన నిర్ణయించారు.

ఈ నేపథ్యంలో పలువురు సీనియర్ల పేర్లు తెరపైకి వస్తున్నాయి. బీసీ సామాజిక వర్గానికి చెందిన కొండా సురేఖను బర్తరఫ్ చేసిన నేపథ్యంలో ఆ తరగతికి చెందిన పేర్లు ఎక్కువగా వినబడుతున్నాయి. వీటిలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేరు ప్రముఖంగా వినబడుతోంది. ప్రతిపక్ష బీఆర్ ఎస్, బీజేపీ మీద ఎప్పటికప్పుడు విరుచుకుపడుతుండటంతోపాటు సీఎల్పీలో వరసగా ప్రెస్‌మీట్లు నిర్వహిస్తుండటంతో ఆయన హైకమాండ్ దృష్టిలో పడ్డట్టు సమాచారం. ఆయనతోపాటు మరో విప్ బీర్ల ఐలయ్య, కార్పొరేషన్ ఛైర్మెన్ ఈరావత్రి అనిల్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి. ఎస్టీ సామాజిక వర్గం నుంచి సీతక్క మంత్రివర్గంలో కొనసాగుతున్నారు. కాగా లంబాడా సామాజికవర్గం నుంచి ఒకరికి మంత్రి పదవి ఇవ్వాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. ఈ రీత్యా దేవరకొండ ఎమ్మెల్యే బాలూ నాయక్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచందర్ నాయక్ పేర్లు ప్రముఖంగా వినబడుతున్నాయి. వీరితోపాటు పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్టు తెలిసింది. మంత్రివర్గ విస్తరణ అంశం తెరపైకి వచ్చిన ప్రతీసారి వీరిద్దరి పేర్లు తెరపైకి వస్తుండటం గమనార్హం. అయితే వీరిని క్యాబినెట్‌లోకి తీసుకోవాలంటే ముందుగా వారు ప్రస్తుతం నిర్వహిస్తున్న పదవులకు (పీసీసీ, స్పీకర్) రాజీనామా చేయాల్సి ఉంటుంది. కానీ... పార్టీలో అందరినీ కలుపుకుని ముందుకుపోతూ వివాదరహితుడుగా ఉన్న మహేశ్ కుమార్ గౌడ్‌ను, అసెంబ్లీని సుహృద్భావ వాతావరణంలో నడుపుతూ ఉన్న ప్రసాద్ కుమార్ ను ఆయా పదవుల్లోంచి ఇప్పటికిప్పుడు తొలగించే సాహసం హస్తం పార్టీ చేస్తుందా? అనేది సందేహాస్పదంగా ఉంది. ఒకవేళ వారితో ఆయా పదవులకు రాజీనామా చేయించి.. మంత్రివర్గంలోకి తీసుకున్నా, పీసీసీ పీఠానికి, స్పీకర్ పదవికి ఎవర్ని ఎంపిక చేయాలనేది కత్తిమీద సాములాంటిదని కాంగ్రెస్ నేతలు అభిప్రాయపడుతున్నారు. అందువల్ల పీసీసీ చీఫ్‌ను, స్పీకర్‌ను ఇప్పటికిప్పుడు కదలించకపోవచ్చనే వాదన బలంగా వినబడుతోంది. మరోవైపు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి... మంత్రిపదవిపై గంపెడాశలు పెట్టుకున్నారు. కానీ ఆయన అన్న కోమటిరెడ్డి వెంటకరెడ్డి ఇప్పటికే మంత్రిగా ఉన్న నేపథ్యంలో రాజగోపాల్ రెడ్డి ఆశ నెరవేరకపోవచ్చు. వీరితోపాటు నిజామాబాద్ నుంచి సీనియర్ నేత సుదర్శన్ రెడ్డి, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు కూడా మంత్రి పదవులను ఆశిస్తున్నారు. అయితే సుదర్శన్ రెడ్డి.. ప్రస్తుతం ప్రభుత్వ సలహాదారుడిగా కొనసాగుతుండగా, ప్రేమ్ సాగర్ రావు సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఛైర్మెన్ పదవిలో ఉన్నారు. అందువల్ల వీరిద్దరికి క్యాబినెట్‌లో చోటు దక్కే పరిస్థితి లేదు. ప్రస్తుతానికి ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి నిజామాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల నుంచి మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేదు.

ఆ రీత్యా ఆయా జిల్లాల నుంచి ఒకరికి క్యాబినెట్‌లో చోటు కల్పించాలనే డిమాండ్ కూడా ఉంది. అయితే రంగారెడ్డి జిల్లా ఎల్బీ నగర్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్‌కు అక్కడి నుంచి మంత్రి పదవి దక్కే అవకాశాలు లేకపోలేదని అధికార పార్టీ నేతలు అభిప్రాయపడుతుండటం గమనార్హం. ఏదైమైనా క్యాబినెట్ కూర్పులో పార్టీ అధిష్టానం, సీఎం రేవంత్ రెడ్డిదే తుది నిర్ణయమని వారు చెబుతున్నారు. మరి మూడు మంత్రి పదవులు ఎవరెవర్ని వరిస్తాయో వేచి చూడాలి.


**రచనలు పంపండి**

ఉదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020


# డా. ఇడికోజు శ్రీనివాసాచారి – సాహిత్య ప్రస్థానం

డా. ఇడికోజు శ్రీనివాసాచారి నల్లగొండ జిల్లా చండూరు మండల కేంద్రంలో కమ్మరి పెదనారాయణ, నారాయణమ్మ దంపతులకు జన్మించాడు. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయి అనేక కష్టనష్టాలను ఎదుర్కొన్నాడు. కుటుంబ పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పటికీ నిరాశకు లోనుకాకుండా విద్యపై దృష్టి సారించాడు. ముఖ్యంగా సోదరుడి ప్రోత్సాహం, సహకారంతో విద్యాభ్యాసాన్ని కొనసాగించి ఉన్నత విద్యను అభ్యసించాడు. తెలుగు సాహిత్యంలో ఎం.ఏ., బి.ఇడి., టీ.పి.టీ.తో పాటు పీహెచ్‌డీ పట్టాను పొందాడు. యూజీసీ నెట్, జేఆర్ఎఫ్, సెట్, టెట్, ఎస్ఆర్ఎఫ్ వంటి అర్హతలను సాధించడం ద్వారా తన విద్యా ప్రతిభను నిరూపించుకున్నాడు. ఉపాధ్యాయుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన శ్రీనివాసాచారి వివిధ పాఠశాలలు, కళాశాలల్లో తెలుగు బోధకుడిగా, అధ్యాపకుడిగా పనిచేశాడు. నాగార్జున ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల, కాకతీయ డిగ్రీ అండ్ పీజీ కళాశాల తదితర సంస్థల్లో బోధనా సేవలందించాడు. అనంతరం తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీలో ప్రభుత్వ జూనియర్ లెక్చరర్‌గా వివిధ కళాశాలల్లో పనిచేసి, ప్రస్తుతం టీజీఎంఆర్ఈఐఎస్ ప్రధాన కార్యాలయంలో తెలుగు సబ్జెక్ట్ రిసోర్స్ పర్సన్‌గా విద్యారంగంలో సేవలందిస్తున్నాడు. బోధనను కేవలం ఉద్యోగ బాధ్యతగా కాకుండా విద్యార్థుల్లో భాషా, సాహిత్య చైతన్యాన్ని పెంపొందించే సాధనంగా భావించడం ఆయన ప్రత్యేకత.

డా. శ్రీనివాసాచారి సాహిత్య ఆసక్తి ప్రధానంగా తెలంగాణ సాహిత్యం, నల్లగొండ జిల్లా సాహిత్యం, జానపద సాహిత్యం, గిరిజన సాహిత్యం, దళిత-బహుజన సాహిత్యం, భాష-సమాజ సంబంధాలు, జానపద కళలు, సాంస్కృతిక అధ్యయనాలు వంటి రంగాల చుట్టూ విస్తరించింది. ముఖ్యంగా ప్రధాన సాహిత్య చరిత్రలో తగినంత ప్రాధాన్యం పొందని ప్రాంతీయ కవులు, జానపద కళాకారులు, అట్టడుగు వర్గాల సాహిత్య స్వరాలను వెలికితీయడం ఆయన పరిశోధనలోని ప్రత్యేక లక్షణం. సాహిత్యాన్ని కేవలం సౌందర్య దృష్టితో కాకుండా సామాజిక, చారిత్రక, సాంస్కృతిక నేపథ్యంలో పరిశీలించడం ఆయన రచనల్లో కనిపిస్తుంది.

నల్లగొండ జిల్లా సాహిత్య చరిత్ర నిర్మాణంలో ఆయన చేస్తున్న కృషి ప్రత్యేకంగా ప్రస్తావించదగినది. 'ఉమ్మడి నల్లగొండ జిల్లా కవిత్వం' వంటి గ్రంథం ద్వారా జిల్లాలోని కవిత్వ సంప్రదాయాన్ని, కవుల సాహిత్య సేవను వెలుగులోకి తీసుకువచ్చాడు. 'నల్లగొండ జిల్లా ప్రాచీన కవిత్వం - పరిశీలన', 'నల్లగొండ జిల్లా కవులు-పండితులు', 'నల్లగొండ మండల సర్వస్వం', 'నల్లగొండ జిల్లా చరిత్ర-సంస్కృతి' వంటి అంశాలపై చేసిన పరిశోధనలు ప్రాంతీయ సాహిత్య చరిత్ర నిర్మాణానికి దోహదపడుతున్నాయి. ఒక ప్రాంతపు సాహిత్యాన్ని అక్కడి ప్రజల జీవితం, సంస్కృతి, చరిత్రతో కలిపి చూడాలనే దృక్పథం ఆయన రచనల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. జానపద సాహిత్యం ఆయన పరిశోధనా ప్రస్థానంలో మరో ప్రధాన విభాగం. ఒగ్గుకథ, పటం కథలు, జానపద ఆశుప్రబంధాలు, జానపద ప్రదర్శన కళలు, జానపద గిరిజన విజ్ఞానం, జానపద ఆశ్రిత కులాల పాటలు వంటి అంశాలపై ఆయన పరిశోధనా పత్రాలు, వ్యాసాలు రాశాడు. జానపద కళారూపాలను కేవలం వినోద సాధనాలుగా కాకుండా ప్రజల జీవన విధానం, వృత్తి సంస్కృతి, సామాజిక చరిత్ర, మౌఖిక జ్ఞాన సంపదకు ప్రతీకలుగా విశ్లేషించాడు. ఈ కృషి ద్వారా జానపద సాహిత్యాన్ని అకడమిక్ అధ్యయనానికి దగ్గర చేయడానికి ప్రయత్నించాడు. దళిత, బహుజన, గిరిజన సాహిత్యాల పట్ల కూడా ఆయనకు ప్రత్యేకమైన అభిముఖత ఉంది. బోయి భీమన్న త్రిపదల్లోని దళిత జీవన వాస్తవాలు, దార్ల వెంకటేశ్వరరావు బహుజన సాహిత్య దృక్పథం, బంజారా జీవన వాస్తవాలు, గిరిజన సాహిత్య సంప్రదాయాలు వంటి అంశాలపై ఆయన పరిశోధనచేశాడు. 'బహుజనస్వరం', 'బహుజనగళం', 'బహుజన ధ్వని', 'బహుజన నాదం' వంటి సంకలనాలకు సంపాదకత్వం వహించడం ద్వారా బహుజన సాహిత్యానికి ఒక ప్రత్యేక వేదికను కల్పించాడు. సాహిత్యంలో అణగారిన వర్గాల జీవనానుభవాలు, బాధలు, పోరాటాలు, ఆకాంక్షలు ప్రతిబింబించాల్సిన అవసరాన్ని తన రచనల ద్వారా ముందుకు తెచ్చాడు. తెలంగాణ ఉద్యమ సాహిత్యంపై కూడా ఆయన విస్తృతంగా పరిశోధించాడు. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమ కవిత్వం, తెలంగాణ సాయుధ పోరాట పాట, తెలంగాణ అస్తిత్వ ఉద్యమ కవిత్వం, దాశరథి కృష్ణమాచార్య 'అగ్నిధార', గద్దర్, అందెశ్రీ, రాకమచర్ల వెంకటదాసు వంటి అంశాలను పరిశీలించాడు. ఉద్యమ సాహిత్యాన్ని కేవలం రాజకీయ వ్యక్తీకరణగా కాకుండా తెలంగాణ ప్రజల సామాజిక, సాంస్కృతిక, అస్తిత్వ చైతన్యానికి ప్రతిబింబంగా అధ్యయనం చేశాడు. వ్యాస రచనలోనూ డా. శ్రీనివాసాచారి ప్రత్యేకమైన గుర్తింపు పొందాడు. తెలుగు సాహిత్యం, భాష, సంస్కృతి, చరిత్ర, జానపదం, తెలంగాణ ఉద్యమం, సాహిత్య విమర్శ వంటి విభిన్నఅంశాలపైఅనేకవ్యాసాలురాశాడు. 'వేటూరివారిమానవతావాదం', 'ఆచార్య బిరుదురాజు రామారావు సాహిత్య సేవ', 'తెలంగాణ సంస్కృతి - బొడ్డెమ్మ పండుగ', 'జానపద ఆశుప్రబంధము - ఒగ్గుకథ', 'తెలుగులో తొలి కల్పిత ప్రబంధం - ధనాభిరామము', 'తెలంగాణ తొలి నవలాకారుడు - తడకమళ్ల కృష్ణారావు', 'జానపద నాటక సాహిత్యం', 'తెలంగాణ జానపద ఆశ్రిత కళారూపం - పటం కథలు' వంటి రచనలు ఆయన పరిశోధనా వైవిధ్యానికి నిదర్శనాలు. గ్రంథరచయితగా 'ఉమ్మడి నల్లగొండ జిల్లా కవిత్వం', 'వ్యాస తోరణము', 'వ్యాస వీచిక', 'సజీవ స్వరాలు', 'సాహితీ వీక్షణాలు', 'వ్యాస స్రవంతి', 'స్ఫూర్తి వ్యక్తిత్వాలు' వంటి గ్రంథాలను వెలువరించాడు. ఈ గ్రంథాల్లో సాహిత్య వ్యక్తిత్వాలు, పరిశోధనా వ్యాసాలు, ప్రాంతీయ సాహిత్య విశేషాలు, సామాజిక-సాంస్కృతిక అంశాలు ప్రతిఫలించాయి. పరిశోధనను పుస్తకరూపంలో భద్రపరచడం ద్వారా భవిష్యత్ పరిశోధకులకు ఆధారాలను అందించే ప్రయత్నం చేశాడు. సాహిత్య పత్రికా రంగంలో కూడా ఆయన సేవ విశేషమైనది. వివిధ సాహిత్య, పరిశోధనా పత్రికల్లో నిరంతరం రచనలు చేస్తూ తెలుగు సాహిత్య చర్చను విస్తరించాడు. మూసీ, భావవీణ, దక్కన్‌ల్యాండ్, ఔచిత్యం, సాహిత్య తరంగిణి, తెలుగు తేజము తదితర పత్రికలు, జర్నల్స్‌లో ఆయన వ్యాసాలు ప్రచురితమయ్యాయి. ముఖ్యంగా సాహిత్య పత్రికలు కొత్త రచయితలకు, పరిశోధకులకు, యువ సాహితీవేత్తలకు వేదికగా నిలవాలనే ఉద్దేశంతో ఆయన సంపాదకత్వ కార్యక్రమాలను కొనసాగిస్తున్నాడు. సంపాదకుడిగా 'మట్టి మాటలు', 'మట్టి వనం', 'మట్టి తాళం', 'మట్టి పరిమళం' వంటి సంకలనాలను వెలువరించాడు. ఇవి మట్టి, మనిషి, ప్రాంతీయ జీవితం, జానపద సంస్కృతి, ప్రజా అనుభవాలను సాహిత్యంతో అనుసంధానించే ప్రయత్నాలుగా నిలిచాయి. అలాగే 'విశ్వబ్రాహ్మణ సాహిత్య దర్శనం', 'బహుజన స్వరం', 'బహుజన గళం', 'బహుజన ధ్వని', 'బహుజన నాదం' వంటి సంపాదకత్వ కార్యక్రమాల ద్వారా వివిధ సామాజిక, సాహిత్య వర్గాల స్వరాలను ఒకచోట చేర్చాడు. పరిశోధనా పత్రికల్లో ఆయన రచనలు విస్తృతంగా ప్రచురితమయ్యాయి. జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో తెలుగు సాహిత్యం, తెలంగాణ సాహిత్యం, జానపదం, గిరిజన సాహిత్యం, దళిత-బహుజన సాహిత్యం, డిజిటల్ యుగంలో తెలుగు భాష వంటి అంశాలపై పరిశోధనా పత్రాలను సమర్పించాడు. ఈ క్రమంలో తెలుగు సాహిత్యాన్ని ప్రాంతీయ సరిహద్దులను దాటి జాతీయ, అంతర్జాతీయ వేదికలపై పరిచయం చేసే ప్రయత్నం చేశాడు. ఆయన సాహిత్య, విద్యా సేవలకు అనేక పురస్కారాలు లభించాయి. ఉగాది పురస్కారం (2013), మదర్ థెరిసా బెస్ట్ రైటర్ అవార్డు (2018), డా. బి.ఆర్. అంబేద్కర్ రత్న జాతీయ పురస్కారం (2019), విశ్వకర్మ లెజెండరీ అవార్డు (2019), తెలుగు తేజము అవార్డు (2019), గురుబ్రహ్మ పురస్కారం (2020), పుడమి జాతీయ పురస్కారం (2020), తెలుగు వెలుగు సాహిత్య పురస్కారం (2021), పుడమి మిత్ర పురస్కారం (2021), విశ్వకర్మ జాతీయ పురస్కారం (2022), ఉపాధ్యాయ రత్న (2023), దాశరథి శతాధిక కవుల పురస్కారం (2025), విశ్వకర్మ విద్యా విభూషణ జాతీయ పురస్కారం (2025), నేషనల్ టీచర్ ఎక్సలెన్స్ అవార్డు (2025), నేషనల్ టీచర్ ఇన్‌స్పిరేషన్ అవార్డు (2025), అబ్దుల్ కలాం బెస్ట్ ఆన్‌లైన్ ఎడ్యుకేటర్ ఎక్సలెన్స్ అవార్డు (2025), సావిత్రీబాయి పూలే సామాజిక అవార్డు (2025), రవీంద్ర రత్న పురస్కారం (2026) వంటి గౌరవాలు ఆయన సాహిత్య, విద్యా, సామాజిక సేవలకు లభించాయి. 2026లో టీజీఎంఆర్ఈఐఎస్ నుంచి తెలుగు సబ్జెక్ట్ రిసోర్స్ పర్సన్‌గా అందిస్తున్న సేవలకు ప్రశంసాపత్రం కూడా అందుకున్నాడు. వ్యక్తిగత జీవితంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొని, వాటిని అధిగమించి సాహిత్య రంగంలో తనకంటూ ఒక స్థానం



సంపాదించుకున్న డా. ఇడికూడ శ్రీనివాసాచారి ప్రస్థానం యువతకు స్ఫూర్తిదాయకం. చిన్ననాట తండ్రిని కోల్పోయిన పరిస్థితి నుంచి ప్రారంభమైన ఆయన జీవన ప్రయాణం విద్య, ఉపాధ్యాయ వృత్తి, పరిశోధన, రచన, సంపాదకత్వం, సాహిత్య సేవల వైపు సాగింది. ప్రతికూల పరిస్థితులు తన లక్ష్యానికి అడ్డంకులు కావని, నిరంతర కృషి, విద్య, సాహిత్యాభిమానం, కుటుంబ ప్రోత్సాహం ఉంటే వ్యక్తి తన గమ్యాన్ని చేరుకోగలడని ఆయన జీవితం నిరూపిస్తుంది. మొత్తంగా డా. ఇడికూడ శ్రీనివాసాచారి సాహిత్య ప్రస్థానం వ్యక్తిగత ప్రతిభతో పాటు ప్రాంతీయ సాహిత్య చరిత్ర నిర్మాణం, జానపద-గిరిజన సాహిత్య పరిరక్షణ, దళిత-బహుజన సాహిత్య స్వరాల బలోపేతం, సాహిత్య పత్రికల అభివృద్ధి, యువ రచయితలకు ప్రోత్సాహం, పరిశోధనాత్మక రచనల విస్తరణ వంటి అనేక పార్శ్వాలను కలిగి ఉంది. రచయితగా సృజనాత్మకతను, పరిశోధకుడిగా శాస్త్రీయ దృష్టిని, విమర్శకుడిగా విశ్లేషణను, సంపాదకుడిగా సమన్వయాన్ని, ఉపాధ్యాయుడిగా మార్గదర్శకత్వాన్ని సమన్వయం చేసుకుంటూ ఆయన సాగిస్తున్న సాహిత్య సేవ సమకాలీన తెలుగు సాహిత్యంలో గుర్తించదగిన అధ్యాయంగా నిలుస్తోంది.

**పల్లె సతీష్**
**9010953659**

## నెత్తుటి సాక్షి

పాఠం చెప్పేవాడు...
మార్కులు వేసే మనిషి
కాదు...
మంచి చెడుల విచక్షణ
నేర్పి
బతుకు బాటను చూపే
దారిదీపం గురువు.

అక్షర జ్ఞానం పంచిన
చేతులే
క్షణికావేశాన
శత్రువులైతే...
చదువుకు అర్థమేది?
విద్యకు విలువేది?

జల్సాల వలకు చిక్కి
కాసుల వేటలో...
తోటి మనిషి ఉసురు
తీసేంత
దిగజారుతోంది
మానవత్వం.

సరస్వతీ నిలయాలు
మత్తుకు నెలవైన వేళ...
ఆహుతయ్యేది ఒక్క
ఊపిరి కాదు...
ఒక తరం ఆలోచన.


పుస్తకం పట్టాల్సిన చేతులు
మత్తుకు బానిసలై...
విధ్వంసపు బాట పడితే
తప్పెవరిది?

నేడు గురువు రక్తంతో
తడిసిన నేల
రేపటి పౌరుల
భవితవ్యానికి నెత్తుటి
సాక్షియై
సమాజపు మనుగడకో...
హెచ్చరికై నిలుస్తోంది.



డా. ఆవుల రేణుక
9398268976

# కావాల్సింది బోధనా స్వేచ్ఛ...



ప్రతియేటా సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవం వస్తుంది. పాఠశాలల్లో సభలు జరుగుతాయి. ఉపాధ్యాయులను సన్మానిస్తారు. పూలమాలలు వేస్తారు. శాలువాలు కప్పుతారు. అవార్డులు అందజేస్తారు. నాయకులు, మంత్రులు, అధికారులు ఉపాధ్యాయుల గొప్ప తనాన్ని కొనియాడుతూ "దేశ భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లో ఉంది" అంటారు. కానీ ఆ వేడుకలు ముగిసిన తర్వాత ఒక ప్రశ్న మాత్రం మిగిలిపోతుంది. దేశ భవిష్యత్తును నిర్మించే ఉపాధ్యాయుడి వర్తమానం ఎలా ఉంది? అతని జీతం సమయానికి వస్తుందా? బకాయిలు చెల్లిస్తున్నారా? ఉద్యోగ భద్రత ఉందా? బోధించే స్వేచ్ఛ ఉందా? అతని పని బోధనకే పరిమితమైందా? రోజురోజుకూ పెరుగుతున్న పరిపాలనా, డిజిటల్, ఎన్నికల, సర్వేలు, ఇతరేతర పనుల భారాన్ని తగ్గిస్తున్నారా? అతని వృత్తి గౌరవాన్ని ప్రభుత్వాలు కాపాడుతున్నాయా? ఈ ప్రశ్నలకు నిజాయితీగా సమాధానాలు వెతకాలి. అప్పుడే ఉపాధ్యాయ దినోత్సవం కేవలం వేడుకగా కాకుండా విద్యా వ్యవస్థపై ఆత్మపరిశీలనకు ఒక సందర్భంగా మారాల్సిన అవసరం స్పష్టమవుతుంది. "ఉపాధ్యాయుడు సమాజ నిర్మాత", "దేశ భవిష్యత్తును తీర్చిదిద్దేవాడు", "తల్లిదండ్రుల తర్వాత అత్యున్నత స్థానం ఉపాధ్యాయుడిదే" వంటి మాటలు నేడు వినిపిస్తాయి. కానీ మాటలకు, విధానాలకు మధ్య ఉన్న అంతరమే అసలు సమస్య.

ఒక వృత్తిని నిజంగా గౌరవించాలంటే పూలమాలలు, శాలువాలు మాత్రమే సరిపోవు. మంచి జీతం, ఉద్యోగ భద్రత, గౌరవప్రదమైన పని పరిస్థితులు, వృత్తిపరమైన స్వేచ్ఛ, తగిన మౌలిక సదుపాయాలు, నిరంతర శిక్షణ, సముచితమైన పని భారం, సామాజిక భద్రత అవసరం. ఉపాధ్యాయుడి ప్రధాన బాధ్యత బోధన. కానీ నేడు బోధనతో పాటు అనేక పరిపాలనా, డిజిటల్, ఎన్నికల, సర్వే తదితర పనులు అతనిపై పడుతున్నాయి. ఉపాధ్యాయుడు పాఠ్యపుస్తకాన్ని చదివి వినిపించే యంత్రం కాదు. విద్యార్థుల సామాజిక నేపథ్యాన్ని అర్థం చేసుకుని, వారి భాష, అనుభవాలు, సమస్యలను గమనించి, తగిన ఉదాహరణలతో బోధించే వ్యక్తి. ప్రతి అంశాన్ని పైస్థాయి ఆదేశాలతో నిర్ణయించి, ప్రతి దశను యాప్‌లు, ఫార్మాట్లు, రిపోర్టులతో నియంత్రిస్తే అతని వృత్తిపరమైన స్వేచ్ఛ ఎక్కడ మిగులుతుంది? విద్యార్థికి ఆలోచించే స్వేచ్ఛ కావాలంటే ముందుగా ఉపాధ్యాయుడికి బోధించే స్వేచ్ఛ ఉండాలి. ఉపాధ్యాయులపై రాజకీయ నాయకులు చేసే వ్యాఖ్యల విషయంలో కూడా పాలకులు బాధ్యతగా వ్యవహరించాలి.

ఉపాధ్యాయులను సోమరులు, బాధ్యత లేనివారు, పని చేయని వారు, కేవలం సెలవులు కోరుకునేవారిగా సాధారణీకరించే వ్యాఖ్యలు మొత్తం వృత్తి గౌరవాన్ని దెబ్బతీస్తాయి. ఎవరి పనితీరుపై ఫిర్యాదులున్నా క్రమశిక్షణ చర్యలు తీసుకోవచ్చు. పర్యవేక్షణ వ్యవస్థను మెరుగుపరచవచ్చు. జవాబుదారీతనం నిర్ధారించవచ్చు. కానీ మొత్తం ఉపాధ్యాయ వృత్తిని అవమానించడం పరిష్కారం కాదు. ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించడం అవసరమే. అయితే అవార్డుల వ్యవస్థలో పారదర్శకత లేకపోతే సమస్య ఏర్పడుతుంది. ప్రాజెక్టుల ఫైళ్లు, ఫోటోలు, సర్టిఫికెట్లు, సిఫార్సులు, అధికారుల ధృవపత్రాలు, పరిచయాలకే ప్రాధాన్యం పెరిగితే నిజమైన సేవ వెనక్కి నెట్టబడే ప్రమాదం ఉంది. ఉత్తమ ఉపాధ్యాయుడిని తయారు చేసే వ్యవస్థ కావాలి, ఉత్తమ అవార్డు దరఖాస్తుదారుడిని తయారు చేసే వ్యవస్థ కాదు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా సంస్కరణల గురించి మాట్లాడుతున్నాయి. కొత్త విధానాలు, సాంకేతికత, మౌలిక సదుపాయాలు, నైపుణ్యాల అభివృద్ధి అవసరమే. కానీ వాటిని అమలు చేసే ఉపాధ్యాయుడికి తగిన శిక్షణ, సమయం, సిబ్బంది, వనరులు కల్పిస్తున్నారా అన్నదే కీలకం. ఉపాధ్యాయుడిని ఆదేశాల స్వీకర్తగా, పథకాల అమలుదారుగా, డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా, ఎన్నికల సిబ్బందిగా మాత్రమే కాకుండా విద్యా విధాన రూపకల్పనలో భాగస్వామిగా చూడాలి. ఉపాధ్యాయ సంఘాలతో నిజమైన సంప్రదింపులు లేకుండా విద్యా సంస్కరణలు చేయడం ప్రజాస్వామిక పద్ధతి కాదు. ప్రభుత్వ పాఠశాల అంటే కేవలం భవనం కాదు. భవనాలు, పుస్తకాలు, డిజిటల్ పరికరాలు, ఫర్నిచర్ ఉన్నంత మాత్రాన పాఠశాల ఏర్పడదు. ఉపాధ్యాయుడు, విద్యార్థి, సమాజం, స్వేచ్ఛ, వనరులు, ప్రజాస్వామిక వాతావరణం కలిసినప్పుడే ప్రభుత్వ విద్య బలోపేతమవుతుంది. అందులో ఉపాధ్యాయుడే కీలకమైన మానవ శక్తి. కాబట్టి ఉపాధ్యాయుడిని బలహీనపరిచి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం సాధ్యం కాదు.

ప్రపంచ అనుభవాలు కూడా ఇదే విషయాన్ని సూచిస్తున్నాయి. ఉపాధ్యాయుడికి సామాజిక గౌరవం, మెరుగైన ఆర్థిక స్థాయి, వృత్తిపరమైన స్వేచ్ఛ ఉన్న చోట విద్యా వ్యవస్థ కూడా బలంగా ఉంటుంది. దీనికి భిన్నంగా ఉపాధ్యాయుడిని కేవలం ఆదేశాలు అమలు చేసే ఉద్యోగిగా చూసే వ్యవస్థలో నాణ్యమైన విద్య సాధించడం కష్టం. సెప్టెంబర్ 5న ఉపాధ్యాయుడికి శుభాకాంక్షలు చెప్పడం సులభం. కానీ అతని జీవితాన్ని గౌరవప్రదంగా మార్చడం అసలు పరీక్ష. పూలమాల వేసే చేతులు అతని పెండింగ్ బిల్లులు విడుదల చేసే చేతులుగా మారాలి. ఉపాధ్యాయుడి గొప్పతనాన్ని పొగిడే నోరు అతని వృత్తి గౌరవాన్ని కాపాడే మాటలు మాట్లాడాలి. అవార్డులతో సత్కరించే ప్రభుత్వం అతని ఆర్థిక హక్కులను కూడా గౌరవించాలి. విద్యార్థులకు ఆలోచనా స్వేచ్ఛను కోరే ప్రభుత్వం ముందుగా ఉపాధ్యాయుడికి బోధనా స్వేచ్ఛ ఇవ్వాలి.అందుకే ఈ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మన నినాదం.

# 70 వసంతాల ఎల్.ఐ.సీ.

దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తూ, కోట్లమంది నమ్మకాన్ని గెలుచుకున్న 'లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా' (ఎల్ఐసీ) సెప్టెంబర్ 1న 70వ సంస్థాపక దినోత్సవాన్ని జరుపుకుంటోంది. స్వాతంత్ర్యానంతరం ప్రైవేట్ మోసాల నుంచి ప్రజల సొమ్ముకు రక్షణ కల్పిస్తూ, సావెరిన్ గ్యారెంటీతో పొదుపు సంస్కృతిని పెంచేందుకు చేపట్టిన బీమా రంగ జాతీయాకరణ దేశ ఆర్థిక చరిత్రలో విప్లవాత్మక మైలురాయి. సామాజిక బాధ్యతగా భద్రతతో కూడిన ఇన్సూరెన్స్ సేవలను అందిస్తూ, సమీకరించిన నిధులతో దేశాభివృద్ధిలో భాగస్వామిగా మారిన ఎల్ఐసీ విజయప్రస్థానాన్ని ఈ సందర్భంగా స్మరించుకోవాలి.

245 ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలు ప్రజల నుంచి వసూలు చేసిన ప్రీమియం మొత్తాలను స్వప్రయోజనాలకు వినియోగిస్తూ పాలసీదారులను మోసం చేస్తున్న నేపథ్యంలో భారతీయ జీవిత బీమా వ్యాపారాన్ని జాతీయం చేసి ఎల్ఐసీని ఏర్పాటు చేశారు. గత ఏడు దశాబ్దాలుగా జాతీయాకరణ లక్ష్యాలను కొనసాగిస్తూ ఎల్ఐసీ దేశ ఆర్థిక రంగానికి వెన్నెముకగా నిలిచింది. ఎల్ఐసీ పెట్టుబడుల్లో 82 శాతం ప్రభుత్వ సెక్యూరిటీలతో పాటు మౌలిక సదుపాయాల అభివృద్ధికి వినియోగమవుతున్నాయి. 1956లో రూ.5 కోట్ల మూలధనంతో ప్రారంభమైన ఎల్ఐసీ, 2011లో రూ.100 కోట్ల మూలధనానికి చేరింది. 31.03.2026 నాటికి 14.57 లక్షల మంది ఏజెంట్లు, 3,836 కార్యాలయాలు ఉన్నాయి. 25.35 కోట్ల వ్యక్తిగత పాలసీదారులతో పాటు 10 కోట్లకు పైగా గ్రూప్ ఇన్సూరెన్స్ పాలసీదారులు ఉన్నారు. 202526లో ఎల్ఐసీ మొత్తం ఆదాయం రూ.9,79,078 కోట్లు, ప్రీమియం ఆదాయం రూ.5,35,984 కోట్లుగా నమోదైంది. పాలసీదారులకు రూ.4,96,104 కోట్లు చెల్లించింది. సంస్థ మొత్తం ఆస్తుల విలువ రూ.59,03,876 కోట్లు కాగా, లైఫ్ ఫండ్ రూ.51,63,872 కోట్లుగా ఉంది. ప్రీమియం ఆదాయంలో 56.66 శాతం మార్కెట్ వాటాతో ప్రైవేటు, విదేశీ కంపెనీలకు గట్టి పోటీ ఇస్తోంది. మొత్తం సర్‌ప్లస్ రూ.1,23,266 కోట్లుగా నమోదైంది. ఈ సంవత్సరంలోనే ఎల్ఐసీ ప్రభుత్వానికి రూ.12,207 కోట్ల డివిడెండ్ అందించింది. ప్రతి ఏడాది సుమారు రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులను దేశ ఆర్థికాభివృద్ధికి అందిస్తోంది. ఇప్పటివరకు ప్రభుత్వానికి సుమారు రూ.40 వేల కోట్ల డివిడెండ్ చెల్లించింది. ఎల్ఐసీ ఎంబెడెడ్ వాల్యూ రూ.7.89 లక్షల కోట్లుగా ఉంది.

బీమా రంగంలో ప్రైవేటు, విదేశీ సంస్థలకు అవకాశం కల్పించి 24 ఏండ్లు గడిచినా ఎల్ఐసీ తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. 2025 26లో రూ.2,60,464 కోట్ల తొలి ప్రీమియం ఆదాయంతో 1.84 కోట్ల పాలసీలను సాధించి, 65.16 శాతం మార్కెట్ వాటాతో లీడర్‌గా నిలిచింది. అదే ఏడాది 2.54 కోట్ల క్లెయిమ్‌లకు రూ.3,12,771 కోట్లు చెల్లించి, 99.44 శాతం డెత్ క్లెయిమ్‌లను పరిష్కరించింది. ప్రస్తుతం ఎల్ఐసీ 14 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

అయితే ఎల్ఐసీ వాటాల విక్రయంపై విమర్శలు వెల్లువెత్తాయి. తొలుత 3.5 శాతం వాటాను రూ.20,557 కోట్లకు డిజిన్వెస్ట్‌మెంట్ చేశారు. సంస్థ ఎంబెడెడ్ విలువను తక్కువగా చూపించారనే విమర్శలు వచ్చాయి. 76 లక్షల దరఖాస్తులతో ఎల్ఐసీ ఐపీఓ మూడు రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. అనంతరం మరో 6.5 శాతం ప్రభుత్వ వాటాను 'ఆఫర్ ఫర్ సేల్' ద్వారా ఉపసంహరించగా, రూ.31,552 కోట్లు ప్రభుత్వ ఖజానాకు చేరాయి. ప్రజల విశ్వాసానికి ప్రతీకగా ఉన్న ఎల్ఐసీ వాటాలను విక్రయించడం విమర్శలకు దారితీసింది.స్టాక్ మార్కెట్‌లో ఎల్ఐసీ షేరు కొంతకాలం డిస్కౌంట్‌తో ట్రేడవడంతో మదుపరులు నిరుత్సాహానికి గురయ్యారు. అయితే షేరు మార్కెట్ విలువకు, సంస్థ అంతర్గత విలువకు గణనీయమైన వ్యత్యాసం ఉంది. ఎల్ఐసీ మార్కెట్ క్యాపిటలైజేషన్ 63.7 బిలియన్ డాలర్లుగా నమోదై దేశంలో అత్యధిక క్యాపిటలైజేషన్ కలిగిన కంపెనీల్లో 10వ స్థానంలో నిలిచింది. ప్రైవేటు సంస్థలతో పోలిస్తే ఎల్ఐసీ పనితీరు మెరుగ్గా

**సామాజిక బాధ్యతగా భద్రతతో కూడిన ఇన్సూరెన్స్ సేవలను అందిస్తూ, సమీకరించిన నిధులతో దేశాభివృద్ధిలో భాగస్వామిగా మారిన ఎల్ ఐసీ విజయప్రస్థానాన్ని ఈ సందర్భంగా స్మరించుకోవాలి.**

**వినియోగమవుతున్నాయి.**

ఉండటంతో పాటు నిర్వహణ వ్యయం కూడా తక్కువగా ఉంది. లాభాలకే కాకుండా సామాజిక శ్రేయస్సుకు ప్రాధాన్యం ఇవ్వడం ఎల్ఐసీ ప్రత్యేకత.

ఫార్చ్యూన్500 జాబితాలో నిలిచిన ఎల్ఐసీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థ వాటాలను విక్రయించి బడ్జెట్ లోటును పూడ్చుకోవడం సమంజసం కాదు. 2047 నాటికి ప్రతి ఒక్కరికీ ఇన్సూరెన్స్ అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతున్న సమయంలో ఎల్ఐసీని మరింత బలోపేతం చేయాలి. ప్రజలకు సామాజిక భద్రత కల్పిస్తూ, దేశ ఆర్థికాభివృద్ధికి భారీగా పెట్టుబడులు అందిస్తున్న ఎల్ఐ సీ వంటి ప్రభుత్వరంగ సంస్థల్లో ప్రభుత్వ వాటాలను డిజిన్వెస్ట్‌మెంట్ పేరుతో విక్రయించడం ప్రజామోద యోగ్యం కాదు. ప్రజల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన ఎల్ఐసీని కాపాడటం ప్రభుత్వ బాధ్యత.




# జాతీయం-అంతర్జాతీయం





# మనిషి రోబోట్ కాదు!



- శరీరం యంత్రం కాదు
- సమయాన్ని బట్టి విశ్రాంతి కూడా అవసరమే
- సీజన్, నిద్ర ప్రభావంతో మనిషి శక్తి, పనితీరుపై ప్రభావం
- ఎప్పుడూ వేగంగా పని చేయొద్దు
- మానసిక భద్రతకే ప్రాధాన్యం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 05 (ఎ.ఎం.ఎస్) :**

"ఎప్పుడూ బిజీగా ఉండాలి.. ఎప్పుడూ ఫుల్ స్పీడ్‌లో పని చేయాలి.. ఒక్కరోజు కూడా పనితీరు తగ్గకూడదు" అనే ఒత్తిడి ఆధునిక జీవితంలో పెరిగిపోయింది. కానీ మన శరీరం ఒక యంత్రం కాదు. రుతువులు, నిద్ర, వాతావరణం, పని ఒత్తిడి వంటి అనేక అంశాలు మన శక్తి, మానసిక స్థితి, పనితీరును ప్రభావితం చేస్తాయి. అందుకే కొన్ని రోజులు నెమ్మదిగా సాగడం చాలా అవసరం.

ఫిబ్రవరిలో మీరు ఎలా ఉంటారో.. జూన్‌లో కూడా అలాగే ఉంటారా? అంటే చాలామందికి సమాధానం 'కాదు' అనే వినిపిస్తుంది. శీతాకాలంలో ఒకలా, వసంత కాలంలో ఇంకోలా, వేసవిలో మరోవిధంగా మన శరీరం ఉంటుంది. దానిని బట్టి మనం చేసే పని కూడా ఉంటుంది. ఒకసారి వేగంగా పని చేయొచ్చు.. మరోసారి నెమ్మదించొచ్చు. అంటే దీనర్థం మనం బలహీనపడటమని కాదు.. శరీరం తన సహజ స్వభావానికి అనుగుణంగా మారుతోంది.

మన శరీరం రోజూ ఒకే వేగంతో పని చేయదు. నిద్రమెలకువలను నియంత్రించే సర్కేడియన్ రిథమ్ మన రోజువారీ జీవితంపై కీలక ప్రభావం చూపుతుంది. కొందరు ఉదయం వేళల్లోనే అత్యంత చురుగ్గా ఉంటారు. మరికొం దరు రాత్రి వేళల్లో ఎక్కువ ఏకాగ్రతతో పనిచేస్తారు. ఈ సహజ సమయ ప్రాధాన్యతనే క్రోనోటైప్ అంటారు. హార్మోన్లు, న్యూరోట్రాన్స్ మీటర్లు వంటి శారీరక వ్యవస్థలు కూడా మన శక్తి, మూడ్, పనితీరును ప్రభావితం చేస్తాయి. అందుకే ప్రతిరోజూ మన సామర్థ్యం ఒకే స్థాయిలో ఉంటుందని ఆశించడం సరికాదని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు.

మనిషి ప్రతిరోజూ ఒకే వేగంతో పనిచేసే యంత్రం కాదు. కొన్ని రోజులు ఉత్సాహంగా ఉండటం.. మరి కొన్ని రోజులు నెమ్మదించడం జీవితంలో సహజమైన భాగం. అందుకే 'ఎప్పుడూ బిజీగా ఉండాలి' అనే ఒత్తిడిని తగ్గించుకోవాలని వైద్యారోగ్య నిపుణులు సూచిస్తున్నారు. కాబట్టి వేగంగా పని చేయాలని అనుకోవడం కంటే మన శరీరం మనకు ఎలాంటి సంకేతాలు ఇస్తోంది? ఒక పని చేయడానికి ఇంత టెన్షన్ తీసుకోవాలా? తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయి? అనే విషయాల గురించి కూడా ఆలోచించాలని అంటున్నారు.ఎప్పుడు వేగంగా ముందుకు సాగాలి.. ఎప్పుడు వేగం తగ్గించాలి.. ఎప్పుడు విశ్రాంతి తీసుకోవాలి అన్నది తెలుసుకోవడమే నిజమైన మానసిక బలమని చెప్తున్నారు. ప్రకృతితో పోటీ పడుతూ జీవించడం కంటే.. మన శరీర చెప్పినట్టుగా జీవించడం ఆరోగ్యకరమైన మార్గమని నిపుణులు చెప్తున్నారు.ాదు.. శరీరం కోరుతున్న విశ్రాంతికి సంకేతం కావచ్చని నిపుణులు చెప్తున్నారు.

"ఎప్పుడూ బిజీగా ఉండాలి.. ఎప్పుడూ ఫుల్ స్పీడ్‌లో పని చేయాలి.. ఒక్కరోజు కూడా పనితీరు తగ్గకూడదు" అనే ఒత్తిడి ఆధునిక జీవితంలో పెరిగిపోయింది. కానీ మన శరీరం ఒక యంత్రం కాదు. రుతువులు, నిద్ర, వాతావరణం, పని ఒత్తిడి వంటి అనేక అంశాలు మన శక్తి, మానసిక స్థితి, పనితీరును ప్రభావితం చేస్తాయి. అందుకే కొన్ని రోజులు నెమ్మదిగా సాగడం వైఫల్యం క

న్యూఢిల్లీ : ఫిబ్రవరిలో మీరు ఎలా ఉంటారో.. జూన్‌లో కూడా అలాగే ఉంటారా? అంటే చాలామందికి సమాధానం 'కాదు' అనే వినిపిస్తుంది. శీతాకాలంలో ఒకలా, వసంత కాలంలో ఇంకోలా, వేసవిలో మరోవిధంగా మన శరీరం ఉంటుంది. దానిని బట్టి మనం చేసే పని కూడా ఉంటుంది. ఒకసారి వేగంగా పని చేయొ చ్చు.. మరోసారి నెమ్మదించొచ్చు. అంటే దీనర్థం మనం బలహీనపడటమని కాదు.. శరీరం తన సహజ స్వభావానికి అనుగుణంగా మారుతోంది.

మన శరీరం రోజూ ఒకే వేగంతో పని చేయదు. నిద్రమెలకువలను నియంత్రించే సర్కేడియన్ రిథమ్ మన రోజువారీ జీవితంపై కీలక ప్రభావం చూపుతుంది. కొందరు ఉదయం వేళల్లోనే అత్యంత చురుగ్గా ఉంటారు. మరికొం దరు రాత్రి వేళల్లో ఎక్కువ ఏకాగ్రతతో పనిచేస్తారు. ఈ సహజ సమయ ప్రాధాన్యతనే క్రోనోటైప్ అంటారు. హార్మోన్లు, న్యూరోట్రాన్స్ మీటర్లు వంటి శారీరక వ్యవస్థలు కూడా మన శక్తి, మూడ్, పనితీరును ప్రభావితం చేస్తాయి. అందుకే ప్రతిరోజూ మన సామర్థ్యం ఒకే స్థాయిలో ఉంటుందని ఆశించడం సరికాదని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు. మనిషి ప్రతిరోజూ ఒకే వేగంతో పనిచేసే యంత్రం కాదు. కొన్ని రోజులు ఉత్సాహంగా ఉండటం.. మరికొన్ని రోజులు నెమ్మదించడం జీవితంలో సహజమైన భాగం. అందుకే 'ఎప్పుడూ బిజీగా ఉండాలి' అనే ఒత్తిడిని తగ్గించుకోవాలని వైద్యారోగ్య నిపుణులు సూచిస్తున్నారు. కాబట్టి వేగంగా పని చేయాలని అనుకోవడం కంటే మన శరీరం మనకు ఎలాంటి సంకేతాలు ఇస్తోంది? ఒక పని చేయడానికి ఇంత టెన్షన్ తీసుకోవాలా? తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయి? అనే విషయాల గురించి కూడా ఆలోచించాలని అంటున్నారు.

ఎప్పుడు వేగంగా ముందుకు సాగాలి.. ఎప్పుడు వేగం తగ్గించాలి.. ఎప్పుడు విశ్రాంతి తీసుకోవాలి అన్నది తెలుసుకోవడమే నిజమైన మానసిక బలమని చెప్తున్నారు. ప్రకృతితో పోటీ పడుతూ జీవించడం కంటే.. మన శరీర చెప్పినట్టుగా జీవించడం ఆరోగ్యకరమైన మార్గమని నిపుణులు చెప్తున్నారు.ాదు.. శరీరం కోరుతున్న విశ్రాంతికి సంకేతం కావచ్చని నిపుణులు చెప్తున్నారు.

కోవిడ్ తర్వాత హైబ్రిడ్, రిమోట్ వర్కింగ్ పెరగడంతో వివిధ దేశాల్లో ఉన్న ఉద్యోగులు ఒకే టీంగా పనిచేస్తున్నారు. కానీ అందరూ ఒకే సీజన్ (రుతువు)లో ఉండరు. ఒక దేశంలో తీవ్రమైన వేసవి ఉండగా.. మరో దేశంలో శీతాకాలం ఉండొచ్చు. ఒక ప్రాంతంలోని ఉద్యోగి ఎండ కారణంగా అలసిపోతుండగా.. మరో ప్రాంతంలోని ఉద్యోగి చలి కారణంగా తక్కువ శక్తితో పనిచేస్తుండవచ్చు. అయినప్పటికీ ఇద్దరికీ ఒకే డెడ్‌లైన్ ఉండవచ్చు. అందుకే సంస్థలు ఉద్యోగులపై పని భారం మాత్రమే కాకుండా.. వారి శారీరక, మానసిక పరిస్థితులను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు చెప్తున్నారు.

పని భారం, మానసిక ఒత్తిడి, ప్రొడక్టివిటీలో మార్పుల గురించి ఉద్యోగులు తమ మేనేజ్‌మెంట్‌తో స్వేచ్ఛగా మాట్లాడగలగాలి. 2024లో 16 దేశాల్లో దాదాపు 28 వేల మంది ఉద్యోగులపై నిర్వహించిన సర్వే ప్రకారం.. మానసిక భద్రతకు ప్రాధాన్యం ఇచ్చే సంస్థల్లో ఉద్యోగులు ఎక్కువ సంతృప్తిగా ఉండటంతో పాటు ఉద్యోగాలు వదిలే అవకాశం కూడా తక్కువగా ఉంది.

# ఆ విషయం ఇరాన్‌నే అడగండి

- నౌకలపై దాడులు ఆపితేనే చర్చలు : వాన్స్
- ఒత్తిడి కోసం అన్ని చర్యలనూ పరిశీలిస్తున్నాం
- పోరు ఎప్పుడు ముగుస్తుందో చెప్పలేను
- అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వ్యాఖ్యలు



**వాషింగ్టన్, సెప్టెంబరు 05 :**

ఇరాన్ విషయంలో ఏం చేయాలనే దానిపై అన్ని అవకాశాలనూ పరిశీలిస్తున్నామని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చెప్పారు. ఆర్థిక, సైనిక, దౌత్య, రహస్య చర్యలు సహా అనేక మార్గాలు తమ పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. అయితే ఇరాన్‌తో ఇప్పుడప్పుడే చర్చలు జరిపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. హోర్ముజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులు ఆపేంతవరకూ ఆ దేశంతో చర్చలు జరపబోమని అన్నారు. ఇరాన్‌పై అమెరికా సైనిక చర్యల నేపథ్యంలో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ వాన్స్ అధ్యక్షభవనంలో విలేకరులతో మాట్లాడారు. 'దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైఖరి స్పష్టంగా ఉంది. వాణిజ్య నౌకలపై దాడులు ఆపేంతవరకూ ఇరాన్‌తో చర్చించబోమని ఆయన చాలా స్పష్టంగా చెప్పారు' అని గుర్తు చేశారు. వాణిజ్య నౌకలపై ఇరాన్ జరుపు తున్న దాడులు రెండు దేశాల మధ్య దౌత్యపరమైన ప్రయత్నాలు ముందుకు సాగడానికి ప్రధాన అడ్డంకిగా మారాయని చెప్పారు. చర్చలు తిరిగి ప్రారంభం కావాలంటే నౌకలను లక్ష్యంగా చేసుకోవడాన్ని ఇరాన్ ఆపేయాలని సూచించారు. ఇరాన్‌పై తాము చేపట్టిన సైనిక చర్యల కారణంగానే హోర్ముజ్‌లో నౌకాయానం పెరగడానికి అనువైన వాతావరణం ఏర్పడిందని తెలిపారు. నవంబరులో మధ్యంతర ఎన్నికలు జరిగే వరకూ ఘర్షణలు కొనసాగుతాయా అని విలేకరులు ప్రశ్నించగా 'నేను దానిని యుద్ధంగా అనుకోవడం లేదు' అని అన్నారు. ప్రస్తుతం ఎలాంటి కాల్పులు జరగడం లేదని, ఆరు వారాల తర్వాత ప్రధాన ఆపరేషన్స్ ముగిసిపోయాయని చెప్పుకొచ్చారు. అయితే కొన్ని ప్రాంతాలలో తిరిగి పోరు ప్రారంభమైందని, ఇరాన్‌తో ఉద్రిక్తతలు పరిష్కారం కాలేదని తెలిపారు.

ప్రస్తుత పరిస్థితికి ముగింపు లభిస్తుందా అని అడిగిన ప్రశ్నకు వాన్స్ బదులిస్తూ నిర్దిష్టమైన గడువు ఏదీ చెప్పలేని, నౌకలపై జరుగుతున్న దాడులకు సంబంధించి ఇరాన్ నిర్ణయంపై అది ఆధారపడి ఉంటుందని చెప్పారు. అసలు ఈ ప్రశ్నను ఇరాన్‌నే అడగాలని సూచించారు. పరిస్థితి క్షీణిస్తే ఇరాన్‌పై వేర్వేరు రూపాలలో ఒత్తిడిని కొనసాగిస్తామని అన్నారు. వెనిజులా చమురు నిల్వలపై నియంత్రణను అమెరికాకు బదిలీ చేసేందుకు ఉద్దేశించి కుదుర్చుకున్న ఒప్పందంతో అంతర్జాతీయ చమురు ధరలు దిగివచ్చాయని చెప్పారు. ఇరాన్‌పై తాము చేసిన యుద్ధానికి తగినంత సహకారం అందించని మిత్రదేశాలపై ఆయన మండిపడుతూ ఇంధన సంక్షోభాన్ని ట్రంప్ ఒంటిచేత్తోనే నిరోధించారని కొనియాడారు. ఇరాన్‌లోని సిరిక్ నగరంలో వివాహ వేడుకపై అమెరికా జరిపిన దాడి గురించి ప్రశ్నించగా దానిపై విచారణ జరుగుతోందని చెప్పారు. ఒకవేళ సైన్యం తప్పు చేస్తే గుణపాఠం నేర్చుకుంటుందని వాన్స్ అన్నారు.

# 'ధర్తి పకడ్' నాగర్‌మల్ బాజోరియా కన్నుమూత

- పలుమార్లు ఎన్నికల్లో పోటీ
- ఒక్కసారీ గెలవని వైనం

**పాట్నా, సెప్టెంబరు 05 (ఎ.ఎం.ఎస్) :**

భారత ఎన్నికల చరిత్రలో తనకంటూ ఓ ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించుకున్న 'ధర్తి పకడ్' నాగర్‌మల్ బాజోరియా (96) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, పాట్నాలోని మెడికల్ కాలేజ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం తుదిశ్వాస విడిచారు. చాలా సార్లు ఎన్నికల బరిలో నిలిచి, ఒక్కసారి కూడా గెలవకపోయినా ప్రజాస్వామ్య ప్రక్రియలో పాల్గొనడమే ముఖ్యమని చాటిచెప్పిన ఆయన మృతితో ఒక శకం ముగిసింది.1930లో లాహోర్‌లో జన్మించిన నాగర్‌మల్ కుటుంబం, దేశ విభజనకు ముందే బిహార్‌లోని భాగల్‌పూర్‌కు వలస వచ్చింది. అక్కడ వ్యాపారం చేస్తూనే సామాజిక కార్యకర్తగా పేరు తెచ్చుకున్నారు. వార్డు స్థాయి ఎన్నికల



నుంచి లోక్‌సభ, విధానసభ, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి పదవుల వరకు సుమారు 280కి పైగా ఎన్నికల్లో ఆయన పోటీ చేశారు. ఓటమి ఎదురైన ప్రతీసారి, "నేను ఎన్నికల్లో ఓడిపోను, ప్రజలే ప్రతీసారి ఓడిపోతున్నారు" అని చెప్పడం ఆయన నైజం. తన ఓటమిని ఆయన ఎప్పుడూ అంగీకరించలేదు.

దేశ రాజకీయాల్లో దిగ్గజాలుగా వెలిగిన ఇందిరా గాంధీ (రాయ్‌బరేలి), రాజీవ్ గాంధీ (అమేథి), అటల్ బిహారీ వాజ్‌పేయి, ఎల్.కె. అద్వాణీ, ప్రణబ్ ముఖర్జీ వంటి వారిపై కూడా ఆయన పోటీకి నిలిచారు. 1997లో వాజ్‌పేయికి వ్యతిరేకంగా 100 గాడిదలతో ప్రచారం నిర్వహించి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించారు. 1969లో రాష్ట్రపతి అభ్యర్థి వి.వి. గిరిపై నామినేషన్ వేయడంతో పాటు, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో 1718 సార్లు తన అదృష్టాన్ని పరీక్షించుకున్నారు.

# ఢిల్లీలో కుండపోత

- అనేక ప్రాంతాలు జలమయం
- రెడ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 05 (ఎ.ఎం.ఎస్) :**



దేశ రాజధాని ఢిల్లీతో పాటు దాని పరిసర ప్రాంతాలను (ఎన్‌సీఆర్) శనివారం ఉదయం కూడా కుండపోత వర్షం ముంచెత్తింది. భారీ వర్షాల కారణంగా అనేక ప్రాంతాలు జలమయమవడంతో భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఢిల్లీకి 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. వర్షాల వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలగడంతో పాటు, విమాన సర్వీసులపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. భారీ వర్షాల నేపథ్యంలో ఇండిగో, ఎయిర్ ఇండియా వంటి విమానయాన సంస్థలు ప్రయాణికులకు పలు సూచనలు జారీ చేశాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల విమాన సర్వీసులు ఆలస్యమయ్యే అవకాశం ఉందని, ప్రయాణికులు తమ విమాన ప్రయాణ స్థితిగతులను ముందుగానే తనిఖీ చేసుకోవాలని సూచించాయి. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో విమానాశ్రయానికి చేరుకోవడానికి అదనపు సమయం పట్టవచ్చని హెచ్చరించాయి. అయితే, ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమాన రాకపోకలు ప్రస్తుతానికి సాధారణంగానే కొనసాగుతున్నాయని విమానాశ్రయ నిర్వహణ సంస్థ జీఎంఆర్ స్పష్టం చేసింది. నగర పరిధిలోని కన్నాట్ ప్లేస్ ఔటర్ సర్కిల్, గీతా కాలనీ, అక్బర్ రోడ్ వంటి ప్రధాన ప్రాంతాలు జలమయమయ్యాయి. కన్నాట్ ప్లేస్‌లో మోటార్ల సాయంతో నీటిని తోడివేస్తున్నప్పటికీ, కొన్ని దుకాణాల్లోకి వర్షపు నీరు చేరింది. గ్రేటర్ నోయిడా, నోయిడా ప్రాంతాల్లోనూ భారీ వర్షపాతం నమోదైంది. ఈ వర్షాల ప్రభావంతో ఢిల్లీ వాసులకు ఉక్కపోత నుంచి ఉపశమనం లభించింది. నగరంలో కనిష్ఠ ఉష్ణోగ్రత 24.8 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. అయితే, ఆదివారం నుంచి వర్షాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని, సెప్టెంబర్ 7 నుంచి కేవలం తేలికపాటి జల్లులు మాత్రమే కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

# ముస్లింలమని తెలిసిన తర్వాత మరింతగా కొట్టారు

- ఇద్దరు మహిళా జర్నలిస్టుల ఆరోపణలు
- ఢిల్లీ పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు
- సీఎం రేఖా గుప్తా పాల్గొన్న కార్యక్రమంలో ఘటన

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 05 (ఎ.ఎం.ఎస్) :**




బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సాధారణ మహిళలకే కాదు.. మహిళా జర్నలిస్టులకూ విలువ లేకుండా పోతోంది. ఢిల్లీలో మహిళా జర్నలిస్టులపై పోలీసుల వ్యవహారశైలిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యమంత్రి రేఖా గుప్తా పాల్గొన్న ఓ కార్యక్రమంలో ఆమెను ప్రశ్నించేందుకు ప్రయత్నించిన తనను, తన తోటి ఉద్యోగి నఫీసా ఖాన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని సాకేత్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారని జర్నలిస్ట్ షహీన్ ఖాన్ ఆరోపించారు. అక్కడ తమపై దాడి చేయడంతో పాటు మానసిక వేధింపులకు గురిచేశారని ఆమె వివరించారు. అంతేకాకుండా తమ పేర్లు తెలుసుకున్న పోలీసులు తాము ముస్లింలమని గుర్తించిన తర్వాత దాడి మరింత ఎక్కువైందని ఆరోపించారు. పోలీసులు, బాధితుల వివరాల ప్రకారం... ఓ ప్రయివేటు ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేఖా గుప్తా హాజరయ్యారు. ఆ సమయంలో ఆమెను ప్రశ్నించేందుకు షహీన్ ఖాన్ ప్రయత్నించగా పోలీసులు ఆమెను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ క్రమంలో తనను కొట్టారని షహీన్ ఆరోపించారు. నఫీసా ఖాన్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని మానసికంగా వేధించారని ఆమె పేర్కొన్నారు. నఫీసా శరీరంపై కనిపించిన గాయాలను కూడా ఆమె వీడియోలో చూపించారు. పోలీసు సిబ్బంది తన పేరు అడిగి 'ఖాన్' అని తెలుసుకున్న తర్వాత దాడి మరింత తీవ్రంగా మారిందని షహీన్ ఖాన్ ఆరోపించారు.

**జర్నలిస్టు సంఘాల ఆగ్రహం**

ఈ వ్యవహారంపై దేశంలోని ప్రముఖ జర్నలిస్టు సంఘాలు కూడా స్పందించాయి. ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఉమెన్స్ ప్రెస్ కార్ప్స్, ఢిల్లీ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్, ప్రెస్ అసోసియేషన్, కేరళ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. సాకేత్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న సంబంధిత పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. మహిళా జర్నలిస్టులపై దాడి విషయంలో కాంగ్రెస్, ఆప్ నేతలు తీవ్రంగా స్పందించారు. ఆప్ ఢిల్లీ విభాగం అధ్యక్షుడు సౌరభ్ భరద్వాజ్ మాట్లాడుతూ.. ఇద్దరు మహిళా రిపోర్టర్లను ముఖ్యమంత్రిని ప్రశ్నించినందుకు పోలీసులు క్రూరంగా కొట్టారని ఆరోపించారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ జోక్యం చేసుకుని, ఘటనకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆప్ నేత సోమనాథ్ భారతి కోరారు. ఢిల్లీ పోలీసుల రాజ్యంగా మారిందా? అని కాంగ్రెస్ నేత పవన్ ఖేరా ప్రశ్నించారు. ఒక జర్నలిస్ట్ ముస్లిం అని పోలీసులు తెలుసుకున్న తర్వాత దాడి తీవ్రత పెరగడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

# పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్‌స్టేషన్ ఎదుట సీజేపీ ఆందోళన

- భరద్వాజ్‌పై హత్యాయత్నం కేసు నమోదుకు నిరసన
- దిగొచ్చిన పోలీసులు
- 72 గంటల్లో అరెస్టు చేస్తామని హామీ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 05 (ఎ.ఎం.ఎస్):**



జంతర్‌మంతర్ వద్ద జులై 23న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన ఆందోళన సందర్భంగా జరిగిన ఘటనపై హిందుత్వ కార్యకర్తగా చెప్పుకునే స్వతంత్ర భరద్వాజ్‌పై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. భరద్వాజ్‌పై సెక్షన్ 307, ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని, ఆయనను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సీజేపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. సీజేపీ సహ కన్వీనర్లు సౌరవ్ దాస్, అశుతోష్‌రాంకాతో పాటు ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షీరామ్) అధినేత, ఎంపీ చంద్రశేఖర్ ఆజాద్, సీజేపీ కార్యకర్తలు పటేల్‌చౌక్ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి, అక్కడ ఆందోళన చేపట్టారు. ఢిల్లీ పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ భరద్వాజ్‌పై కఠిన చర్యలు తీసుకోవడంలో ఢిల్లీ పోలీసులు విఫలమయ్యారని ఆరోపించారు. సంజయ్‌కుమార్‌పై దాడి జరిగినప్పటి నుంచి న్యాయం కోసం పోరాడుతున్నామని అశుతోష్‌రాంకా తెలిపారు. ఘటనకు సంబంధించి భరద్వాజ్‌పై కఠినమైన క్రిమినల్ సెక్షన్లు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హత్యాయత్నం సెక్షన్ కూడా నమోదు చేయాలన్నారు. సౌరవ్ దాస్ మాట్లాడుతూ దాడి గురించి బహిరంగంగా మాట్లాడుతున్న వ్యక్తి ఇంకా బయట ఎలా తిరుగుతున్నారని ప్రశ్నించారు. ఢిల్లీ పోలీసులు అధికార బీజేపీ ఒత్తిడికి లొంగి చర్యలు తీసుకోవడం లేదని, దళిత కుటుంబానికి చెందిన సంజయ్, ఆయన కుమార్తెపై జరిగిన దాడిని తక్కువ చేసి చూపుతున్నారని విమర్శించారు. పోలీసుల వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. భరద్వాజ్‌కు రాజకీయ పలుకుబడి కారణంగా పోలీసులు రక్షణ కల్పిస్తున్నారన్న ఆరోపణలను ఢిల్లీ పోలీసులు ఖండించారు.

నీట్ నిరసనల సమయంలో సీజేపీ కార్యకర్త నిషు ఆజాద్ తండ్రి సంజయ్‌పై దాడి చేశానని, ఆయన తల పగలగొట్టానని, రాజకీయ నేపథ్యం కారణంగా తనపై చర్యలు తీసుకోలేదని భరద్వాజ్ ఓ పాడ్‌కాస్ట్‌లో వ్యాఖ్యానిం చిన వీడియో వైరల్ కావడంతో వివాదం తలెత్తింది. దీంతో భరద్వాజ్‌ను అరెస్టు చేయాలని, కఠిన సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని సీజేపీ డిమాండ్ చేసింది.

ఎఫ్ఐఆర్‌లో సంబంధిత చట్టపరమైన సెక్షన్లు చేర్చాలన్న తమ డిమాండ్‌ను పోలీసులు అంగీకరించారని సంజయ్ ఆజాద్ తెలిపారు. నిందితులను 72 గంటల్లో అరెస్టు చేస్తామని పోలీసులు హామీ ఇచ్చారని చెప్పారు. ఢిల్లీ పోలీసులపైనా, రాజ్యాంగంపైనా తమకు పూర్తి విశ్వాసం ఉందన్నారు. ఘటన అనంతరం తన తండ్రికి కుట్లు వేయాల్సి వచ్చిందని, పోలీసులు చర్యలు తీసుకోవడంలో జాప్యం చేస్తున్నారని నిషు ఆజాద్ పేర్కొన్నారు. నిందితుడిపై ఎందుకు కఠినమైన సెక్షన్లు నమోదు చేయలేదని ఆమె ప్రశ్నించారు. న్యాయం కోసం కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ జోక్యం చేసుకోవాలని కోరారు. నిషు ఆజాద్‌కు రాహుల్‌గాంధీతో పాటు పలువురు ప్రతిపక్ష నేతలు మద్దతు తెలపడంతో జంతర్‌మంతర్ ఘటన ఢిల్లీలో మరోసారి రాజకీయ వివాదానికి దారితీసింది.

తనపై వచ్చిన ఆరోపణలపై స్వతంత్ర భరద్వాజ్ స్పందిస్తూ.. తాను ఆత్మరక్షణ కోసమే తిరగబడ్డానని తెలిపారు. తన వద్ద దీనికి సంబంధించిన వీడియో ఆధారాలు ఉన్నాయని చెప్పారు. 10-15 మంది తనను చుట్టుముట్టడంతో ఆత్మరక్షణకు ప్రయత్నించగా సంజయ్ తలకు దెబ్బ తగిలిందన్నారు. రాహుల్‌గాంధీ, ఇతరులు సోషల్ మీడియాలో పంచుకుంటున్న పాడ్‌కాస్ట్ క్లిప్ నకిలీదని, తన వ్యాఖ్యలను వక్రీకరించారని పేర్కొన్నారు.

భరద్వాజ్‌పై బలహీనమైన సెక్షన్లు నమోదు చేశారని తొలుత సీజేపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. పోలీసులతో గంటల తరబడి చర్చలు నిర్వహించిన అనంతరం సంజయ్‌పై జరిగిన దాడికి సంబంధించిన ఎఫ్ఐఆర్‌లో ఎస్సీ, ఎస్టీ చట్టంలోని సంబంధిత సెక్షన్లను చేర్చారు. హత్యాయత్నం అభియోగాన్ని వర్తింపజేయాలా లేదా అన్నది వైద్య పరీక్షల ఆధారంగా నిర్ణయించనున్నట్లు పోలీసులు తెలిపారు. నిషు ఆజాద్ చేసిన అత్యాచార బెదిరింపుల ఫిర్యాదును కూడా పోలీసులు స్వీకరించారు.

# మూడు రోజులపాటు సీజ్ ఫైర్

- ఉక్రెయిన్‌పై రష్యా నిర్ణయం



**మాస్కో, సెప్టెంబరు 05 :**

రష్యా-ఉక్రెయిన్ దేశాలు పలు రోజుల నుంచి పరస్పరం డ్రోన్ దాడులతో విరుచుకుపడుతున్నాయి. ఈ క్రమంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఉక్రెయిన్ లో అమెరికా రాయబారులు స్టీవ్ విట్కాఫ్, జారెడ్ కుష్నర్‌ల పర్యటన నేపథ్యంలో కీవ్‌పై రష్యా దాడులను మూడు రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. సెప్టెంబర్ 5వ తేదీ అర్ధరాత్రి నుంచి ఉక్రెయిన్ రాజధానిపై దాడులకు దూరంగా ఉండాలని రష్యా బలగాలను ఆదేశించినట్లు క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ తెలిపారు.యుద్ధాన్ని ముగించే లక్ష్యంతో

**సెప్టెంబర్ 5వ తేదీ అర్ధరాత్రి నుంచి ఉక్రెయిన్ రాజధానిపై దాడులకు దూరంగా ఉండాలని రష్యా బలగాలను ఆదేశించినట్లు క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ తెలిపారు. యుద్ధాన్ని ముగించే లక్ష్యంతో ఉక్రెయిన్‌కు వస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రత్యేక రాయబారుల కీలక పర్యటనకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.**

ఉక్రెయిన్‌కు వస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రత్యేక రాయబారుల కీలక పర్యటనకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## కుడా చైర్‌పర్సన్‌గా గుండు సుధారాణి ప్రమాణ స్వీకారం



**హనుమకొండ, సెప్టెంబర్ 05 (వుదయం ప్రతినిధి) :** కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) నూతన చైర్‌పర్సన్‌గా గుండు సుధారాణి శనివారం హనుమకొండలోని కుడా కార్యాలయంలో అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ, స్టేషన్ ఘన్‌పూర్, పరకాల ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డిలతో పాటు కుడా వైస్ చైర్మన్, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి పాల్గొని, ఆమెకు పుష్పగుచ్ఛాలు, పూల మొక్కలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గుండు సుధారాణి మాట్లాడుతూ... తనకు ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రులకు, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. కుడా పరిధిలో ప్రణాళికాబద్ధమైన పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ప్రజలకు మెరుగైన సౌకర్యాల ద్యేయంగా ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కుడా సీపీఓ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్‌రావు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొని నూతన చైర్‌పర్సన్‌కు అభినందనలు తెలియజేశారు.

## సాఫీగా గ్రామాలకు తాగునీటి సరఫరా

**– జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**
**శాయంపేట మండలం జోగంపల్లిలోని మిషన్ భగీరథ నీటి శుద్ధీకరణ ప్లాంటును పరిశీలించిన కలెక్టర్**



**హనుమకొండ, సెప్టెంబర్ 05 (వుదయం ప్రతినిధి) :** హనుమకొండ జిల్లా మండలంలోని గ్రామాలకు తాగునీటి సరఫరాలో ఎక్కడ కూడా సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. శనివారం హనుమకొండ జిల్లా శాయంపేట మండలం జోగంపల్లిలోని మిషన్ భగీరథ తాగునీటి శుద్ధీకరణ ప్లాంట్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రా వాటర్ ఎక్కడినుండి వస్తుందని, నీటి సరఫరా పరిస్థితి ఎలా ఉందని, పంపుల పనితీరు, క్లోరినేషన్, ఇన్‌ట్రా డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థ, పంపింగ్ తీరు తదితర అంశాలను సంబంధిత అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. శాయంపేట మండలంలోని 26 గ్రామాలకు రోజుకు ప్రస్తుతం సుమారు 5.35 ఎమ్ఎల్డీ నీటిని సరఫరా చేస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. నీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన అన్ని పంపులు పని చేసే స్థితిలో ఉన్నాయా, ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తినప్పుడు వెంటనే వినియోగించేందుకు స్టాండ్‌బై పంపులు, ప్రత్యామ్నాయ పరికరాలు అందుబాటులో ఉన్నాయా అని కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు సురక్షితమైన తాగునీరు నిరంతరాయంగా అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. నీటి సరఫరా వ్యవస్థలో ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వాటిని వెంటనే గుర్తించి పరిష్కరించాలని, ప్రత్యామ్నాయ నీటి వనరులు, అదనంగా పరికరాలను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని సూచించారు.ప్రజలకు తాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొన్నారు. పరకాలలోని చలివాగుకు సంబంధించిన చెక్ డ్యామ్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. చెక్ డ్యామ్ ద్వారా వరద నీరు సాఫీగా వెళ్లే విధంగా చేపట్టనున్న మరమ్మతు పనుల గురించిన వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ ఇంట్రా ఆర్డబ్ల్యూఎస్ ఈఈ గాయత్రి, వాటర్ గ్రిడ్ ఈఈ సురేందర్, సాగునీటిపారుదల శాఖ ఈఈ సునీత, పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులతోనే సమాజ సమూల మార్పు సాధ్యం
## జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేటను విద్యా రంగంలో అగ్రభాగాన నిలుపుదాం**
**నా ప్రస్థానానికి, ఎదుగుదలకు గురువులే పునాది**
**గురుపూజోత్సవ వేడుకల్లో కలెక్టర్**



**సూర్యాపేట, సెప్టెంబర్ 5: వుదయం ప్రతినిధి** సమాజంలో బలమైన మార్పు తీసుకురావాలన్నా, ఒక ఉత్తమమైన రాష్ట్రాన్ని, దేశాన్ని నిర్మించాలన్నా అది కేవలం ఉపాధ్యాయుల ద్వారానే సాధ్యమని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ స్పష్టం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించిన గురుపూజోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులకు ఆయన చేతుల మీదుగా అవార్డులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సభా ప్రాంగణంలో కలెక్టర్ మాట్లాడుతూ తన జీవిత ప్రయాణంలో గురువుల పాత్రను గుర్తుచేసుకుని, ఉపాధ్యాయ లోకానికి శిరస్సు వంచి నమస్కరిస్తూ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

పుట్టుకతోనే బడి ప్రయాణం.. నా గురువులే నా సర్వస్వం తన బాల్యం మరియు విద్యాభ్యాసాన్ని గుర్తుచేసుకుంటూ కలెక్టర్ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. నేను పుట్టి పెరిగింది. అనంతరం సాతారాలోని సైనిక్ స్కూల్, ఇంజనీరింగ్, ఆపై యూపీఎస్సీ ప్రస్థానంలో తనకు మార్గదర్శనం చేసిన ప్రతి ఒక్క గురువును ఆయన పేరుపేరునా స్మరించుకున్నారు. సివిల్ సర్వీసెస్‌లోకి వచ్చిన తర్వాత లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ లోని గురువులతో పాటు, తన మొదటి కలెక్టర్ సత్యనారాయణ, శరత్, వెంకట్రావు వంటి సీనియర్ అధికారుల వద్ద జూనియర్ అసిస్టెంట్లు, సూపరింటెండెంట్లు, వివిధ విభాగాల అధికారుల నుంచి కూడా ఎన్నో విషయాలు నేర్చుకుంటూ ఈ స్థాయికి చేరుకున్నానని వినమ్రంగా చెప్పారు.

ఉపాధ్యాయులకు కలెక్టర్ ప్రత్యేక ప్రశంసా పత్రాలు

సాధారణంగా స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవాల్లో ఇచ్చే ప్రశంసా పత్రాలు కొన్ని పరిమితులకు లోబడి ఉంటాయని, అందుకే ఈసారి ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యా రంగంలో నిరంతరం శ్రమిస్తున్న వారందరికీ ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని నిర్ణయించినట్లు కలెక్టర్ వెల్లడించారు. . తరగతి గదుల్లో నిశ్శబ్దంగా దేశ భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయుల మహోన్నత సేవలను వారి విద్యార్థుల ప్రగతి ద్వారానే గుర్తించగలమని కొనియాడారు.

సాంకేతికత మారినా గురువు స్థానం శాశ్వతం

మారుతున్న కాలానికి అనుగుణంగా పాఠశాలల్లోనూ విద్యాబోధన పద్ధతులు మారాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. 30 సంవత్సరాల క్రితం కాలినడకన, సైకిళ్ల పై వెళ్లే పరిస్థితుల నుంచి నేడు జీవనశైలి ఎంతగానో మారిపోయిందని గుర్తుచేశారు. గతంలో విజ్ఞానం కావాలంటే పుస్తకాలు, గురువుల వద్దే లభించేది. ఆ తర్వాత వికీపీడియా వచ్చింది.. ఇప్పుడు పర్ప్లెక్సిటీ వంటి సరికొత్త సాంకేతిక సెర్చ్ ఇంజన్ల యుగం నడుస్తోందని, కానీ, ఎంత సాంకేతికత వచ్చినా, కృత్రిమ మేధ పెరిగినా విద్యార్థిని వ్యక్తిగతంగా సరైన మార్గంలో నడిపించే గురువు స్థానాన్ని ఏ యంత్రమూ భర్తీ చేయలేదని స్పష్టం చేశారు.

పిల్లల్లో సరైన నిర్ణయం తీసుకునే సామర్థ్యం పెంచాలి

విద్యార్థులకు కేవలం పాఠ్య పుస్తకాల నాలెడ్జ్, చదవడం, రాయడం బోధించడమే కాకుండా.. మారుతున్న సమాజంలో ఏది మంచి, ఏది చెడు అని గ్రహించే నిర్ణయాత్మక శక్తిని, మానవతా విలువలను పెంపొందించడం ఉపాధ్యాయుల బాధ్యత అని పిలుపునిచ్చారు.

సూర్యాపేట విద్యాశాఖ 'టేకాఫ్' దశలో ఉంది

సూర్యాపేట జిల్లా చైతన్యవంతమైన జిల్లా అని, ఇక్కడి విద్యా రంగం ప్రస్తుతం ఒక సరికొత్త టేకాఫ్ దశలో ఉందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక్కడి నుంచి జిల్లా విద్యాశాఖ పురోగతికి ఆకాశమే హద్దు కావాలన్నారు. ఈ సందర్భంగా భారతదేశ తొలి ఉపరాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు ఘనంగా నివాళులర్పించారు. సూర్యాపేట జిల్లా పేరులోనే ఉన్న సూర్యుడిలాగా, ఇక్కడి విద్యా రంగం కూడా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచి వెలగాలని కలెక్టర్ తెలిపారు.

కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్ రాజ్, డిఐఓ సులోచన రాణి, ఆర్ సి ఓ లు, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్తిలో గులాబీ పురుగు కట్టడి..



**అప్రమత్తంతో యాజమాన్యం పంటను కాపాడుకోవాలి**

**జనగామ, సెప్టెంబర్ 05 (వుదయం ప్రతినిధి) :** జనగామ జిల్లా చిల్పూర్ మండలం చిన్నపెండ్యాల గ్రామంలో ప్రత్తి పంటలో గులాబీ రంగు పురుగు మరియు రసంపీల్చే పురుగుల సమగ్ర యాజమాన్యంపై రైతులకు అవగాహన కార్యక్రమం మరియు క్షేత్రస్థాయి ప్రదర్శన నిర్వహించారు. ప్రస్తుతం ప్రత్తి పంట పూత, కాయ ఏర్పడటం మరియు కాయల అభివృద్ధి దశలో ఉన్నందున గులాబీ రంగు పురుగు ఉనికిని ప్రారంభ దశలోనే గుర్తించి, సకాలంలో నివారణ చర్యలు చేపట్టడం అత్యంత ముఖ్యమని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం-జనగామ కోఆర్డినేటర్ డా. వి. రమ్య తెలిపారు. చిల్పూర్ మండల వ్యవసాయ అధికారి శ్రీ నర్సింగ్ రావు మాట్లాడుతూ గులాబీ రంగు పురుగు ప్రధానంగా కాయలలోకి ప్రవేశించి లోపల విత్తనాలను దెబ్బతీయడం వల్ల నష్టం బయటకు స్పష్టంగా కనిపించకపోవచ్చని, అందువల్ల పంటను క్రమం తప్పకుండా పరిశీలించాలని రైతులకు సూచించారు. ప్రత్తి పంట విత్తిన 45 రోజుల నుండి గులాబీ రంగు పురుగు ఉనికి ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలు అమర్చి, వరుసగా మూడు రోజులు 7 లేదా 8 తల్లి రెక్కల పురుగులను పడటం గమనించినట్లయితే లేదా చేనులో 10% గుడ్డి పువ్వులు లేదా 10% పురుగు ఆశించిన కాయలను గమనించిన వెంటనే సస్య రక్షణ చర్యలు చేపట్టాలి. ఎకరానికి 8 లింగాకర్షక బుట్టలు, 4 కార్డుల ట్రైకోగ్రామా బాక్టరే గుడ్డు పరాన్నజీవి చేనులో వదిలి, వేప నూనె 1500 పీ పీ యం 5 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. రసాయన పురుగు మందులైన ఎమామెక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రా. లేదా స్పినెటోరామ్ 0.9 మి.లీ. లేదా థయోడికార్బ్ 1.5 గ్రా. ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. సకాలంలో కోత మరియు కోత అనంతర పంట అవశేషాల నిర్వహణ వంటి అన్ని చర్యలను సమగ్రంగా చేపట్టినప్పుడే సమర్థవంతంగా సాధ్యమవుతుందని డా. వి. రమ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కిరణ్ రెడ్డి , వరంగల్ వ్యవసాయ కళాశాల గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమం (రావెప్) విద్యార్థినులు, రైతులు రమేష్, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

## నిమజ్జన ప్రదేశాల్లో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

**భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి**
**కమిషనర్ వెంకన్న**



**వరంగల్ టౌన్,సెప్టెంబర్ 05 (వుదయం ప్రతినిధి) :** నిమజ్జన ప్రదేశాల్లో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిడబ్ల్యూఎంసి కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. వినాయక నవరాత్రి ఉత్సవాల అనంతరం నిర్వహించనున్న వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రేటర్ వరంగల్ నగరపాలక సంస్థ పరిధిలోని నిమజ్జన ప్రదేశాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లను శనివారం క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉర్సు గుట్ట చెరువు, బంధం చెరువు, నిమజ్జన పాయింట్లను ఇంజనీరింగ్ శానిటేషన్ అధికారులతో కలిసి కమిషనర్ సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. నిమజ్జన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఆయా ప్రాంతాల్లో ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

నిమజ్జన ప్రదేశాలకు వెళ్లే ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులను పరిశీలించి, అవసరమైన చోట్ల రోడ్డు మరమ్మతులు, గుంతల పూడ్చివేత, రహదారుల చదును, లైటింగ్, చెరువులలో గుర్రపు డెక్క తొలగింపు, పూడికతీత వంటి పనులను వెంటనే పూర్తి చేసి ఈనెల 14వ తేదీలోగా సిద్ధంగా ఉండాలని సూచించారు. నిమజ్జన సమయంలో వాహనాల రాకపోకలు అధికంగా ఉండే అవకాశం ఉన్నందున రహదారులు సౌకర్యవంతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిమజ్జన ప్రదేశాల పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని కమిషనర్ సూచించారు. చెత్తాచెదారం పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరిచేలా చర్యలు చేపట్టాలని, నిమజ్జనానికి ముందు మరియు అనంతరం పారిశుధ్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. నిమజ్జన ప్రదేశాల్లో భక్తులు, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను ముందుగానే ఏర్పాటు చేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ వెంకన్న స్పష్టం చేశారు. నిమజ్జన ప్రదేశాలకు సంబంధించిన పనుల్లో ఎలాంటి జాప్యం ఉండకూడదని, నిర్దేశించిన సమయంలోగా అన్ని పనులను పూర్తి చేసి సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సాఫీగా జరిగేలా నగరపాలక సంస్థ పరిధిలోని సంబంధిత విభాగాలు సమన్వయంతో పనిచేయాలని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించాలని కమిషనర్ సూచించారు. ముఖ్యంగా భక్తులు నిమజ్జన ప్రదేశాలకు చేరుకునే సమయంలో, తిరిగి వెళ్లే సమయంలో కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని తెలిపారు.

ప్రజలు, భక్తుల సౌకర్యం మరియు నగర పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ నిమజ్జన కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లన్నీ సకాలంలో, సమర్థవంతంగా పూర్తి చేయాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు మహేందర్, సంతోష్ బాబు, రవికుమార్, మాధవి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడుల బలోపేతానికి ప్రభుత్వం పెద్దపీట
## జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ, సెప్టెంబర్ 05 (వుదయం జిల్లా ప్రతినిధి) :** విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పునాది వేసే ప్రతి ఉపాధ్యాయుడూ ఉత్తముడేనని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పేర్కొన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో గురు పూజోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను కలెక్టర్ ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ . . . సమాజ నిర్మాణంలో కీలక పాత్ర, ఉపాధ్యాయ వృత్తి కేవలం ఉద్యోగం మాత్రమే కాదని, సమాజాన్ని, భవిష్యత్ తరాన్ని సరైన మార్గంలో నడిపించే బాధ్యత అని కలెక్టర్ అన్నారు. మెరుగైన విద్యా ఫలితాలు: ఉపాధ్యాయుల కృషితోనే పదో తరగతి ఫలితాల్లో జిల్లా 18వ స్థానం నుండి 9వ ర్యాంకుకు చేరుకుందని, ఈ ఏడాది మరింత మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యమని తెలిపారు. డిజిటల్ & ప్రత్యేక శిక్షణ: కేజీబీవీ విద్యార్థులకు నీట్, జేఈఈ, క్లాట్ వంటి పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నామని, పాఠశాలల్లో డిజిటల్ విద్యను మరింత విస్తరిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన ఉత్తమ ఉపాధ్యాయులను కలెక్టర్ శాలువాలు, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్, ఎంఈఓలు నెహ్రూ నాయక్, మనోజ్ కుమార్, ఏఎంఓ డాక్టర్ మన్మోహన్, ప్లానింగ్ కోఆర్డినేటర్ మహేష్, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డికి పట్టణ మున్సిపల్ చైర్మన్ తంగాళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ వినతి



**యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 05 (వుదయం ప్రతినిధి) :**

భువనగిరి సమగ్ర అభివృద్ధికి రూ.270 కోట్లు మంజూరు చేయండి: సీఎం రేవంత్ రెడ్డికి భువనగిరి పట్టణ మున్సిపల్ చైర్మన్ తంగాళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ వినతి

భువనగిరి: యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రమైన భువనగిరి పట్టణాన్ని రాష్ట్రంలోనే మోడల్ అర్బన్ సెంటర్ గా తీర్చిదిద్దేందుకు రూ.270 కోట్ల నిధులు, 50 మంది అదనపు పారిశుద్ధ్య కార్మికులను మంజూరు చేయాలని కోరుతూ భువనగిరి పట్టణ మున్సిపల్ చైర్మన్ తంగాళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ నకిరేకల్ లో జరిగిన భారీ బహిరంగ సభకు విచ్చేసిన గౌరవనీయులు.తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ అనుముల రేవంత్ రెడ్డి గారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ తన వినతిపత్రంలో పేర్కొన్న వివరాలు... భువనగిరి పట్టణం చారిత్రక భువనగిరి కోటకు ప్రసిద్ధి చెందిందని, దీనిని పశ్చిమ చాళుక్య రాజు త్రిభువనమల్ల విక్రమాదిత్య VI నిర్మించారని, తరువాత కాకతీయుల కాలంలో మరింత ప్రాశస్త్యం పొందిందని తెలిపారు. 1952లో మున్సిపాలిటీగా ఏర్పడిన భువనగిరి 2019లో రాయిగిరి, పాగిడిపల్లి, బొమ్మాయిపల్లి గ్రామాల విలీనంతో 76.537 చ.కి.మీ విస్తరించిందని, హైదరాబాద్ కు 48 కి.మీ, ప్రపంచ ప్రసిద్ధ యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి 13 కి.మీ దూరంలో ఉందని, ప్రస్తుత జనాభా 78 వేలకు చేరిందని పేర్కొన్నారు.యాదాద్రి టెంపుల్ కారిడార్, ఇండస్ట్రియల్ కారిడార్, పెరుగుతున్న తేలియాడే జనాభాతో పట్టణంపై భారం రెట్టింపు అయిందని, మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని వివరించారు. సీఎంకు సమర్పించిన ప్రధాన డిమాండ్లువినతిపత్రంలో కోరారు. తెలిపారు. మీ దూరదృష్టి నాయకత్వంలో భువనగిరిని క్లీన్ & గ్రీన్ భువనగిరిగా, స్వచ్ఛ తెలంగాణలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ఈ నిధులు, సిబ్బందిని త్వరగా మంజూరు చేయాలని భువనగిరి పట్టణ మున్సిపల్ చైర్మన్ తంగాళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ ముఖ్యమంత్రిని వినతిపత్రంలో కోరారు.

## ముసాయిదా ఓటరు జాబితా లోని ఓటర్లందరూ తుది జాబితా లో వుండే లక్ష్యంగా చర్యలు...
## జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**1,75,858 మంది ఓటర్లకు ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారుల ద్వారా నోటీసులు**
**ఎస్ఐఆర్ ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం**



**ఖమ్మం వుదయం బ్యూరో సెప్టెంబర్** ముసాయిదా ఓటర్ల జాబితా లో ఉన్న ఓటర్లందరూ తమ ఓటు హక్కు పొందేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. జిల్లా కలెక్టర్, ఇఆర్ఓ లతో కలిసి శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ ప్రక్రియ, నోటీసుల జారీలపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ముసాయిదా ఓటర్ల జాబితాలో గుర్తించిన అనామలీస్, మ్యాపింగ్ లేని ఓటర్ల వివరాలు, క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ, పరిష్కార ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 17న ఎస్ఐఆర్ ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసినట్లు, మ్యాపింగ్ లేని, అనామలీస్ ఓటర్లకు నోటీసుల జారీ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 10,85,927 మంది ఓటర్లతో ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలైందని, ఇందులో 1,75,858 మంది మ్యాపింగ్ కాని, అనామలీస్ ఓటర్లకు నోటీసులు జారీచేయనుండగా,ఇప్పటి వరకు 1,75,841 నోటీసులు జనరేట్ చేసి, 1,32,817 మందికి నోటీసులు అందజేశామన్నారు. నోటీసుల ప్రకారం 14,680 మంది ఓటర్ల హియరింగ్ ప్రక్రియ పూర్తిచేశామన్నారు.నోటీసులు అందుకున్న వారు సంబంధిత పత్రాలు సమర్పించాలినోటీసులు అందుకున్న ఓటర్లు తమ పుట్టిన తేదీ ఆధారంగా భారత ఎన్నికల సంఘం సూచించిన పత్రాల్లో సంబంధిత పత్రాలను సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. పేర్ల అసంబద్ధత వున్న వారు ధృవీకరణలు సమర్పించుకున్న, సంబంధిత బూత్ లెవల్ అధికారులు పంచనామా చేసి ధృవీకరిస్తారన్నారు. *అర్హులైన కొత్త ఓటర్లు నమోదు చేసుకోవచ్చు ప్రస్తుతం కూడా అర్హులైన వారు కొత్త ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు. 2026 అక్టోబరు 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు, ఏ శాసనసభ నియోజక వర్గంలోనూ ఓటరుగా నమోదు కాకపోతే ఫారమ్ 6 ద్వారా తాజా ఫొటో, వయస్సు ధృవీకరణ పత్రం, డిక్లరేషన్ తదితరాలను జతచేసి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా తుది ఓటర్ల జాబితాను అక్టోబర్ 19, 2026న ప్రచురించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ పరిధిలోని ఓటర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా తుది జాబితాలో నమోదు అయ్యేలా సహకరించాలని సూచించారు. ఎస్ఐఆర్‌కు సంబంధించిన వివరాల కోసం బూత్ స్థాయి అధికారి, సహాయ ఎన్నికల నమోదు అధికారి, ఎన్నికల నమోదు అధికారులను సంప్రదించవచ్చని, అలాగే టోల్‌ఫ్రీ 1950కు ఫోన్ చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఎస్డిసి సదానందం, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, డిటి అన్సారీ, బీ.ఆర్.ఎస్. పార్టీ ప్రతినిధి ఎం .రమేష్, బీజేపీ ప్రతినిధి వి.రాజేష్, సిపిఐ(ఎం) ప్రతినిధి డి.తిరుపతి రావు, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఏ.గోపాల రావు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు




**మహబూబాబాద్, సెప్టెంబర్ 05 (వుదయం ప్రతినిధి) :** పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. 'షేర్' (SHARE) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ (జెఆర్సి) విభాగం అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జెఆర్సి) మహబూబాబాద్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీకాంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ నాగవాని మాట్లాడుతూ.. సమాజంలో పేరుకుపోయిన సామాజిక అసమానతలు, అనాచారాల నిర్మూలనలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. కేవలం పుస్తకాల్లోని చదువునే కాకుండా, పిల్లలను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దే శక్తి ఉపాధ్యాయులకే ఉందన్నారు. సమాజంలో బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, వివక్ష వంటి సామాజిక రుగ్మతలను రూపుమాపడంలో గురువుల పాత్ర ఎనలేనిదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం జూనియర్ కళాశాల ఉపాధ్యాయులందరినీ శాలువాలతో సత్కరించారు. అనంతరం షేర్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ శ్రీకాంత్ రెడ్డి విద్యార్థినులకు 'బాల్య వివాహ రహిత భారత్' అంశంపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఆపదలో ఉన్నప్పుడు లేదా బాల్య వివాహాల సమాచారం తెలిసిన వెంటనే 1098 (చైల్డ్ హెల్ప్‌లైన్), 181 (మహిళా హెల్ప్‌లైన్) నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు అనంతరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సీనియర్ న్యాయవాది చెన్న మల్లా రెడ్డి, అసిస్టెంట్ డిఫెన్స్ కౌన్సెల్ రాజకృష్ణ లు మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు పోషిస్తున్న పాత్రను కొనియాడారు. తల్లిదండ్రులు జన్మనిస్తే.. ఉపాధ్యాయులు ఆ జీవితానికి ఒక సార్థకతను, మార్గాన్ని చూపిస్తారని హితవు పలికారు. గురువులను గౌరవించడం ద్వారానే విద్యార్థులు ఉన్నతమైన సంస్కారాన్ని అలవర్చుకోగలరని అన్నారు మాట్లాడుతూ..సమాజంలో పేరుకుపోయిన సామాజిక అసమానతలు, అనాచారాల నిర్మూలనలో అన్నారు. కేవలం పుస్తకాల్లోని చదువునే కాకుండా, పిల్లలను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దే శక్తి ఉపాధ్యాయులకే ఉందన్నారు. సమాజంలో బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, వివక్ష వంటి సామాజిక రుగ్మతలను రూపుమాపడంలో గురువుల పాత్ర ఎనలేనిదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం జూనియర్ కళాశాల ఉపాధ్యాయులందరినీ శాలువాలతో సత్కరించారు. బాధితులకు అవసరమైన న్యాయ సహాయాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉచితంగా అందిస్తుందని పేర్కొన్నారు ఉచిత న్యాయ సలహా మరియు సహాయం కొరకు టోల్ ఫ్రీ నెంబర్ 15100 ను సంప్రదించవలెనని కోరారు . ఈ కార్యక్రమం లో కేజీబీవీ ప్రత్యేక అధికారిణి భవాని 'సఖి' నుండి షాజన్,లవన్య , షేర్ జెఆర్సి కమ్యూనిటీ మొబైలైజర్ రమేష్, సోమన్న,హిమబిందు, ఉమామహేశ్వరి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

## కొత్తగూడెం ఏరియా సమస్యలు పరిష్కరించాలి

**జీఎం సీహెచ్ వెంకటరమణను కలిసిన ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ రజాక్**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెప్టెంబర్ 05 (వుదయం ప్రతినిధి)**

కొత్తగూడెం ఏరియాలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరుతూ కొత్తగూడెం ఏరియా ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్, ఏరియా జనరల్ మేనేజర్ సీహెచ్ వెంకటరమణను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా జీఎం కార్యాలయంలో ఉద్యోగుల సౌకర్యార్థం క్యాంటీన్ ఏర్పాటు చేయాలని రజాక్ కోరారు. గతంలో జరిగిన స్ట్రక్చర్ కమిటీ సమావేశాలతో పాటు పలుమార్లు రిప్రజెంటేషన్ ద్వారా కూడా క్యాంటీన్ ఏర్పాటు చేయాలని కోరిన విషయాన్ని ఆయన జీఎం దృష్టికి తీసుకెళ్లారు. క్యాంటీన్ ఏర్పాటులో మరింత జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా కొత్తగూడెం ఏరియాలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడికి వారి పిల్లలు, కుటుంబ సభ్యులకు సంబంధించిన వివరాలతో కూడిన డేటా షీట్ అందజేసి, అందులో ఏమైనా తప్పులు ఉంటే ఉద్యోగంలో ఉండగానే సరిదిద్దుకునే అవకాశం కల్పించాలని రజాక్ కోరారు. రిటైర్మెంట్ అనంతరం కుటుంబ వివరాల్లో మార్పులు లేదా తప్పుల సవరణ కోసం ఉద్యోగులు నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. కుటుంబ వివరాల సవరణ కోసం త్రీమెన్ కమిటీ ఏర్పాటు చేసిన సందర్భాల్లో కూడా నివేదిక రావడానికి సుమారు మూడు నెలలు, కార్పొరేట్ కార్యాలయానికి పంపిన అనంతరం తిరిగి రావడానికి మరో మూడు నెలలు, తదుపరి ప్రక్రియకు మరికొంత సమయం పడుతూ మొత్తం సుమారు ఎనిమిది నెలల వరకు జాప్యం జరిగే అవకాశం ఉందని వివరించారు. కార్మికులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉంటుందని, ముందుగానే డేటా షీట్ అందించి వివరాలను సరిచేసుకునే అవకాశం కల్పిస్తే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని సూచించారు. ఈ అంశంపై జీఎం సానుకూలంగా స్పందించి ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినప్పటికీ పర్సనల్ విభాగం నుంచి తగిన స్పందన లేకపోవడంతో ఆలస్యం జరుగుతోందని రజాక్ తెలిపారు. ఏరియాలో కార్మికులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను కూడా ఐఎన్‌టీయూసీ యూనియన్ ద్వారా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని రజాక్ విజ్ఞప్తి చేశారు.

# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## నిబంధనలకు లోబడి నిర్మాణాలు చేపట్టాలి

**-క్యాతనపల్లి మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలు తొలగించాలి**

**-మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ**



**మంచిర్యాల /రామకృష్ణాపూర్/సెప్టెంబర్ 05(వుదయం ప్రతినిధి)**

క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో, రామకృష్ణాపూర్ పట్టణంలో ఇంటి, వాణిజ్య భవన నిర్మాణాలు చేపట్టే వారు తప్పనిసరిగా BuildNow ద్వారా అనుమతులు పొందాలని మున్సిపాలిటీ కమిషనర్ మురళీ కృష్ణ సూచించారు. అనుమతిలో పేర్కొన్న సెట్ బ్యాక్స్ పాటించ డంతో పాటు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రధాన రహదారులపై అక్రమంగా నిర్మించిన షెడ్లు, ఇతర నిర్మాణా లను స్వచ్ఛందంగా తొలగించుకో వాలని, లేకుంటే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని కమీషనర్ హెచ్చరించారు. ప్రజలు మున్సిపాలిటీ సూచనలకు సహకరించా లని కోరారు.

## పేదల వైద్యానికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ భరోసా

**- రూ.34.24 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 05 (వుదయం ప్రతినిధి):**



అనారోగ్యంతో చికిత్సపొందుతున్న పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేం దుకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.34.24 లక్షల విలువైన చెక్కులను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనివారం నెరడిగొండలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదల వైద్య ఖర్చుల భారం తగ్గించడంలో సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంద న్నారు. నియోజకవర్గంలోని పేదలు ఆసుపత్రిలో చికిత్స పొందితే సంబంధిత బిల్లులను బోథ్ ఎమ్మెల్యే క్యాంపు కార్యా లయంలో అందజేయాలని సూచించా రు. అర్హులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తానని తెలి పారు.కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకు లు, కార్యకర్తలు, లబ్ధి దారులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడే భావి భారత శిల్పి వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె. కిష్టయ్య

**కామారెడ్డి, సెప్టెంబర్ 5 (వుదయం ప్రతినిధి):**




విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్ది, వారిని ఉత్తమ పౌరులుగా రూపుదిద్ద డంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత అమూల్యమైనదని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె. కిష్టయ్య పేర్కొన్నారు. శనివారం కళాశా లలోని బి.ఎన్. రామన్ సెమినార్ హాల్లో ఘనంగా నిర్వహించిన 'ఉపాధ్యాయ దినోత్సవం' కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు.ఈ సందర్భంగా డాక్టర్ కె . కిష్టయ్య మాట్లాడుతూ.. "దేశ రక్షణలో జవాన్, ఆకలి తీర్చడంలో రైతు ఎంత కీలకమో, జ్ఞానాన్ని అందించి సమాజాన్ని నిర్మించ డంలో ఉపాధ్యాయుడు అంతటి కీలక పాత్ర పోషిస్తారు. నేటి ఏఐ, డిజిటల్ యుగంలో సమాచారం విరివిగా లభిస్తు న్నప్పటికీ, సరైన మార్గాన్ని చూపించే 'గురువు' మార్గనిర్దేశం ఎప్పటికీ భర్తీ చేయలేనిది. విద్యార్థులు క్రమశిక్షణ, నిరంతర హాజరుతో జ్ఞానాన్ని పెంపొం దించుకుని ఉన్నత శిఖరాలను అధిరో హించాలి" అని పిలుపునిచ్చారు.కార్యక్ర మంలో మాట్లాడిన వక్తలు ఆదిమ యుగం నుండి నేటి ఆధునిక సాంకేతిక యుగం వరకు సమాజ వికాసంలో గురువు స్థానం అత్యున్నతమైనదని కొని యాడారు.

సాంకేతికతను సద్వినియోగం చేసుకుం టూనే నైతిక విలువలను పెంపొందించు కోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సమన్వయ కర్తలు డాక్టర్ విశ్వప్రసాద్, అంకం జయప్ర కాష్, పరిపాలనాధికారి కురుషీద్, అధ్యాపకులు డాక్టర్ ఏ. సుధాకర్, డాక్టర్ దినకర్ చిన్న, డాక్టర్ జి. శ్రీనివాస రావు, మానస, వివిధ విభాగాల అధిప తులు, సహాయ ఆచార్యులు, అధ్యాపకే తర సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని ఉపాధ్యాయులకు శుభాకాం క్షలు తెలిపారు.

## ప్రభుత్వ ఫలాలన్నీ అర్హులకు పక్కాగా అందాలి: కలెక్టర్

**నిర్మల్ జిల్లా 5 సెప్టెంబర్ 2026 (వుదయం ప్రతినిధి)**



ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలు అన్ని క్షేత్రస్థా యిలో ప్రజలందరికీ అందాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదే శించారు. శనివారం సాయంత్రం కలె క్టరేట్లోని సమావేశ మందిరంలో వివిధ శాఖల ఆధ్వర్యంలో జిల్లాలో అమలు అవుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి సంబంధిత శాఖల అధికారు లతో సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా అమలుపరుస్తున్న ప్రతి ఒక్క పథకం అర్హులైన ప్రతి వ్యక్తికి చేరే విధంగా అధికారులు చొరవ చూపాల న్నారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో అమ లవుతున్న పథకాలు, ప్రజలకు చేకూరిన లబ్ధి వివరాలు అధికారులను అడిగి తెలు సుకున్నారు. పథకాల అమలులో ఏవైనా ఇబ్బందులు కలిగితే వెంటనే స్పందించి పరిష్కరించాలని సూచించారు.

ఈ సమావేశంలో డిఆర్డిఓ విజయ లక్ష్మి, మైనార్టీ సంక్షేమ అధికారి దయానంద్, సిపిఓ గంగారెడ్డి, డిఎంహెచ్ఓ రాజేందర్, వ్యవసాయ అధికారి సుజాత, హార్టికల్చర్ అధికారి రమణ, హౌసింగ్ పిడి శ్రీనివాస్ రెడ్డి, సంక్షేమ అధికారి వినూత్న, ఇతర అధి కారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీ ని కలిసిన నూతన ఎస్ఐ లు

**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)**

జిల్లా ఎస్పీ నితికా పంత్ ఐపీఎస్‌ను ఎస్ఐ రాజు, ఎస్ఐ ప్రవీణ్ శనివారం





జిల్లా పోలీస్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగాకలిసి పుష్పగుచ్ఛాలు అంద జేశారు. ఇటీవల జరిగిన పోలీస్ శాఖ బదిలీల్లో భాగంగా ఎస్ఐ రాజు కెరమెరి పోలీస్ స్టేషన్‌కు, ఎస్ఐ ప్రవీణ్ కుమార్ కాగజ్‌నగర్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు కేటా యించారు. నూతన బాధ్యతలను సమర్థ వంతంగా నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని ఈ సందర్భంగా సూచించారు.

## ఉప ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయండి: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపు

**ధర్మపురి,సెప్టెంబర్05(వుదయం ప్రతినిధి):**



తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క ధర్మపురి పర్యట నను విజయ వంతం చేయాలని మంత్రి అడ్లూ రి.లక్ష్మణ్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు.రెండు రోజుల పాటు ధర్మపురి నియోజక వర్గంలో ఉపము ఖ్యమంత్రిపర్యటించ నున్నట్లు మంత్రి తెలిపారు.ఆదివారం సాయంత్రం 4:00 గం హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గం లో ఉప ముఖ్యమంత్రి బయలుదేర తారు.రాత్రి 7:30గం ధర్మపురి చేరు కుని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి గార్డె న్స్‌లో జరిగే సమావేశంలో పాల్గొంటా రు.రాత్రి ధర్మపురిలోనే బస చేస్తారు. సోమవారం వేకువజామున 2:30 గం లకు రూ.10 కోట్ల వ్యయంతో చేపట్ట నున్న ఉగ్ర నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను భట్టి విక్రమార్క ప్రారంభిస్తారు.ఉదయం 5:30 గంలకు ఆలయ పునర్నిర్మాణ పూజా కార్యక్ర మాల అనంతరం ఆయన తిరిగి హైద రాబాద్‌కు బయలుదేరు తారు.ఈ పర్య టనను విజయ వంతం చేయ దానికి నియోజక వర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయ కులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి సహకరించాలని మంత్రి కోరారు.

## రాజాపూర్ సమస్య పరిష్కారం అయ్యే వరకు అవార్డు ఎంక్వయిరీ నిలిపివేయాలని కలెక్టర్ కు మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాలు

**పెద్దపల్లి సెప్టెంబరు 05 (వుదయం ప్రతినిధి)**

అర్జీ-3 ఓసీపీ-2 విస్తరణలో భాగంగా రాజాపూర్ గ్రామం, సమారు 451ఎక రాల భూమిని సింగరేణి సంస్థ సేకరించే ప్రక్రియలో భాగంగా గత నవంబర్ లో రిక్వెజిషన్ వచ్చింది. అనంతరం రెవెన్యూ, సింగరేణి అధికారుల ఆధ్వర్యంలో జాయింట్ ఇన్ స్పెక్షన్ నిర్వహించి ప్రాజెక్టు నంబర్లు కేటాయిం చారు. అయితే రాజాపూర్ లోని ఇళ్లకు,RTH విభాగానికి వేర్వేరుగా నంబర్లు కేటాయించినప్పటికీ జనవ రిలో జారీ చేసిన పబ్లిక్ నోటిఫికేషన్ లో RPN నంబర్లను మాత్రమే చేర్చి RTH నంబర్లను చేర్చలేదని గ్రామస్తులు తెలిపారు. సమస్యను గ్రామ సర్పంచ్, మార్కెట్ కమిటీ ప్రతినిధులు కాంగ్రెస్ నాయకులు మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినారు. ఈ సెప్టెంబర్ 16న జరుగనున్న అవార్డు ఎంక్వయిరీని నిలిపివేయాలని, రాజాపూర్ గ్రామ సమస్య పూర్తిగా పరి ష్కారమయ్యే వరకు ఎంక్వయిరీ నిర్వ హించవద్దని మంత్రి శ్రీధర్ బాబు జిల్లా కలెక్టర్ కు ఫోన్ లో ఆదేశించినట్లు తెలిపారు. సమస్యపై వెంటనే స్పందించిన మంత్రికి రాజాపూర్ సర్పంచ్, గ్రామ ప్రజల తరపున కృతజ్ఞ తలు తెలిపారు.



## ఎస్ఐఆర్‌ను పకడ్బందీగా పూర్తి చేయాలి

**12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి సమర్పించాలి**

**కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**చెక్కపల్లిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం**

**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబరు 5 (వుదయం ప్రతినిధి) :**



ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణ (ఎస్ఐ ఆర్) ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. శనివారం వేములవాడ రూరల్ మండలం చెక్కప ల్లిలో బూత్ లెవల్ ఏజెంట్లతో నిర్వహిం చిన సమావేశానికి ఆమె హాజరై ప్రక్రియపై సమీక్షించారు, మండలంలో నో మ్యాపింగ్, అనామలీ ఓటర్లు ఎంత మంది ఉన్నారు.. కొత్త ఓటర్ల నమోదుకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయనే వివరా లను అధికారులను అడిగి తెలుసుకు న్నారు. మండలంలో 1,217 మంది నో మ్యాపింగ్, అనామలీ ఓటర్లకు నోటీసు లు జారీ చేసినట్లు అధికారులు తెలి పారు. ఎస్ఐఆర్‌లో భాగంగా సంబం ధిత ఓటర్లు ఎన్నికల సంఘం గుర్తించిన 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒక దాన్ని సమర్పించాలని కలెక్టర్ సూచిం చారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ప్రక్రియను పూర్తి చేయాలని, తహసీల్దార్లు, బీఎల్ఓ సూపర్‌వైజర్లు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని ఆదే శించారు.ఈ నెల 6, 12, 13 తేదీల్లో ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలు నిర్వహించను న్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈఆర్ఓ, ఏఈఆర్ఓ కార్యాలయాల్లో క్లెయిమ్‌లు, అభ్యంతరాలతోపాటు ఫారం-6, 7, 8 ద్వారా దరఖాస్తులు సమర్పించవచ్చని పేర్కొన్నారు.ప్రణాళికతో చదవాలి..చె క్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. వార్షిక పరీక్షలకు ఇప్పటి నుంచే ప్రణాళికతో సిద్ధం కావాలని సూచించారు. చదవడంతోపాటు రాయ డానికీ ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతిరోజూ తరగతులకు హాజరవుతూ పాఠ్యాంశా లను శ్రద్ధగా చదవాలని చెప్పారు. పదో తరగతి విద్యార్థుల భవిష్యత్తులో కీలక దశ అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో కేఎస్‌బీ కుమారి, తహసీల్దార్ అబూబకర్ తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ కలెక్టరేట్ లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**కరీంనగర్ సెప్టెంబర్ 05 (వుదయం ప్రతినిధి):**

**కరీంనగర్ ను విద్యా కేంద్రంగా తీర్చిదిద్దుదాం: కలెక్టర్ చిత్రా మిశ్రా**



కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలు నిర్వహించారు.ఈ ఈకార్యక్రమంలో కలెక్టర్ హాజరై మాట్లా డుతూవిద్యార్థులకు పాఠశాల రెండో ఇల్లు అని బాల్యం నుంచే పాఠ్యాంశా లతో పాటు శుభ్రత, ధైర్యం, క్రమశిక్షణ నేర్పించాలని ఉపాధ్యాయులకు సూచిం చారు. మేము ఇలాంటి స్థితిలో ఉన్నా మంటే మాకు చదువు చెప్పిన ఉపాధ్యా యులే కారణమనినా ఉన్నతికి కారణ మైన ఉపాధ్యాయులను నిత్యం గుర్తు చేసుకుంటూ ఉంటానని పేర్కొన్నారు. అన్ని వృత్తుల వారిని తయారు చేసేది ఉపాధ్యాయ వృత్తి అని.. ఇలాంటి వృ త్తిలో ప్రతి నిమిషం బాధ్యతగా పనిచేస్తూ రాష్ట్రంలోనే జిల్లాను అగ్రగామిగా తీర్చి దిద్దేందుకు కృషి చేయాలని పిలుపుని చ్చారు.విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పెంపొందించేందుకు (ఫౌండేషనల్ లిటరసి అండ్ న్యూమరసీ) పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పాఠ శాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నా మని.. ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులకు విద్య అందించాలని పేర్కొ న్నారు. అన్ని పాఠశాలల ప్రగతిపై మం డలాల వారిగా డీటెయిల్ రివ్యూ నిర్వ హించాలని పేర్కొన్నారు. మరిన్ని సిఎస్ఆర్ నిధులు తెచ్చి పాఠశాలలను మెరుగుప రుస్తాన్నారు. ఎ లాంటి సమస్యలు ఉన్నా ఉపాధ్యాయులు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. భయంతో కాకుండా నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. జిల్లా లోని అన్ని శాఖల అధికారులు సమన్వ యంతో విద్యారంగ అభివృద్ధికి పాటుప డుతున్నారని వారి తోడ్పాటును అభినం దించారు. మేయర్ శ్రీనివాస్ మాట్లాడు తూ.. సామాన్యులను అసామాన్యులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని పేర్కొ న్నారు.వ్యక్తి ఉన్నత స్థానంలో నిలిచేం దుకు ఉపాధ్యాయుల పాత్ర కీలకమని.. విద్యార్థుల్లోని సృజనాత్మకత వెలికి తీసే లా పాఠాలు బోధించాలని ఉపాధ్యా యులకు సూచించారు. మున్సిపల్ కమి షనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ.. నగరపాలిక పరిధిలోని పాఠశాలలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. సైన్స్ మ్యూజియంను ఆధునీకరించా మని త్వరలో ప్రారంభిస్తామని పేర్కొన్నా రు. డీఈవో చైతన్య జైని మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రగతికి అనేక కార్యక్రమాలు రూపొందిస్తున్నామని.. భాగస్వాములు అవుతున్న ఉపాధ్యాయుల కృషిని కొని యాడారు. కలెక్టర్ మార్గదర్శకత్వం మరింత స్ఫూర్తిని ఇస్తుందని వివరిం చారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం మాట్లాడుతూ.. పుస్తక పఠనం కోసం విద్యార్థులకు సహకారం అందిస్తూ వసతులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా రంగంలో విశిష్ట సేవలందించిన ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందించి సన్మానించారు. కార్యక్రమంలో పరీక్షల విభాగం సెక్రటరీ భగవంతయ్య, స్పెషల్ అధికారులు అశోక్ రెడ్డి, మిల్కూరి శ్రీనివాస్, దాసి శ్రీనివాస్, మహేందర్, జీ సీడీఓ ఉమారాణి, జిల్లా సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి, ఎంఈఓ లు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

## నేడు అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమం...

**ఓటరు జాబితాలను పరిశీలించుకొని అభ్యంతరాలు దరఖాస్తులు సమర్పించాలి...**

**జిల్లా అడిషనల్ కలెక్టర్ అండ్ జిల్లా డిప్యూటీ ఎన్నికల అధికారి బిఎస్ లత**

**జగిత్యాల సెప్టెంబర్ 05 (వుదయం ప్రతినిధి)**



భారత ఎన్నికల సంఘం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ప్రత్యే క సమగ్ర సవరణ-2026 (ఎస్ఐఆర్-2026)లో భాగంగా శనివారం జిల్లాలో ని అన్ని పోలింగ్ కేంద్రాల్లో మొదటి రోజు ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని నిర్వ హించినట్లు జిల్లా అడిషనల్ కలెక్టర్ జిల్లా డిప్యూటీ ఎన్నికల అధికారి బిఎస్ లత తెలిపారు. మొదటి విడతలో భాగం గా రెండో రోజు ప్రత్యేక ప్రచార కార్యక్ర మాన్ని 6 9 2026 ఆదివారం జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో నిర్వహించను న్నట్లు వెల్లడించారు 1 10 2026 అర్హత తేదీగా రూపొందించిన ముసాయిదా ఓటరు జాబితాలను ప్రజలు తమ సం బంధిత పోలింగ్ కేంద్రాల్లో పరిశీలించు కోవచ్చని తెలిపారు. అర్హులైన వారు కొత్తగా ఓటరు నమోదుకు ఫారం-6 పేర్ల తొలగింపుపై అభ్యంతరాల కోసం ఫారం-7 ఓటరు జాబితాలోని వివరాల సవరణ లేదా చిరునామా మార్పు కోసం ఫారం-8 ద్వారా దరఖాస్తులు సమర్పిం చవచ్చని పేర్కొన్నారు. ప్రత్యేక ప్రచార కార్యక్రమం సందర్భంగా సంబంధిత బూత్ స్థాయి అధికారులు (బిఎల్ఓ ఎస్) తమ పోలింగ్ కేంద్రాల్లో తప్పనిస రిగా అందుబాటులో ఉంటారని తెలిపా రు. బూత్ స్థాయి ఏజెంట్లతో కలిసి ముసాయిదా ఓటరు జాబితాలను పరిశీ లించి అవసరమైన సవరణలను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం చేపడ తారని వివరించారు జిల్లాలోని అర్హులైన పౌరులు ఓటర్లు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకొని తమ పేర్లు చిరునా మా వయస్సు తదితర వివరాలను పరిశీ లించుకోవాలని అవసరమైతే సంబంధి త దరఖాస్తులను తమ పోలింగ్ కేంద్రా ల్లో సమర్పించాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## యూత్ డిక్లరేషన్ కాదు అది మోసాల డిక్లరేషన్

**విద్యార్థులు,యువతకు కాంగ్రెస్ సర్కార్ ద్రోహం**

**ఫీజులు, బకాయిలు ఇవ్వక విద్యార్థుల భవితతో చెలగాటం**

**కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలను తమ ఖాతాలో వేసుకుంటున్న వైనం**

**ధర్మపురి అభివృద్ధి నిధుల రద్దుపై కాంగ్రెస్ సర్కార్‌పై నిప్పులు చెరిగిన కొప్పుల**

**బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్మపు రిలో భారీ నిరసన ర్యాలీ**

**ధర్మపురి సెప్టెంబర్05(వుదయం ప్రతినిధి):**



కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యో గులు,యువతను నిలువునా దగా చేస్తోందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అసెం బ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రకటించిన యూత్ డిక్లరేషన్ వాస్తవా నికి అదొక మోసాల డిక్లరేషన్ అని ఆయన ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపుమేరకు ధర్మపురి పట్టణంలోని అంబేద్కర్ విగ్ర హం నుంచి గాంధీ చౌక్ వరకు బీఆర్ఎస్ శ్రేణులు శనివారం భారీ నిరసన ర్యాలీ నిర్వహిం చారు.ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ ప్రభుత్వ తీరుపై మండి పడ్డారు. రాష్ట్రం లో రూ.14వేల కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో, కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వారి భవిష్య త్తును అంధకారంలోకి నెడుతున్నాయ న్నారు.ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల ఉచిత విద్య కోసం ఉద్దేశించిన బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల కు రూ.300 కోట్ల బకాయిలు ఉంచారు. దీంతో పిల్లలను బడుల నుంచి బయటకు పంపేస్తున్నారు.250 నర్సింగ్ స్కూళ్లలోని మేనేజ్‌మెం ట్ కోటా విద్యార్థులకు స్కాలర్‌షి ప్‌లను రద్దు చేసేలా కమిషనర్ తో ప్రభుత్వం లేఖ రాయించడం దారుణం.అద్భుత మైన గురుకు ల వ్యవస్థను నిర్వీర్యం చేసి, యంగ్ ఇండియా మోడల్ స్కూళ్ల పేరుతో కాలయాపన చేస్తున్నారు.దీని వల్ల 2 వేల పాఠశాలలు మూతబడి, 1.25 లక్షల అడ్మిషన్లు తగ్గిపోయాయి.సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో కొనుగోళ్లు స్థానిక ఎస్సీ, ఎస్టీ కాంట్రాక్టర్లకు ఇవ్వకుండా గుజ రాత్ కాంట్రాక్టర్లకు కట్టబెట్టి అక్ర మాలకు పాల్పడుతున్నారు.ఏటా 2 లక్షల ఉద్యోగాలిస్తామ న్న హామీ అటకె క్కింది. కేసీఆర్ హయాంలో భర్తీ చేసిన 50 వేల ఉద్యోగాలను తమ ఖాతాలో వేసుకుని, 70 వేలు ఇచ్చినట్టు ప్రభుత్వం గొప్పలు పోతోంది.టెన్త్ పాస్ అయితే రూ.5 వేలు, ఇంటర్‌కు రూ.20 వేలు, డిగ్రీకి రూ.లక్ష, పీజీకి రూ.2 లక్షలు, పీహెచ్‌డీకి రూ.5 లక్షలు ఇస్తా మన్న హామీ ఏమైంది.18 ఏళ్లు నిండిన యువ తులకు ఇస్తామ న్న స్కూటీలు ఎక్కడికి పోయా యి.కరెంట్ కోతలు, నిధుల రద్దుఫ్రీ బస్సు ప్రయాణాన్ని సరిగ్గా నిర్వ హించట్లేదు. బస్సులకు ఎక్స్‌ప్రెస్ బోర్డులు తగిలించి ఆపకుండా మహిళ లను ఇబ్బం ది పెడుతున్నారు.కేసీఆర్ 7.50 లక్షల కొత్త రేషన్ కార్డులు ఇచ్చి ఉచిత బియ్యం అందిస్తే కాంగ్రెస్ ఇప్పుడు స్మార్ట్ కార్డుల పేరుతో నాన్చుతోంది. నియోజకవర్గంలో రాత్రి వేళలో 6నుండి 8 గంటల పాటు కరెంట్ కోతలు విధిస్త న్నారు.గతంలో కేటీఆర్ ధర్మ పురి అభివృద్ధికి ఇచ్చిన రూ.25 కోట్లను రద్దు చేశారు. 6 వేల ఎకరాలకు నీరందించే అక్కపెల్లి ప్రాజెక్టు,ఇతర రోడ్ల నిర్మాణాల ను నిలిపేశారు.గోదావరి ప్రక్షాళ నకు మంజూరైన రూ.25 కోట్ల ను కాంగ్రెస్ నాయకులే కోర్టులో కేసులు వేసి ఆపారు.ప్రభుత్వం తక్షణమే రూ.14వేల కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలి.బెస్ట్ అవైల బుల్ స్కూల్స్ కు ఇవ్వాల్సిన రూ.300 కోట్లను వెంటనే చెల్లిం చాలి.నర్సింగ్ విద్యార్థుల స్కాల ర్‌షిప్‌ల రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి.

## అంగరంగ వైభవంగా శ్రీ లక్ష్మీనర్సింహస్వామి కళ్యాణం...

**శ్రీలక్ష్మీనర్సింహ స్వామివారిని దర్శించుకున్న మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్**

**జగిత్యాల సెప్టెంబర్ 05 (వుదయం ప్రతినిధి)**



జగిత్యాల పట్టణ 40వ వార్డులో గల నాయిని బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీనర్సింహస్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించి కళ్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధ లతో నిర్వహించారు స్వామివారి కళ్యాణాన్ని తిలకించేందుకు వార్డు ప్రజలు భగవద్బాంధవులు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు ఈ కార్యక్రమా నికి జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ హాజరై శ్రీ లక్ష్మీనర్సింహ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు అనంతరం కళ్యాణోత్సవంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు నాయిని బ్రాహ్మణ సంఘం నాయకులు సభ్యులు వార్డు ప్రజలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్ర మాన్ని విజయవంతం చేశారు దీంతో ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

# మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## విద్యార్థుల ఆరోగ్యానికి ప్రత్యేకంగా హెల్త్ కార్డులు

- ప్రతి విద్యార్థి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ: జిల్లా కలెక్టర్

**గద్వాల, సెప్టెంబర్ 05 (వుదయం కరస్పాండెంట్)**



పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల ఆరోగ్య సమస్యలను గుర్తించి, సకాలంలో వైద్యం అందించడంతో పాటు నిరంతరం ఆరోగ్య పర్యవేక్షణ చేపట్టేందుకు స్టూడెంట్ హెల్త్ ప్రొఫైల్ కార్డులు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లాలో విద్య, వైద్య శాఖల సమన్వయంతో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. హెల్త్ కార్డులో విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, తరగతి, పాఠశాల/హాస్టల్, విద్యార్థి ఐడీ, ఆధార్, తల్లిదండ్రుల వివరాలు, మొబైల్ నంబర్, చిరునామాతో పాటు సంబంధిత పీహెచ్‌సీ, వైద్యాధికారి, ఏఎన్ఎం వివరాలను నమోదు చేస్తారని తెలిపారు.

విద్యార్థులకు నిర్వహించే ఆరోగ్య పరీక్షల వివరాలు, గుర్తించిన ఆరోగ్య సమస్యలు, అందించిన చికిత్స, రిఫరల్, ఫాలోఅప్ వివరాలను తేదీల వారీగా కార్డులో నమోదు చేస్తారని చెప్పారు. రక్తహీనత, గుండె, చర్మం, కిడ్నీ, నరాల సంబంధిత సమస్యలు, మధుమేహం, మూర్ఛ, పుట్టుకతో వచ్చే ఆరోగ్య సమస్యలను గుర్తించేందుకు ప్రత్యేక అంశాలను చేర్చినట్లు వివరించారు.అదేవిధంగా దంత క్షయం, దంతాలపై మలినాలు, చిగుళ్ల సమస్యలు, దంతాల కదలిక వంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి అవసరమైన చికిత్స అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన కల్పించేందుకు సమతుల్య ఆహారం, పండ్లు, కూరగాయలు, పోషకాహారం తీసుకోవడం, అధిక ఉప్పు, చక్కెర, కొవ్వు పదార్థాలను తగ్గించడం వంటి అంశాలను నిపుణుల ద్వారా వివరించనున్నట్లు పేర్కొన్నారు. చేతులు శుభ్రంగా కడుక్కోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు.

"ఆరోగ్యవంతమైన విద్యార్థే.. ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది" అనే లక్ష్యంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. చిన్న వయస్సులోనే ఆరోగ్య సమస్యలను గుర్తించి సకాలంలో చికిత్స అందించడం ద్వారా భవిష్యత్తులో తీవ్రమైన అనారోగ్య సమస్యలను నివారించవచ్చని ఆయన తెలిపారు.

# ఉపాధ్యాయుల చేతుల్లోనే తెలంగాణ విద్యా భవిష్యత్!

- దేశానికి ఆదర్శంగా తెలంగాణ విద్యా వ్యవస్థను తీర్చిదిద్దాలి
- విద్యార్థులను దేశాభివృద్ధికి దిక్సూచిగా నిలపాలి: సీఎం రేవంత్‌రెడ్డి
- 123 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు.. ప్రభుత్వ విద్యపై కీలక ప్రకటనలు

**వికారాబాద్ సెప్టెంబర్ 5: (వుదయం బ్యూరో )**




తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచేలా, తెలంగాణ విద్యార్థులు దేశాభివృద్ధికి దిక్సూచిగా నిలిచేలా ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో సీఎం పాల్గొని 123 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులను అందజేశారు.

**చిత్ర ప్రదర్శనను సందర్శించిన సీఎం**

కార్యక్రమానికి ముందుగా ఉపాధ్యాయ బృందంతో ముఖ్యమంత్రి గ్రూప్ ఫోటో దిగారు. అనంతరం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఫోటో సోషల్ ఎగ్జిబిషన్‌ను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డా. దామోదర రాజనర్సింహతో కలిసి సందర్శించారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ డా. యోగిత రాణా, విద్యాశాఖ కమిషనర్ దేవసేన ఛాయాచిత్ర ప్రదర్శన విశేషాలను ముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.

**పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల్లో పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందినవారే అధికంగా ఉంటారని తెలిపారు. వారికి అత్యుత్తమమైన నాణ్యమైన విద్యను అందించి రాష్ట్రానికి, దేశానికి దిశానిర్దేశం చేసే స్థాయికి తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు వేసేది ఉపాధ్యాయులేనని, తల్లిదండ్రుల కంటే విద్యార్థులు ఉపాధ్యాయుల వద్దే ఎక్కువ సమయం గడుపుతారని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని సర్వేపల్లి రాధాకృష్ణన్ చెప్పారని గుర్తుచేశారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం తమ అమూల్యమైన సమయాన్ని కేటాయిస్తున్న ఉపాధ్యాయులకు సీఎం అభినందనలు తెలిపారు.

**28వ స్థానం నుంచి 17వ స్థానానికి**

విద్యాభివృద్ధిలో తెలంగాణ గతంలో 28వ స్థానంలో ఉండగా, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 17వ స్థానానికి చేరుకుందని సీఎం తెలిపారు. ఈ పురోగతి ఉపాధ్యాయుల కృషితోనే సాధ్యమైందని కొనియాడారు.ఇతర రాష్ట్రాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గుతుంటే తెలంగాణలో మాత్రం గత రెండేళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 88 వేలు పెరిగిందని వివరించారు. ఈ విజయం ఉపాధ్యాయులదేనని, తెలంగాణ ప్రజలదేనని సీఎం పేర్కొన్నారు.పాలిటెక్నిక్ కళాశాలల్లో 95 శాతం అడ్మిషన్లు జరిగాయని, సాంకేతిక విద్యలో తెలంగాణ వేగంగా ముందుకు వెళ్తోందని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధితో పాటు విద్య, ఉద్యోగ, ఉపాధి కల్పనకు ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందన్నారు.

**55 రోజుల్లో 10,006 టీచర్ పోస్టుల భర్తీ**

ఉపాధ్యాయులను ఉద్దేశించి సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు. ఉపాధ్యాయులు రోడ్డుపైకి రావాల్సిన పరిస్థితి లేకుండా వారి సమస్యలను పరిష్కరించాలనే ఆలోచనతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు.

ప్రజా ప్రభుత్వం 55 రోజుల్లో డీఎస్సీ ద్వారా 10,006 మంది ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేసింది నిజం కాదా? అని ప్రశ్నించారు. ఒక్క ఫిర్యాదు లేకుండా అత్యంత పారదర్శకంగా 25,950 మంది టీచర్ల ప్రమోషన్లు పూర్తి చేశామని, చిన్న వివాదం కూడా లేకుండా 34,706 మంది ఉపాధ్యాయుల బదిలీలను పారదర్శకంగా నిర్వహించామని గుర్తుచేశారు. భార్య ఒకచోట, భర్త మరోచోట ఉద్యోగం చేస్తూ ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని 317 జీవో సమస్యను పరిష్కరించామని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడానికి విద్యా కమిషన్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కే. కేశవరావును సలహాదారుగా నియమించి విద్యాశాఖ సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు.

**90 రోజుల్లో రూ.6 వేల కోట్ల రిటైర్మెంట్ బెనిఫిట్స్**

గత ప్రభుత్వం పదేళ్లలో అనేక సమస్యలు సృష్టించి దాదాపు రూ.8.11 లక్షల కోట్ల అప్పులు చేసి వెళ్లిపోయిందని సీఎం ఆరోపించారు. ఉపాధ్యాయులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా, వారి సర్వీస్‌ను 60 ఏళ్లకు పెంచారని అన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెండింగ్‌లో పెట్టి వెళ్లిపోయారని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 90 రోజుల్లో రూ.6 వేల కోట్లు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం చెల్లించిందని తెలిపారు. ప్రతి నెల బకాయిల విడుదల కోసం రూ.1,000 కోట్ల చొప్పున నిధులు విడుదల చేస్తున్నామని చెప్పారు.

**ఉపాధ్యాయులను విదేశాలకు పంపి విద్యా విధానాల అధ్యయనం**

ప్రభుత్వ ఖర్చులతో ఉపాధ్యాయులను విదేశాలకు పంపి అక్కడి విద్యా విధానాలను అధ్యయనం చేయించిన సందర్భాలు గతంలో ఎప్పుడైనా, ఏ రాష్ట్రంలోనైనా ఉన్నాయా? అని సీఎం ప్రశ్నించారు.

తెలంగాణ ప్రభుత్వం ఉపాధ్యాయులను విదేశాలకు పంపించి విద్యా విధానాలను అధ్యయనం చేయించిందని తెలిపారు. తానే ఉపాధ్యాయుల ప్రతినిధిగా వారి సమస్యలను పరిష్కరిస్తానని, తనకు మరో రెండేళ్లు అవకాశం ఇవ్వాలని కోరారు. ఉపాధ్యాయులు అంకితభావంతో విద్యార్థుల కోసం పనిచేస్తే తెలంగాణను దేశ విద్యా వ్యవస్థకు దిక్సూచిగా తీర్చిదిద్దుదామని సూచించారు.తెలంగాణలో ప్రభుత్వం చేస్తున్న మంచి పనులపై జాతీయ స్థాయిలో చర్చ జరగాలని సీఎం ఆకాంక్షించారు.

**"రెండేళ్లు సమయం ఇవ్వండి.. సమస్యలు పరిష్కరిస్తా"**

ఉపాధ్యాయులకు గుర్తింపు ఇవ్వాలని, వారిని గౌరవించాలని 123 మంది టీచర్లకు అవార్డులు అందిస్తున్నామని సీఎం తెలిపారు.

ప్రస్తుతం పీఆర్సీ ఇవ్వాలని శ్రీపాల్ కోరుతున్నారని ప్రస్తావిస్తూ, విద్యాశాఖ మంత్రిగా, ముఖ్యమంత్రిగా తన విజ్ఞప్తి ఒక్కటేనన్నారు. "రెండేళ్లు నాకు సమయం ఇవ్వండి. ఆర్థిక వెసులుబాటును బట్టి మీ సమస్యలను పరిష్కరిస్తా" అని చెప్పారు. టీచర్లు రోడ్డెక్కితే అది రాష్ట్రానికి శుభసూచకం కాదన్నారు. రెండేళ్ల తర్వాత తాము ఆశించిన విధంగా సమస్యలను పరిష్కరించకపోతే ఎన్నికల పరీక్షల్లో ఎన్ని మార్కులు వేయాలో ఉపాధ్యాయులే నిర్ణయించుకోవచ్చని అన్నారు.

మీ ఉద్యోగ సర్వీస్ 30 ఏళ్లు ఉంటుందని, తమ రాజకీయ సర్వీస్ మాత్రం ఐదేళ్లు మాత్రమేనని, తాము ప్రతి ఐదేళ్లకు పరీక్ష రాయాల్సి ఉంటుందని సీఎం వ్యాఖ్యానించారు.

**రాజకీయ నాయకుల ఉచ్చులో పడొద్దు**

ఉపాధ్యాయులు రాజకీయ నాయకుల ఉచ్చులో పడవద్దని సీఎం సూచించారు. పదేళ్లపాటు విద్యా వ్యవస్థను విధ్వంసం చేశారని, ఇప్పుడు విధ్వంసమైన విద్యా వ్యవస్థను వికాసం వైపు నడిపించాల్సిన బాధ్యత ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందన్నారు.ఉపాధ్యాయులకు ఎలాంటి చిన్న సమస్య కూడా రాకుండా చూసుకునే బాధ్యత తనదేనని భరోసా ఇచ్చారు.

**పాలిటెక్నిక్‌పై అవాస్తవ ప్రచారాన్ని నమ్మొద్దు**

పాలిటెక్నిక్ విషయంలో జరుగుతున్న అవాస్తవ ప్రచారాన్ని నమ్మవద్దని సీఎం సూచించారు. ఉపాధ్యాయులను అడ్డుపెట్టుకుని ప్రభుత్వాన్ని బ్లాక్‌మెయిల్ చేయాలని కొందరు చూస్తున్నారని, అలాంటి వారి ట్రాప్‌లో పడవద్దని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని తెలిపారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు అందరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.

**12వ తరగతి వరకు జ్ఞానం.. ఆ తర్వాత నైపుణ్యం**

నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని సీఎం తెలిపారు. 12వ తరగతి వరకు విద్యార్థులు జ్ఞానం, భావ వ్యక్తీకరణ నేర్చుకోవాలని, 12వ తరగతి తర్వాత నైపుణ్యాన్ని సంపాదించుకోవాలని సూచించారు.

నైపుణ్యం ఉంటే జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా వంటి విదేశాల్లో మంచి ఉపాధి పొందేందుకు అపారమైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. దీనికోసం ఐటీఐ విద్యా వ్యవస్థను ఏటీసీగా మార్చామని, పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీలుగా రూపుదిద్దుతున్నామని వివరించారు.

**విద్యాభివృద్ధికి పారదర్శక విధానాలు: మంత్రి దామోదర**

కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డా. దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ సమసమాజ స్థాపనకు కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.భారతదేశంలో "మాతృదేవోభవ.. పితృదేవోభవ.. ఆచార్యదేవోభవ" అనే గొప్ప సిద్ధాంతం ఉందని అన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న పారదర్శకమైన విధానాల వల్ల తెలంగాణ రాష్ట్రంలో విద్యాభివృద్ధి గణనీయంగా పెరిగిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల చేరికలు గణనీయంగా పెరిగాయని పేర్కొన్నారు.

**ఉపాధ్యాయులకు కే. కేశవరావు శుభాకాంక్షలు**

ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు సైతం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు.

**పలువురు ప్రముఖుల హాజరు**

ఈ కార్యక్రమంలో శాసనసభ అధ్యక్షులు గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి సభ్యులు అద్దంకి దయాకర్, తాండూర్ శాసనసభ్యులు బి. మనోహర్ రెడ్డి, పరిగి శాసనసభ్యులు రామ్మోహన్ రెడ్డి, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ డాక్టర్ యోగిత రాణా,

దేవసేన కమిషనర్, కళాశాల ప్రిన్సిపల్ సెక్రెటరీ అభిలాష అభినవ్, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నవీన్ నికోలస్, వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, స్థానిక మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్, జిల్లా అధికారులు, ఉత్తమ అవార్డు గ్రహీత ఉపాధ్యాయులు, వారి బంధువులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు అభినందనలు



**నారాయణపేట సెప్టెంబర్ 5 (వుదయం ప్రతినిధి)**

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు జిల్లా ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కొడంగల్‌లో నిర్వహించిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా నుంచి ఎంపికైన ముగ్గురు ప్రతిభావంతులు డా. గోవింద రాజు , ఎస్. భాగ్యలక్ష్మి, స్వేతా రెడ్డి రాష్ట్ర స్థాయి అవార్డులను అందుకోవడం ఎంతో ఆనందకరమైన గర్వకారణమని ఉపాధ్యాయులు తెలిపారు.వారి అంకితభావం, కృషి, విద్యార్థుల పట్ల నిబద్ధత, విద్యారంగానికి అందించిన విశిష్ట సేవలకు లభించిన ఈ రాష్ట్ర స్థాయి గుర్తింపు నారాయణపేట జిల్లా విద్యారంగానికే గర్వకారణం అన్నారు. వారి విజయాన్ని ప్రత్యక్షంగా కలిసి సెలబ్రేట్ చేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.

ఈ ఆనందోత్సవంలో ఏ ఎం ఓ విద్యాసాగర్, డీఎస్ఓ భానుప్రకాష్, ఎస్ఓ నాగార్జున రెడ్డి అన్ని మండలాల ఎంఈఓ లు ఉపాధ్యాయ సంఘ నాయకులు యాదగిరి జనార్దన్ రెడ్డి ,షేర్ కృష్ణారెడ్డి, నరసింహ, వెంకట్ స్వామి ,ఉపాధ్యాయులు పాల్గొని అవార్డు గ్రహీతలను ఆత్మీయంగా అభినందించారు.

## తైక్వాండోతో ఆత్మరక్షణతో పాటు ఆత్మవిశ్వాసం



- రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు మెడల్స్ ప్రదానం

**నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 05 (వుదయం ప్రతినిధి):**

ప్రపంచ తైక్వాండో దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబరిచిన నాగర్ కర్నూల్ జిల్లా విద్యార్థులను క్లాస్ మేట్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా అభినందించారు.ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ చంద్ర చేతుల మీదుగా విద్యార్థులకు మెడల్స్ అందజేసి ప్రోత్సహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు వరల్డ్ తైక్వాండో దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు ప్రతిరోజూ తైక్వాండో సాధన చేస్తూ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. తైక్వాండో నేర్చుకోవడం ద్వారా ఆత్మరక్షణతో పాటు ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వం, ఏకాగ్రత పెరుగుతాయని, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఇది ఎంతగానో దోహదపడుతుందని అన్నారు.కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జిల్లా తైక్వాండో ప్రధాన కార్యదర్శి మాస్టర్ రవికుమార్, క్లాస్ మేట్ క్లబ్ వ్యవస్థాపకులు రాఘవేంద్ర, ఉపాధ్యాయులు కురుమయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు

## హలో రెడ్డి చలో ఇందిరా పార్క్

- రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుకు ధర్నా: కొండకింది మాధవరెడ్డి

**నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 05 (వుదయం ప్రతినిధి):**

1000 కోట్లతో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8న హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ వద్ద "హలో రెడ్డి చలో ఇందిరా పార్క్" పేరిట ధర్నా నిర్వహిస్తున్నట్లు రెడ్డి జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండకింది మాధవరెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1000 కోట్ల నిధులతో రెడ్డి కార్పొరేషన్ పాలక వర్గాన్ని ఏర్పాటు చేయాలని, రైతు బీమా పథకాన్ని ప్రభుత్వం కొనసాగించాలని, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను ప్రభుత్వ అన్ని విభాగాల్లో పూర్తిస్థాయిలో అమలు చేయాలని తదితర డిమాండ్లతో ధర్నా చేపడుతున్నామన్నారు.

ఈ ధర్నాను ప్రతి ఒక్క రెడ్డి బిడ్డ హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## ఎన్టీఆర్ కళాశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**మహబూబ్ నగర్ సెప్టెంబర్ 5 (వుదయం ప్రతినిధి)**



ప్రానిక ప్రభుత్వ ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్)లో అధ్యాపకులు, విద్యార్థినిలంతా కలిసి ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని డాక్టర్. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల అలంకరించి, పూజానంతరం అధ్యాపకులు విద్యార్థులకు ప్రేరణాత్మక ప్రసంగాలతో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్. డి. ప్రకాశ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5వ తేదీన ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. భారతదేశ మాజీ రాష్ట్రపతి, గొప్ప తత్వవేత్త, విద్యావేత్త అయిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం మనందరికీ గర్వకారణం అన్నారు.ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇంచార్జ్ డాక్టర్. కె. హరిబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయ దినోత్సవం రోజున గురువులకు పూలు ఇవ్వడం, శుభాకాంక్షలు చెప్పడం చాలా మంచి విషయం అన్నారు.ఉర్దూ విభాగాధిపతి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్. మహ్మద్ వహిదుద్దీన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ జీవితంలో ఒక లక్ష్యం పెట్టుకోవాలని ఆ లక్ష్యాన్ని సాధించడానికి ప్రతిరోజూ కొంత సమయం కేటాయించాలన్నారు .ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల మాట వినడమే నిజమైన బహుమతి: సీపీ రష్మి పెరుమాళ్

- తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం
- విద్యార్థులు సైబర్ నేరాలు, ఆత్మరక్షణపై అవగాహన కలిగి ఉండాలి: సిద్దిపేట సీపీ

**సిద్దిపేట, సెప్టెంబర్ 5 (వుదయం బ్యూరో)**



విద్యార్థుల భవిష్యత్తును మహోన్నతంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైనదని, గురువులు చెప్పే మాటలను క్రమశిక్షణతో వింటూ వారి పట్ల గౌరవం, విధేయత కలిగి ఉండటమే విద్యార్థులు వారికి ఇచ్చే నిజమైన బహుమతి అని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ ఐపీఎస్ పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని చేర్యాల పోలీస్ స్టేషన్ పరిధిలోని ముత్యాల గ్రామంలో గల తెలంగాణ మోడల్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సమాజంలో ఆడపిల్లలు మానసికంగా, శారీరకంగా ధైర్యంగా నిలబడాలని సూచించారు. ప్రతి బాలిక తమను తాము రక్షించుకునేలా ఆత్మరక్షణ (సెల్ఫ్ డిఫెన్స్) విద్యలను నేర్చుకోవాలని, వేధింపులు ఎదురైతే భయపడకుండా వెంటనే ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు లేదా షీ టీమ్స్‌కు సమాచారం అందించాలని స్పష్టం చేశారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఆన్‌లైన్‌లో అపరిచిత వ్యక్తులతో పరిచయాలు పెంచుకోవద్దని, ఓటీపీలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ షేర్ చేయకూడదని తెలిపారు. ఒకవేళ సైబర్ మోసాలు జరిగితే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చేర్యాల సీఐ రమేష్, ఎస్ఐ అపూర్వ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 30 ఏళ్ల క్రితం నేనే బైపాస్ రోడ్డు వేయించాను

- రూ.18 కోట్లతో మళ్లీ బైపాస్ అభివృద్ధి చేస్తున్నా: జగ్గారెడ్డి

**సంగారెడ్డివుదయం :**



సంగారెడ్డి మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న సమయంలోనే సుమారు 30 ఏళ్ల క్రితం రూ.80 లక్షలతో బైపాస్ బీటీ రోడ్డు వేయించానని, ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి రూ.18 కోట్ల నిధులు తీసుకొచ్చి అదే బైపాస్ రోడ్డును విస్తరిస్తున్నానని కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు.సంగారెడ్డి తన సొంత ఊరని, పట్టణాన్ని ఎలా అభివృద్ధి చేసుకోవాలో తనకు తెలుసని ఆయన పేర్కొన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలవకపోయినా సంగారెడ్డి వాడిననే కారణంతో పట్టణ అభివృద్ధికి నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేశానన్నారు.

**30 ఏళ్ల క్రితమే బైపాస్ రోడ్డు నిర్మాణం**

1995లో సంగారెడ్డి ప్రజలు తనను నేరుగా మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నుకున్నారని జగ్గారెడ్డి తెలిపారు. అప్పట్లో మున్సిపాలిటీలో ఉద్యోగులకు సకాలంలో జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఉండేదన్నారు. ఆరేడు నెలలకు ఒకసారి జీతాలు వచ్చే పరిస్థితి ఉండేదని చెప్పారు.ఆ సమయంలో ఐబీ గెస్ట్‌హౌస్ నుంచి బసవేశ్వర విగ్రహం వరకు ప్రాంతం ఖాళీగా ఉండేదని, అక్కడ 80 అడుగుల రోడ్డు ఉన్నప్పటికీ వర్షాకాలంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని వివరించారు. రహదారిని బీటీ, ఫార్మేషన్ చేయాలని అధికారులతో చర్చించానని తెలిపారు. అప్పట్లో వచ్చిన రూ.కోటి గ్రాంటులో రూ.20 లక్షలను కౌన్సిలర్ల పరిధిలో అభివృద్ధి పనులకు కేటాయించి, మిగిలిన రూ.80 లక్షలను బైపాస్ రోడ్డు నిర్మాణానికి వినియోగించేలా అందరినీ ఒప్పించానని చెప్పారు. తాను నిర్మించిన బీటీ రోడ్డు కారణంగానే బైపాస్ చుట్టుపక్కల కాలనీలు అభివృద్ధి చెందాయని పేర్కొన్నారు.రూ.18 కోట్లతో ప్రస్తుత అభివృద్ధి పనులు 30 ఏళ్ల పాటు పెద్దగా దెబ్బతినకుండా ప్రజలకు ఉపయోగపడిన రోడ్డును ఇప్పుడు మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఏర్పడిందని జగ్గారెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి బైపాస్ అభివృద్ధికి అనుమతి కోరగానే వెంటనే అంగీకరించారని తెలిపారు. రూ.18 కోట్లతో పనులు ప్రారంభించినట్లు చెప్పారు.రోడ్డు విస్తరణలో చెట్లకు ఇబ్బంది కలగకుండా, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా, వ్యాపారులకు ఇబ్బందులు రాకుండా పనులు చేపడుతున్నామని అన్నారు. అందువల్ల కొన్ని ప్రాంతాల్లో పనులు ఆలస్యం కావచ్చని వివరించారు.నెగెటివ్ ఆలోచనలు మానుకోవాలిబైపాస్ పనులు ఆలస్యమవుతున్నాయంటూ కొందరు రోడ్ల గుంతల వద్ద నిలబడి ఫొటోలు తీసుకుంటున్నారని జగ్గారెడ్డి విమర్శించారు. ఒక రోడ్డు నిర్మించాలంటే ఎదురయ్యే సమస్యలను కూడా అర్థం చేసుకోవాలని సూచించారు.రోడ్డు నాణ్యతపై కొందరు విజిలెన్స్‌కు ఫిర్యాదు చేసిన విషయం తన దృష్టికి వచ్చిందని, దీనిపై కలెక్టర్‌తో కూడా మాట్లాడినట్లు తెలిపారు. పనులపై అనవసరమైన నెగెటివ్ ప్రచారం చేయవద్దని కోరారు.సదాశివపేట కందకం రోడ్డుపైనా వ్యాఖ్యలుతాను సంగారెడ్డి మున్సిపల్ చైర్మన్‌గా ఉన్నప్పుడు తన ఊరిలో రోడ్డు నిర్మించానని, ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత సదాశివపేటలో కందకం రోడ్డును కూడా నిర్మించానని జగ్గారెడ్డి తెలిపారు. సదాశివపేటకు చెందిన వ్యక్తి కాకపోయినా అక్కడి పేదల కోసం సిద్ధాపూర్‌లో సుమారు 5 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇప్పించానని చెప్పారు. వారికి ప్లాట్ల పొజిషన్ కూడా ఇప్పించానన్నారు. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఐదు వేల మందిని అక్కడి నుంచి వెళ్లగొట్టిందని ఆరోపించారు.అక్కడ సుమారు 100 ఎకరాలను వివిధ శాఖలకు అప్పటి ప్రభుత్వం కేటాయించిందని ఆయన ఆరోపించారు.

**'అభివృద్ధి కోసం పనిచేస్తున్నాం'**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బైపాస్ రోడ్డుకు అవసరమైన అభివృద్ధి జరగలేదని జగ్గారెడ్డి విమర్శించారు. రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసినప్పటికీ తాము రూ.18 కోట్లు తీసుకొచ్చి రోడ్డు అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు.తాను వేసిన రోడ్డుపైనే అన్ని పార్టీలకు చెందిన ప్రజలు నడుస్తున్నారని, అయినప్పటికీ తమను విమర్శించడం సరికాదన్నారు. అభివృద్ధిని అడ్డుకునే నెగెటివ్ ఆలోచనలు మానుకోవాలని సూచించారు.జవహర్‌లాల్ నెహ్రూ, రాజీవ్‌గాంధీ దేశం కోసం ప్రాణత్యాగం చేశారని, వారి విగ్రహాలను ఏర్పాటు చేస్తే ఎవరికీ నష్టం లేదని పేర్కొన్నారు."నేను సంగారెడ్డి ఊరోన్ని.. సంగారెడ్డిని ఎలా అభివృద్ధి చేసుకోవాలో నాకు తెలుసు. పనిచేయనివాళ్లు, పనికిమాలినవాళ్లు మాట్లాడుతూనే ఉంటారు. అభివృద్ధి చేయాలనే తపనతోనే నిధులు తీసుకొచ్చి పనులు చేపడుతున్నాం" అని జగ్గారెడ్డి అన్నారు.

## వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా

**మహబూబ్ నగర్ సెప్టెంబర్ 5 (వుదయం ప్రతినిధి)**




వినాయక చవితి ఉత్సవాలను ఎటువంటి సమస్యలు లేకుండా, సురక్షితంగా, ప్రశాంత వాతావరణంలో జరుపుకునేందుకు అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు.

శనివారం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి శాంతి కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ డి. జానకి తో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వినాయక చవితి ఉత్సవాల నిర్వహణ, అలాగే నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా చర్యలు, పారిశుధ్యం, విద్యుత్, వైద్య సేవలు, అగ్నిమాపక ఏర్పాట్లు, తాగునీటి సరఫరా, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు.

ముందుగా గతంలో ఎదురైన సమస్యలు, అవసరమైన సౌకర్యాలపై గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులను కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహబూబ్‌నగర్‌లో ప్రతి సంవత్సరం సుమారు 350 గణేష్ మండపాలు ఏర్పాటు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. గణపతి మండపాలకు ఉచిత విద్యుత్తు కనెక్షన్లు, నిమజ్జన పాయింట్ల వద్ద క్రేన్లు, తగినంత లైటింగ్, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని వారు కోరారు.

అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో వినాయక చవితి ఉత్సవాలకు సంబంధించిన తీసుకోవాల్సిన చర్యలు, చేయాల్సిన ఏర్పాట్లను గురించి వివరించారు. ముఖ్యంగా శోభాయాత్ర మార్గాల్లో తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను సరిచేయడంతో పాటు గుంతలను పూడ్చి రహదారులను మరమ్మతు చేయాలని, విగ్రహాల తరలింపునకు అవసరమైన వాహనాలను ఏర్పాటు చేయాలని, విద్యుత్, ఆర్ అండ్ బి, రవాణా శాఖా అధికారులను ఆదేశించారు. మండపాల వద్ద తొమ్మిది రోజుల పాటు నిరంతర పారిశుధ్య చర్యలు చేపట్టి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

మండపాలకు విద్యుత్ కనెక్షన్లు సక్రమంగా అందేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మండపాల వద్ద అగ్ని ప్రమాదాలను నివారించేందుకు నిర్వాహకులు తప్పనిసరిగా అగ్నిమాపక పరికరాలు, ఇసుక బకెట్లు, కార్బన్ డయాక్సైడ్ ఎక్స్‌టింగ్విషర్లను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, ఎస్పీ జానకి ,అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, డీఆర్ఓ ఎ. నిర్మల, అదనపు ఎస్.పి ఎన్.బి. రత్నం, జిల్లా అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, వీహెచ్‌పీ ప్రతినిధులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నగరం గ్రామ పంచాయతీ పాలక వర్గం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మానం



**మెదక్ జిల్లా ,వుదయం**

నిజాంపేట మండలం నగరం గ్రామ పంచాయతీ ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాల యందు ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా నగరం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మొదటగా సర్వేపల్లి రాధాకృష్ణ గారి ఫోటో కు పూల మాల వేసి ,ఉపాధ్యాయులకు పుష్పగుచ్ఛం ఇచ్చిన అనంతరం శాలువాలతో సన్మానించడం జరిగిందని గ్రామ పంచాయతీ సర్పంచ్ శ్రీమతి అంతంపల్లి సుశీల తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అంతంపల్లి సుశీల, ఉప సర్పంచ్ గుగ్లోత్ నాజం, పంచాయతీ కార్యదర్శి మొహమ్మద్ ఆరీఫ్ హుస్సేన్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ఉమారాణి, ఉపాధ్యాయులు వెంకటేష్, కల్పన, స్రవంతి, సోనా, అంగన్వాడీ టీచర్ గుగ్లోత్ స్వప్న,విద్యార్థులు ఉన్నారు.

# మదర్ తెరిసా సేవలు చిరస్మరణీయం



**ఫాతిమా నగర్‌లో మదర్ థెరిసా విగ్రహం వద్ద ప్రత్యేక ప్రార్థనలు**

**హనుమకొండ, సెప్టెంబర్ 05 (వుదయం ప్రతినిధి) :** మదర్ తెరిసా వర్ధంతి సందర్భంగా ఫాతిమా నగర్‌లోని మదర్ తెరిసా విగ్రహం వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొని మదర్ తెరిసాకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. సమాజంలోని పేదలు, నిరుపేదలు, అనాథలు, నిరాశ్రయులు, అభాగ్యుల కోసం మదర్ తెరిసా చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఎలాంటి స్వార్థం లేకుండా మానవ సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన ఆమె సేవా స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. మదర్ తెరిసా చూపిన మానవతా మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని, సమాజంలో ఆపదలో ఉన్న వారికి అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.

ఆమె ఆశయాలను కొనసాగిస్తూ సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం మదర్ తెరిసా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగు అకాడమి చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ,స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొని మదర్ తెరిసా సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ కాసు మర్రెడ్డి, టామీ, ఆర్. రాజ్ మోహన్ రావు, ఎం భాస్కర్, బి దయాసాగర్ , అల్లం ప్రకాష్ రెడ్డి, సుధీర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, మత్యాస్ రెడ్డి, ఇన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం
## పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత



**ఘనంగా 'సంఘమిత్ర' ప్రారంభం**

**వరంగల్ సెప్టెంబర్ 05 (వుదయం ప్రతినిధి) :** పోలీసు శాఖ, ప్రజల ఉమ్మడి భాగస్వామ్యంతో డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా చేపట్టిన 'సంఘమిత్ర' కార్యక్రమం శనివారం హన్మకొండలోని కాళోజి కళాక్షేత్రంలో ఘనంగా ప్రారంభమైంది. వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. సత్య శారద, ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. 1.17 లక్షల మందికి అవగాహన: స్వయం సహాయక సంఘాలు (SHG), VOAలు, మెప్మాకు చెందిన 1,000 మంది ప్రతినిధుల ద్వారా జిల్లాలోని 1.17 లక్షల మంది సభ్యులకు, తద్వారా ప్రతి ఇంటికీ మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా సందేశాన్ని చేరవేయడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. కమిషనర్ పిలుపు: జనగామ తర్వాత వరంగల్‌లో ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని త్వరలోనే హన్మకొండలోనూ విస్తరిస్తామని సీపీ శ్వేత తెలిపారు. డ్రగ్స్ విక్రయాలు, వాడకంపై సమాచారం ఇచ్చే వారి వివరాలు గోప్యంగా ఉంచి తగిన రివార్డు అందిస్తామని, వ్యసనపరులకు కౌన్సెలింగ్, వైద్య సహాయం అందించి సాధారణ జీవితంలోకి తేచ్చేందుకు కృషి చేయాలని కోరారు. సమిష్టి బాధ్యత: డ్రగ్స్ నిర్మూలన అనేది కేవలం పోలీసుల అంశం మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని కలెక్టర్ డా. సత్య శారద పేర్కొన్నారు. SHG సభ్యులు గ్రామాల్లో సైనికుల్లా పనిచేసి యువతను సన్మార్గంలో నడిపించాలని డీసీపీ అంకిత్ కుమార్ సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల డ్రగ్స్ అవేర్‌నెస్ స్కిట్, తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరో (TG NAB) ప్రత్యేక వీడియోల ప్రదర్శన ఆకట్టుకున్నాయి. గతంలో డ్రగ్స్‌కు బానిసై బయటపడిన వ్యక్తి పంచుకున్న అనుభవాలు పాల్గొన్న వారిని ఆలోచింపజేశాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వై. వి. గణేష్, పలువురు అధికారులు, వెయ్యి మందికి పైగా మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ పై కాంగ్రెస్ నాయకులు చౌకబారు ప్రకటన



**ఖండించిన ఐనవోలు మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు**
**ఆరూరి రమేష్ నిబద్ధతతో విధులు**
**అభివృద్ధికి, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను ప్రజలకు అందించారు.**

**ఐనవోలు , సెప్టెంబర్ 5 (వుదయం ప్రతినిధి):** ఐనవోలు మండల (బి.ఆర్.ఎస్) పార్టీ కార్యాలయంలో,శనివారం మండల కన్వీనర్ తంపుల మోహన్ విలేకరుల సమావేశం ప్రతికా సమావేశంలో మాట్లాడుతూ...గత కొన్ని రోజుల క్రితం ఐనవోలు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ శాసనసభ్యులు ఆరూరి రమేష్ పై చౌకబారు, నోటికొచ్చినట్లు అవాకులు చవాకులు మాట్లాడటాన్ని బి.ఆర్.ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఆరూరి రమేష్ నాయకత్వం నాటి టీ ఆర్ ఎస్ నేటి బి ఆర్ ఎస్ హయాంలో దాదాపు పదిట సంవత్సరాల పాటు వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే గా ఆరూరి రమేష్ ఎంతో నిబద్ధతతో విధులు నిర్వహించారు. నియోజకవర్గ అభివృద్ధికి, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో ఎటువంటి లాభాపేక్ష లేకుండా నిస్వార్థంగా పనిచేసిన ప్రజా నాయకుడు ఆయన. అటువంటి వ్యక్తిపై అనుచిత విమర్శలు చేయడం ఏమాత్రం సరికాదు. విమర్శలు గుప్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు గతంలో బి ఆర్ ఎస్ పార్టీలోనే ఉంటూ, ఉన్నత పదవులు అనుభవించి, ఆర్థికంగా స్థిరపడ్డారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి మారడం వారి అవకాశవాద రాజకీయాలకు అద్దం పడుతోంది. ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ, చిల్లర రాజకీయాలు చేస్తూ ఇతర పార్టీల నాయకులను అడ్డుకోవడం, విమర్శించడం సమంజసం కాదు. బి ఆర్ ఎస్ పార్టీ ఎవరికీ లొంగిపోదు, అమ్ముడుపోదు. ఎల్లప్పుడూ మండల మరియు నియోజకవర్గ అభివృద్ధి గురించే ఆలోచిస్తుంది. ఇప్పటికైనా విమర్శలు చేసే నాయకులు పద్ధతి మార్చుకుని మండల అభివృద్ధికి తోడ్పడాలి. రాబోయే రోజుల్లో సమయం వచ్చినప్పుడే కొర్రీ ప్రజలే మీకు తగిన బుద్ధి చెబుతారు. ఇప్పటికైనా ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ, మంచి వాతావరణంలో వ్యవహరించాలి. లేనిపక్షంలో భవిష్యత్తులో జరిగే పరిణామాలకు మీరే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది. సమావేశంలో నందనం సొసైటీ వైస్ చైర్మన్ తక్కళ్ళపల్లి చందర్ రావు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు గద్దం రఘువంశీ గౌడ్ , మాజీ సర్పంచ్ పల్లకొండ సురేష్, మాజీ ఉపసర్పంచ్ అద్దగూడ సతీష్ కుమార్ ఇతర ముఖ్య నాయకులు, పాల్గొన్నారు.

# అభివృద్ధిపై నిర్లక్ష్యం ఎందుకు?..



**సీఎం సభకు రూ.30 లక్షలు.. పట్టణ అభివృద్ధికి నిధులేవీ?**
**మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి**

**పరకాల సెప్టెంబర్ 5 (వుదయం ప్రతినిధి):** పరకాల పట్టణాన్ని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని వరంగల్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి పరకాల పర్యటన సందర్భంగా మున్సిపాలిటీ నుంచి సుమారు రూ.30 లక్షలు ఖర్చు చేసినప్పటికీ.. పట్టణ అభివృద్ధికి ప్రత్యేకంగా ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం బాధాకరమని విమర్శించారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లతో కలిసి పలు అంశాలను ప్రస్తావించినట్లు ఎమ్మెల్సీ తెలిపారు. పట్టణంలోని 22 మంది కౌన్సిలర్లకు అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు సమావేశానికి గైర్హాజరు కావడంపై ప్రశ్నించిన ఆయన.. అభివృద్ధి పనుల నిధుల పంపకాల విషయంలో అధికార పార్టీ కౌన్సిలర్ల మధ్య ఏమైనా విభేదాలు ఉన్నాయా? అని నిలదీశారు. పరకాలను ప్రధాన జంక్షన్‌గా తీర్చిదిద్దాలి: గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు ఎగ్జిట్ కనెక్షన్ కల్పించి పరకాలను ప్రధాన రవాణా జంక్షన్‌గా అభివృద్ధి చేయాలని సమావేశంలో కోరినట్లు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ ప్రతిపాదనకు పరకాల ఎమ్మెల్యే కూడా సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. ఏఎంసీకి ఆధునిక హంగులు పరకాల వ్యవసాయ మార్కెట్‌ను ఏ1 మార్కెట్‌గా అభివృద్ధి చేయడంతో పాటు రైతుల ప్రయోజనాల కోసం కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేయాలని కోరినట్లు వెల్లడించారు. ఈ ప్రతిపాదనపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని తెలిపారు. 100 పడకల ఆస్పత్రిని అత్యాధునిక పరికరాలతో అందుబాటులోకి తీసుకురావాలి పరకాలలో నిర్మించిన 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని ప్రారంభించారు తప్ప అందులో రోగులకు అత్యవసర చికిత్సకు సంబంధించిన అధ్యాధునిక సౌకర్యాలు లేవని తెలిపారు. అత్యాధునిక పరికరాలతో వైద్యాన్ని రోగులకు అందుబాటులోకి తీసుకురావాలని పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. నర్సంపేట తరహాలో పరకాలలకు మెడికల్ కాలేజీ మంజూరు చేయాలని కోరారు. పరకాల పట్టణానికి పూర్వ వైభవం తీసుకురావాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న వారు తమ పరిధిలో అభివృద్ధి చేయాలని, భవిష్యత్తులో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పరకాలను మరింత అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం




**అధ్యాపకులే మార్గదర్శకులు..**
**విద్యార్థుల భవిష్యత్‌కు దిక్సూచిలు**
**డీఐఈఓ డా. శ్రీధర్ సుమన్**

**రాయపర్తి, సెప్టెంబర్ 5 (వుదయం ప్రతినిధి):** సమాజానికి ఉపాధ్యాయులే దిక్సూచిలా నిలుస్తూ విద్యార్థుల జీవితాలకు సరైన మార్గాన్ని చూపే మార్గదర్శకులని జిల్లా మాధ్యమిక విద్యాధికారి డా. శ్రీధర్ సుమన్ అన్నారు. శనివారం రాయపర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, దీప ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పలువురు అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీఐఈఓ డా. శ్రీధర్ సుమన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అనూహ్యమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలతో పాటు నోట్‌బుక్స్, బ్యాగులు, షూస్ సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. ఇంటర్ విద్యార్థులు అధ్యాపకుల సూచనలు, సలహాలను పాటిస్తూ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. చదవడం, రాయడంలో ఎక్కడా వెనుకబడకుండా క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని అన్నారు.

**11 కళాశాలల్లో 32,448 నోట్‌బుక్స్ పంపిణీ**

జిల్లా వ్యాప్తంగా 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయని, వాటిలో మొత్తం 2,704 మంది విద్యార్థులకు 32,448 నోట్‌బుక్స్ పంపిణీ చేసినట్లు డీఐఈఓ తెలిపారు. ఈ విద్యా సంవత్సరం మారిన పాఠ్యాంశాల ప్రకారం వార్షిక పరీక్షల్లో 80 మార్కులు, అంతర్గత మూల్యాంకనానికి 20 మార్కులు ఉంటాయని పేర్కొన్నారు. అంతర్గత మార్కుల సాధనకు నోట్‌బుక్స్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అదే విధంగా మారిన పాఠ్యాంశాలు, సిలబస్‌పై అధ్యాపకులు పూర్తి స్థాయిలో పట్టు సాధించి విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని సూచించారు .ఈ సందర్భంగా విద్యార్థులకు షూస్, బ్యాగులను పంపిణీ చేశారు.

కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జయకుమారి, సర్పంచ్ సహేంద్ర భిక్షపతి, లైబ్రేరియన్ సునీల్ రెడ్డి, అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# భీమారంలో హైటెన్షన్..



**కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల పోటాపోటీ నినాదాలు**
**డీజేలతో హోరెత్తిన భీమారం బస్టాండ్**
**ఇరువర్గాల మధ్య తోపులాట**
**నేషనల్ హైవే పై బీఆర్ఎస్ కార్యకర్తల బైఠాయింపు**
**ట్రాఫిక్‌కు అంతరాయం**

**హసన్ పర్తి సెప్టెంబర్5 (వుదయం ప్రతినిధి):** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 55 వ డివిజన్ భీమారం బస్టాండ్ వద్ద శనివారం కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య ఉద్రిక్తత చోటు చేసుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా కాంగ్రెస్ శ్రేణులు భీమారం బస్టాండ్ వద్ద సంబరాలు నిర్వహించగా.. అదే ప్రాంతంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ కార్యక్రమం చేపట్టడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో కాంగ్రెస్ శ్రేణులు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ విజయోత్సవాలు నిర్వహించారు. వర్ధన్నపేట నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ అక్కడికి చేరుకోవడంతో ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత మరింత పెరిగింది. ఇరువర్గాలు కేవలం ఐదు మీటర్ల దూరంలోనే డీజేలను ఏర్పాటు చేసుకుని పోటాపోటీగా నినాదాలు చేయడంతో భీమారం బస్టాండ్ ప్రాంతం కొద్దిసేపు హోరెత్తింది. పరస్పరం నినాదాలు చేసుకుంటున్న క్రమంలో ఇరువర్గాల కార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకుంది. దీంతో పోలీసులు వెంటనే అప్రమత్తమై ఇరువర్గాలను చెదరగొట్టేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న ఏసీపీ నరసింహారావు, స్థానిక ఇన్‌స్పెక్టర్ ఎస్. రవికుమార్, ఎస్సైలు, ఏఎస్సైలు, పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు తీవ్రంగా శ్రమించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఇరువర్గాలను వేర్వేరు ప్రాంతాలకు పంపించారు.

బిఆర్ఎస్ కార్యకర్తలు రోడ్డు పై బైఠాయింపు బీఆర్ఎస్ కార్యకర్తలు కొద్దిసేపు నేషనల్ హైవే పై బైఠాయించి నిరసన వ్యక్తం చేయడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు వారిని అక్కడి నుంచి తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. దీంతో కొద్దిసేపటి తర్వాత పరిస్థితి అదుపులోకి వచ్చింది.

# పర్వతగిరిలో విద్యుత్ కోతలతో ప్రజల అవస్థలు



**- మూడు రోజులుగా సాయంత్రం 7 గంటలకే కరెంట్ కట్... 30–40 నిమిషాల పాటు సరఫరా నిలిపివేత**
**- ఉదయం నుంచి తెల్లవారుజాము వరకు ఎన్నిసార్లు కరెంట్ పోతుందో గ్రామ ప్రజలకే తెలుసు!**

**పర్వతగిరి , సెప్టెంబర్ 5 ( వుదయం ప్రతినిధి ):** పర్వతగిరి గ్రామంలో విద్యుత్ శాఖ అధికారుల తీరుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. గత మూడు రోజులుగా ప్రతిరోజూ సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో 30 నుంచి 40 నిమిషాల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోతోందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అంతటితో సమస్య ముగియడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఉదయం నుంచి తెల్లవారుజాము 6 గంటల వరకు ఎన్నిసార్లు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందో లెక్కపెట్టడం కూడా కష్టంగా మారిందని అంటున్నారు. తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గృహ అవసరాలతో పాటు చిన్న వ్యాపారాలు, విద్యార్థులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ కోతలపై అధికారులను ప్రశ్నిస్తే ఒక్కోసారి ఒక్కో రకమైన సమాధానం ఇస్తున్నారని, అసలు కారణం ఏమిటో స్పష్టంగా చెప్పడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సమస్య పరిష్కరించాల్సిన అధికారులు పొంతనలేని సమాధానాలతో తప్పించుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసలు సాంకేతిక సమస్య ఏమిటి? నిర్వహణ పనులా? లేక అనధికారిక విద్యుత్ కోతలా? అనే ప్రశ్నలు గ్రామస్థుల్లో వ్యక్తమవుతున్నాయి. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి పర్వతగిరిలో గత మూడు రోజులుగా జరుగుతున్న విద్యుత్ అంతరాయాలపై పూర్తి వివరాలు వెల్లడించి,

తరచూ విద్యుత్ నిలిచిపోవడానికి గల కారణాలను ప్రజలకు స్పష్టం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. అలాగే విద్యుత్ సరఫరా అంతరాయాలను శాశ్వతంగా పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న గుండ రాజన్న



**జన్నారం,సెప్టెంబర్ 5 (వుదయం విలేఖరి)**

జన్నారం మండలం కిష్టాపూర్ జెడ్పీఎస్ఎస్ ప్రధానోపాధ్యాయులు గుండ రాజన్న రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కొడంగల్ లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో శనివారం రోజున ఆయన విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా చేతుల మీదుగా అవార్డు ప్రధానం చేశారు.గుండ రాజన్న 2023 నుండి కిష్టాపూర్ పాఠశాలలో హెచ్‌ఎం గా పనిచేస్తూ,వరుసగా మూడు సంవత్సరాలు ఎస్ఎస్సి ఫలితాలలో జిల్లా టాపర్లుగా పాఠశాలను నిలపడంలో కృషి చేశారు. అలాగే విద్యార్థుల సంఖ్యను కూడా పెంచడంలో కీలకంగా వ్యవహరించారు.ఈ ఘనత ఉపాధ్యాయుల సమిష్టి కృషి వల్లే సాధ్యమైందని ఆయన అన్నారు. మంచిర్యాల జిల్లాకే అయన గర్వకారణంగా నిలిచారు. ఈ సందర్భంగా రాజన్నకు పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు,విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

# వంశీకృష్ణ నిహారిక వివాహ వేడుకకు హాజరైన బీఆర్ఎస్ నాయకులు



**చిట్యాల: సెప్టెంబర్ 05 (వుదయం ప్రతినిధి)**

చిట్యాల మండల కేంద్రానికి చెందిన పిట్టల భాగ్యలక్ష్మిరామచంద్రు దంపతుల కుమారుడు వంశీకృష్ణ వివాహం నిహారికతో శనివారం ఘనంగా జరిగింది.ఈ వివాహ వేడుకకు బీఆర్ఎస్ నాయకులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో చిట్యాల మాజీ జడ్పీటీసీ గొర్రె సాగర్ యాదవ్ బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు అల్లం రవీందర్, పీఏసీఎస్ చైర్మన్ కుంభం క్రాంతి కుమార్ రెడ్డి, యూత్ అధ్యక్షులు తౌటం నవీన్, యూత్ నాయకులు గుండా సురేష్ ఉన్నారు.

# విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చడమే ఉపాధ్యాయుల లక్ష్యం



**15 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం.**
**తాహసిల్దార్ నంగునూరి రమేష్, ఎంపీడీవో అద్వైత, ఎంఈఓ వెంకట్రామ్.**

**ఖానాపురం, సెప్టెంబర్ 5 (వుదయం ప్రతినిధి):** విద్యార్థులను ఉన్నత స్థానాలను అధిరోహించే విధంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదని తహసిల్దార్ నంగునూరి రమేష్, మండల అభివృద్ధి అధికారి వనపర్తి అద్వైత, ఇన్చార్జి ఎంఈఓ వెంకట్రామ్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవంగా సందర్భంగా ఇన్చార్జి ఎంఈఓ సమక్షంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తహసిల్దార్, ఎంపీడీవో పాల్గొని మండలంలోని వివిధ పాఠశాలల్లో విశిష్ట సేవలు అందించిన 15 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శాలువా కప్పి ప్రశంసా పత్రాలను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు ఉపాధ్యాయులు అధికారులు ఎమ్మార్సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


# జన్నారం మండల మీసేవా నూతన కార్యవర్గం ఎన్నిక



**జన్నారం,సెప్టెంబర్ 5 (వుదయం విలేఖరి)**

జన్నారం మండలంలోని మీసేవ నిర్వాహకుల ఆధ్వర్యంలో మండల మీసేవ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.శుక్రవారం రోజున మండలంలోని మీసేవా నిర్వాహకులు అందరూ కలిసి సమావేశం నిర్వహించుకున్నారు.ఈ సమావేశంలో మండల నూతన కార్యవర్గాన్ని సభ్యులందరి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.గౌరవ అధ్యక్షులుగా గుండ పవన్ కుమార్,అధ్యక్షులుగా ఎస్, కే మౌలానా,ఉపాధ్యక్షులుగా గోలి భానుచందర్,ప్రధాన కార్యదర్శిగా గోనె శిరీష సత్యం,కోశాధికారిగా కైరం మనోజ్,సభ్యులు గడ్డం తిరుపతి,తొట్ల అజయ్ కుమార్,సయ్యద్ ఇమ్రాన్, బి.కిరణ్ నాయక్ లతో నూతన కమిటీ ఏర్పరచుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీకి పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

# మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రజా పాలన 1000 రోజుల విజయోత్సవ సంబరాలు



**జన్నారం, సెప్టెంబర్ 5 (వుదయం విలేఖరి)**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా పాలన విజయవంతంగా 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా జన్నారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. మండల వ్యాప్తంగా వచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు ఉత్సాహంగా పాల్గొని స్థానిక బస్ స్టాండ్ నుండి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, టపాసులు కాల్చి, పార్టీ కార్యాలయంలో స్వీట్లు పంచుకుంటూ విజయోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా జన్నారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అజ్మీరా నందునాయక్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం గత 1000 రోజులుగా ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, పేద కుటుంబాల అభ్యున్నతికి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని అన్నారు. .అలాగే డీసీసీ అధ్యక్షులు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ నాయకత్వంలో ఖానాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతోందని, గ్రామ స్థాయి వరకు పార్టీని మరింత బలంగా తీర్చిదిద్దేందుకు నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు మంద రాజేష్, ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం,పొనకల్ సర్పంచ్ జక్కు సుష్మభూమేష్,ఏఎంసీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ,వైస్ చైర్మన్ ఫసిఉల్లా,పాక్స్ చైర్మన్ అల్లం రవి,పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఇస్సాక్, ముజాఫర్,ఎస్సీ సెల్ అధ్యక్షులు మామిడిపెల్లి, మండల నాయకులు ఎల్కుశి వెంకటేష్,ఇందయ్య , ఎంపీటీసీ ల ఫోరం జిల్లా అధ్యక్షులు ఎండీ. రియాజుద్దీన్, సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు కుదిరే వెంకన్న, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి హేమంత్ చారి, సీనియర్ నాయకులు ముత్యం సతీష్, దూమల్ల రమేష్, మచ్చ శంకరయ్య, సుధాకర్, నందు నాయక్, ముత్యం రాజన్న, అబ్దుల్ ముజ్జు, దూమల్ల ప్రవీణ్, ఫాతిమా సాహిని, గంగన్న, షేక్ ఇమ్రాన్, సోషల్ మీడియా నాయకులు షాకిర్, జ్ఞానేశ్వర్, రాహుల్, సర్పంచ్ లు, వార్డు సభ్యులు, యూత్ కాంగ్రెస్,ఎన్ఎస్యూఐ, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చక్కని ఆరోగ్యం

## 99 శాతం మంది పిలుస్తున్నది కాలుష్యపు గాలినే.. అధ్యయనంలో వెల్లడి..



వాయు కాలుష్యం ప్రపంచవ్యాప్తంగా ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పుగా మారుతోంది. ముఖ్యంగా గాలిలోని అత్యంత సూక్ష్మమైన కాలుష్య కణాలు శరీరంలోని వివిధ అవయవాలపై ప్రభావం చూపడంతో పాటు క్యాన్సర్ ముప్పును కూడా పెంచుతున్నట్లు తాజా అధ్యయనం వెల్లడించింది. ప్రపంచ జనాభా లో దాదాపు 99 శాతం మంది ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన గాలి నాణ్యత ప్రమాణాలను మించిన కాలుష్యానికి గురవుతున్నట్లు పరిశోధకులు తెలిపారు. 2000 నుంచి 2020 మధ్య కాలంలో ప్రపంచంలోని 952 ప్రాంతాల్లో నమోదైన క్యాన్సర్ భారాన్ని, సాధారణ వాయు కాలుష్య కారకాలకు దీర్ఘకాలికంగా గురికావడంతో ఉన్న సంబంధాన్ని అధ్యయనం చేశారు. మొత్తం 10.9 కోట్ల క్యాన్సర్ కేసులను పరిశీలించిన ఈ పరిశోధనలో పీఎం2.5 ప్రధాన పాత్ర పోషిస్తున్న కాలుష్య కారకంగా గుర్తించారు. ఈ అధ్యయన ఫలితాలు నేచర్ హెల్త్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. 2.5 మైక్రాన్ల కంటే తక్కువ పరిమాణం కలిగిన సూక్ష్మ కణాలను పీఎం2.5గా పిలుస్తారు. ఇవి చాలా చిన్నగా ఉండటంతో శ్వాస ద్వారా శరీరంలోకి సులభంగా ప్రవేశిస్తాయి. అధ్యయనం ప్రకారం 2000–2020 మధ్య నమోదైన మొత్తం క్యాన్సర్ కేసుల్లో సుమారు 88.2 లక్షల కేసులకు పీఎం2.5 కాలుష్యం కారణమై ఉంటుందని అంచనా వేశారు. ప్రతి క్యూబిక్ మీటర్ గాలిలో పీఎం2.5 స్థాయి 10 మైక్రోగ్రాములు పెరిగినప్పుడు క్యాన్సర్ వచ్చే ప్రమాదం 17.9 శాతం పెరిగినట్లు అధ్యయనంలో గుర్తించారు. అదే స్థాయిలో పీఎం2.5కు గురికావడం వల్ల కిడ్నీ క్యాన్సర్ ప్రమాదం 17.9 శాతం, మూత్రాశయ క్యాన్సర్ ప్రమాదం 21.1 శాతం అధికంగా ఉన్నట్లు తేలింది. పీఎం2.5 ప్రభావం కేవలం శ్వాసకోశ వ్యవస్థకే పరిమితం కాదని పరిశోధకులు తెలిపారు. థైరాయిడ్,అన్నవాహిక, పెద్దపేగు,మలద్వారం, రొమ్ము వంటి ఇతర భాగాలకు సంబంధించిన క్యాన్సర్లతోనూ ఈ కాలుష్యానికి సంబంధం ఉన్నట్లు అధ్యయనం సూచిం చింది. పీఎం2.5 కాలుష్యం తొలగించగలిగితే లేదా దానికి గురికావడాన్ని గణనీయంగా తగ్గించగలిగితే శ్వాసనాళం, బ్రాంకైటిస్, ఊపిరితిత్తుల క్యాన్సర్ కేసుల్లో సుమారు 17.9 శాతం వరకు నివారించవచ్చని అధ్యయనం అంచనా వేసింది. ముఖ్యంగా ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు పీఎం2.5 ఒక ప్రధాన కారణమనే విషయాన్ని ఈ ఫలితాలు మరింత బలపరుస్తున్నాయి. అదేవిధంగా, ఇతర వాయు కాలుష్య కారకాల ప్రభావాన్ని కూడా పరిశోధకులు పరిశీలించారు. ప్రతి క్యూబిక్ మీటర్‌కు 10 మైక్రోగ్రాముల చొప్పున పీఎం2.5, ఓజోన్, నైట్రోజన్ డయాక్సైడ్ స్థాయిలు పెరిగినప్పుడు క్యాన్సర్ ప్రమాదం వరుసగా 16 శాతం, 4.23 శాతం, 11.7 శాతం పెరిగినట్లు గుర్తించారు. 2000 నుంచి 2020 మధ్య నైట్రోజన్ డయాక్సైడ్ కాలుష్యానికి సంబంధించి సుమారు 66.7 లక్షల క్యాన్సర్ కేసులు నమోదైనట్లు అధ్యయనం అంచనా వేసింది. ఓజోన్ కాలుష్యానికి సంబంధించి సుమారు 26 లక్షల కేసులు ఉన్నట్లు వెల్లడించింది. ఎక్కువ రకాల క్యాన్సర్ల విషయంలో పురుషులతో పోలిస్తే మహిళలు ఈ కాలుష్య ప్రభావానికి ఎక్కువగా గురయ్యే అవకాశం ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు.

## పోషకాల గుమ్మడి!



గుమ్మడి పండులో పోషకాలు పుష్కలం. దీన్ని అప్పుడప్పుడూ అయినా ఆహారంలో భాగం చేసుకుంటే... మహిళల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది అంటారు పోషకాహార నిపుణులు.

గుమ్మడిలో విటమిన్–ఎ, కెరటినాయిడ్స్, బీటా–కెరటిన్ పుష్కలంగా ఉంటాయి. ఇవి సహజ యాంటీ ఆక్సిడెంట్స్‌లా పనిచేసి, చర్మంపై ముడతలు రాకుండా నివారిస్తాయి. వయసు పెరుగుతోన్న ఛాయలను తగ్గించి, యవ్వనంగా ఉంచుతాయి. అందుకే, అప్పుడప్పుడు అయినా గుమ్మడి సూప్, జ్యూస్ తాగాలి మరి.

చాలామంది మహిళలు... పీరియడ్స్ సమయంలో నొప్పులు, మూడ్ స్వింగ్స్, హార్మోన్ల అసమతుల్యతతో ఇబ్బంది పడుతుంటారు. ఈ సమయంలో ఓ చెంచా డ్రై రోస్ట్ చేసిన గుమ్మడి గింజలు లేదా ఓ కప్పు గుమ్మడి సూప్ తీసుకోండి. వీటిల్లోని మెగ్నీషియం, ఐరన్, జింక్ వంటి పోషకాలు ఈ సమస్యను తగ్గిస్తాయి.

బరువు తగ్గాలనుకునే మహిళలకు గుమ్మడి సూప్ సూపర్‌ఫుడ్. ఇందులో కెలొరీలు తక్కువగా, పీచు పదార్థం ఎక్కువగా ఉంటాయి. పైగా ఈ సూప్‌తో త్వరగా కడుపు నిండిన భావన కలిగి తరచూ ఆహారం తినాలనే కోరిక తగ్గుతుంది. దీంతో ఆరోగ్యకరమైన పద్ధతిలో బరువు నియంత్రణలోకి వస్తుంది. అంతేకాదు ఈ పండులో ఉండే విటమిన్ సి, ఇలు రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయి. జలుబు, దగ్గు వంటివి దరిచేరకుండా శరీరాన్ని రక్షిస్తాయి.

## ట్రెక్కింగ్‌కు వెళ్లేవారు ముందుగా వైద్య పరీక్షలు చేయించుకోవాలి..



పర్వత ప్రాంతాల్లో ట్రెక్కింగ్‌కు వెళ్లడం ఉత్సాహాన్ని కలిగించే అనుభవమే. అయితే ఎత్తైన ప్రాంతాల్లో ట్రెక్కింగ్ చేయడానికి శారీరకంగా ఫిట్‌గా ఉండటం ఒక్కటే సరిపోదు. రెగ్యులర్‌గా వ్యాయామం చేయడం, బరువులు ఎత్తడం, మంచి స్టామినా ఉండటం వల్ల శరీరం తక్కువ ఆక్సిజన్ ఉన్న ఎత్తైన ప్రాంతాలకు సులభంగా అలవాటు పడుతుందని చెప్పలేం. అందుకే హై ఆల్టిట్యూడ్ ట్రెక్కింగ్‌కు వెళ్లే ముందు ఆరోగ్య పరిస్థితిని ఒకసారి అంచనా వేయడం ముఖ్యం. ఎత్తు పెరిగే కొద్దీ వాతావరణ పీడనం తగ్గుతుంది. దీంతో ప్రతి శ్వాసలో శరీరానికి అందే ఆక్సిజన్ పరిమాణం తగ్గుతుంది. ఫలితంగా ఊపిరితిత్తులు, గుండెతో పాటు ఇతర అవయవాలపై అదనపు ఒత్తిడి పడుతుంది. ముఖ్యంగా ఎత్తుకు శరీరం సరిగ్గా అలవాటు పడకముందే వేగంగా పైకి ఎక్కితే ఆల్టిట్యూడ్ సిక్‌నెస్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. శారీరక ఫిట్‌నెస్, శరీరం ఎత్తైన ప్రాంతాలకు తట్టుకునే సామర్థ్యం రెండూ వేర్వేరు అంశాలు. క్రమం తప్పకుండా పరుగెత్తే వ్యక్తికి కూడా సరైన అక్లైమటైజేషన్ లేకుండా ఎత్తైన ప్రాంతాలకు వెళ్తే అనారోగ్య సమస్యలు వస్తాయి. సాధారణంగా సుమారు 2,450 మీటర్లకు పైగా ఎత్తులో నిద్రించే, ఆ ఎత్తుకు ఇంకా అలవాటు పడని ఎవరికైనా ఆల్టిట్యూడ్ ఇల్‌నెస్ వచ్చే అవకాశం ఉంటుంది. దీనిని ముందుగానే కచ్చితంగా అంచనా వేసే ఒకే ఒక్క సాధారణ పరీక్ష కూడా లేదు. గతంలో ఎత్తైన ప్రాంతాలకు వెళ్లినప్పుడు శరీరం ఎలా స్పందించింది, ఎంత వేగంగా ఎత్తుకు చేరుకుంటున్నారు అనే అంశాలు కూడా ముఖ్యమైన సూచికలుగా ఉంటాయి. అందుకే ట్రెక్కింగ్‌కు ముందు చేసే హెల్త్ చెకప్‌ను కేవలం ఫిట్‌నెస్ సర్టిఫికెట్ గా కాకుండా ఆరోగ్యపరమైన ప్రమాదాలను గుర్తించే ఒక ముందస్తు పరిశీలనగా చూడాలి. వయసు, గత వైద్య చరిత్ర, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి, ఫిట్‌నెస్ స్థాయి, వెళ్లబోయే ప్రాంతం ఎంత ఎత్తులో ఉంది వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని అవసరమైన పరీక్షలను నిర్ణయించాలి. ముందుగా ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని పరిశీలించడం ముఖ్యం. ముఖ్యంగా ఆస్తమా, దీర్ఘకాలిక దగ్గు, గతంలో క్షయవ్యాధి వచ్చిన చరిత్ర, ధూమపానం అలవాటు, స్లీప్ అప్నియా లేదా కారణం తెలియని శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉన్నవారు ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకోవాలి. అవసరాన్ని బట్టి ఆక్సిజన్ శాచురేషన్ పరీక్షతో పాటు పూర్తి శ్వాసకోశ ఆరోగ్య చరిత్రను పరిశీలించుకోవాలి. కొందరికి స్పైరోమెట్రీ వంటి పరీక్షలు కూడా అవసరమవుతాయి. ఇన్హేలర్లను క్రమం తప్పకుండా ఉపయోగించే వారు వాటిని సరైన విధంగా ఎలా ఉపయోగించాలో తెలుసుకోవడంతో పాటు, ట్రెక్కింగ్ సమయంలో అవసరమైన మందులను తమ వెంట తీసుకెళ్లాలి. ఆరోగ్యం అకస్మాత్తుగా క్షీణిస్తే ఏం చేయాలనే దానిపై ముందుగానే ఒక ప్రణాళిక కూడా సిద్ధంగా ఉంచుకోవడం ఉపయోగకరంగా ఉంటుంది. ట్రెక్కింగ్‌కు ముందు హెల్త్ చెకప్ చేయించుకోవడం వల్ల ఆల్టిట్యూడ్ సిక్‌నెస్ అసలు రాదని హామీ ఇవ్వలేం. అలాగే ఎత్తైన ప్రాంతాల్లో ప్రతి వ్యక్తి శరీరం ఎలా స్పందిస్తుందో కచ్చితంగా ముందుగానే చెప్పగలిగే ఒకే ఒక్క పరీక్ష కూడా లేదు. అయితే ఈ పరీక్షలు దాగి ఉన్న ఆరోగ్య సమస్యలను గుర్తించడంలో, ఇప్పటికే ఉన్న వ్యాధులను నియంత్రణలో ఉంచుకోవడంలో, వ్యక్తిగత ప్రమాదాలను అంచనా వేయడంలో సహాయపడతాయి.

## జిడ్డుకు చెక్ పెట్టాలంటే..!

ఏ కాలమైనా జిడ్డు చర్మంతో బాధపడే అమ్మాయిలు చాలామందే ఉంటారు. అయితే ఈ చర్మతత్వం మొటిమలు, మచ్చలకు కారణమవుతుంది. అందుకే కొన్ని ఇంటి చిట్కాలతో ఈ సమస్య నుంచి ఉపశమనం చేసుకోవచ్చంటున్నారు నిపుణులు.

పాలను ముఖానికి అప్లై చేసుకొని పావుగంటయ్యాక కడిగేసుకోవాలి. తద్వారా చర్మంపై జిడ్డుదనం తొలగుతుందట. తేనెతోనూ ముఖంపై జిడ్డుదనాన్ని తొలగించచ్చు. ఇందుకోసం తేనెను ముఖానికి పూతలా వేసుకోవాలి. 15 నిమిషాల తర్వాత కడిగేసుకోవాలి. ఇలా చేయడం వల్ల మంచి ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు.


గుడ్డులోని తెల్లసొన, ద్రాక్షరసం, నిమ్మరసం.. ఈ మూడింటినీ కొద్ది మొత్తాల్లో తీసుకొని మిశ్రమంగా చేసుకోవాలి. దీన్ని ముఖానికి పూసుకొని పావుగంట తర్వాత కడిగేసుకోవాలి. నిమ్మరసం సహజసిద్ధమైన క్లెన్సర్‌గా పనిచేస్తుంది, గుడ్డులోని తెల్లసొన చర్మం బిగుతుగా మారడానికి, ద్రాక్షరసం చర్మం మృదువుగా మారడానికి ఉపకరిస్తాయట.



సాధారణంగా ఆయిలీ స్కిన్ ఉన్న వారు ఎక్కువసార్లు ముఖం కడుక్కుంటూ ఉంటారు. ఇది మంచిది కాదు. ఎందుకంటే ఈ క్రమంలో పదే పదే సోప్ లేదా ఫేస్‌వాష్ వాడితే.. వాటిలో ఉండే రసాయనాలు చర్మాన్ని పొడిబారేలా చేస్తాయి. కాబట్టి సాధారణ నీటితో రోజుకు రెండు లేదా మూడుసార్లు ముఖం శుభ్రం చేసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు.

## క్రియేటిన్ సప్లిమెంట్లను తీసుకోవడం ఆపితే ఏం జరుగుతుంది..?

జిమ్‌లో క్రమం తప్పకుండా వ్యాయామం చేసే వారిలో క్రియేటిన్ సప్లిమెంట్ల వినియోగం సాధారణంగా కనిపిస్తుంది. కండరాల బలం, అధిక తీవ్రతతో చేసే వ్యాయామాల్లో పనితీరును మెరుగుపరచడంలో ఇది సహాయపడుతుంది. అయితే క్రియేటిన్ తీసుకోవడం ఆపేస్తే కండరాలు తగ్గిపోతాయా, హార్మోన్లలో మార్పులు వస్తాయా అనే సందేహాలు చాలామందిలో ఉంటాయి. క్రియేటిన్‌ను ఆపడం వల్ల అకస్మాత్తుగా కండరాల నష్టం, హార్మోన్ల సమస్యలు లేదా విత్‌డ్రాయల్ లక్షణాలు రావని నిపుణులు చెబుతున్నారు. కొన్ని వారాల వ్యవధిలో కండరాల్లో నిల్వ ఉండే క్రియేటిన్ స్థాయిలు సాధారణ స్థాయికి చేరుకోవడంతో శరీర బరువు, కండరాల్లో నీటి పరిమాణం, అధిక తీవ్రత వ్యాయామాల పనితీరులో స్వల్ప మార్పులు కనిపించే అవకాశం ఉంటుంది. క్రియేటిన్ శరీరంలో సహజంగా తయారవుతుంది. మాంసం, చేపలు వంటి ఆహారాల ద్వారా కూడా ఇది లభిస్తుంది. కండరాల్లో క్రియేటిన్ ఫాస్ఫోక్రియేటిన్‌గా మారి శక్తి నిల్వగా పనిచేస్తుంది. ముఖ్యంగా వెయిట్ లిఫ్టింగ్, స్ప్రింటింగ్, వేగవంతమైన లేదా పేలుడు కదలికలు వంటి తక్కువ వ్యవధిలో అధిక తీవ్రతతో చేసే వ్యాయామాల సమయంలో శరీరానికి అవసరమైన ఏటీపీ శక్తిని త్వరగా పునరుద్ధరించడంలో ఇది సహాయపడుతుంది. క్రియేటిన్ సప్లిమెంట్లు తీసుకున్నప్పుడు కండరాల్లో క్రియేటిన్ నిల్వలు పెరుగుతాయి. అయితే సప్లిమెంట్ తీసుకోవడం ఆపిన తర్వాత ఈ స్థాయిలు క్రమంగా తగ్గుతూ సహజ స్థాయికి చేరుకుంటాయి. సాధారణంగా క్రియేటిన్ సప్లిమెంటేషన్ నిలిపివేసిన నాలుగు నుంచి ఆరు వారాల్లో కండరాల్లోని క్రియేటిన్ స్థాయిలు సప్లిమెంట్ తీసుకునే ముందు ఉన్న స్థాయికి తిరిగి చేరుతాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. అయితే క్రియేటిన్ ఆపిన తర్వాత కండరాల్లోని క్రియేటిన్ నిల్వలు సప్లిమెంట్ ప్రారంభించకముందు ఉన్న స్థాయి కంటే మరింత దిగువకు పడిపోతాయని ఆధారాలు లేవు. క్రియేటిన్ తీసుకోవడం ఆపిన తర్వాత మొదటగా కనిపించే మార్పుల్లో శరీర బరువు కొద్దిగా తగ్గడం ఒకటి. క్రియేటిన్ కండర కణాల్లో నీటి నిల్వను పెంచుతుంది. ఇది కొవ్వు కాదు, కండర కణాల్లో ఉండే నీరు. సప్లిమెంట్ నిలిపివేసిన తర్వాత క్రియేటిన్ స్థాయిలు తగ్గడంతో ఈ అదనపు నీటిలో కొంత భాగం కూడా తగ్గుతుంది. దీంతో బరువు కొద్దిగా తగ్గుతుంది. కండరాలు గతంలో కంటే కొంచెం తక్కువగా నిండినట్లు కనిపిస్తాయి. అయితే బరువు తగ్గడాన్ని కండరాలు కోల్పోవడంతో సమానంగా భావించకూడదు. క్రియేటిన్ ఆపిన తర్వాత తగ్గే బరువులో కొంత భాగం కండరాల్లో నిల్వ ఉన్న అదనపు నీరు అవుతుంది. వ్యాయామం ద్వారా అభివృద్ధి చేసిన అసలు కండర కణజాలం అకస్మాత్తుగా కనుమరుగవదు. క్రియేటిన్‌ను ఆపిన తర్వాత అధిక తీవ్రతతో చేసే వ్యాయామాల సమయంలో పనితీరులో స్వల్ప మార్పు కొందరిలో కనిపిస్తుంది. క్రియేటిన్ వల్ల కండరాలకు ఫాస్ఫోక్రియేటిన్ అందుబాటు పెరగడంతో తక్కువ వ్యవధిలో ఎక్కువ శక్తి అవసరమయ్యే వ్యాయామాల్లో అదనపు ప్రయోజనం లభిస్తుంది. ఉదాహరణకు ఒక అదనపు రిపిటిషన్ చేయగలగడం, వరుస సెట్లలో శక్తిని కొనసాగించడం లేదా తీవ్రమైన వ్యాయామాల మధ్య కొంత మెరుగ్గా కోలుకోవడం వంటి ప్రయోజనాలు ఉంటాయి. సప్లిమెంట్ తీసుకోవడం ఆపిన తర్వాత ఈ అదనపు పనితీరు ప్రయోజనం క్రమంగా తగ్గుతుంది. దీంతో కొందరు వ్యక్తులు శక్తి అవసరమయ్యే వ్యాయామాల్లో ఒక రిపిటిషన్ తక్కువ చేయాల్సి రావడం లేదా వరుసగా అధికతీవ్రతతో చేసే ప్రయత్నాల మధ్య కోలుకోవడానికి కొంత ఎక్కువ సమయం పట్టడం వంటి స్వల్ప మార్పులను గమనిస్తారు. ఈ ప్రభావం సాధారణంగా స్థిరమైన వేగంతో చేసే ఎండ్యూరెన్స్ వ్యాయామాల కంటే బలం, శక్తి, అధిక తీవ్రత వ్యాయామాల్లో ఎక్కువగా కనిపిస్తుంది.




## పిల్లలకు స్మార్ట్ ఫోన్లను ఎక్కువగా అలవాటు చేస్తే కలిగే అనర్థాలు ఇవే..



చిన్న వయసులోనే పిల్లలకు స్మార్ట్‌ఫోన్లు, ఇతర డిజిటల్ పరికరాలను అలవాటు చేయడం వారి మెదడు అభివృద్ధిపై ప్రభావం చూపే అవకాశం ఉందని ఓ తాజా అధ్యయనం సూచిస్తోంది. ముఖ్యంగా జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం, భాషా అభివృద్ధి వంటి అంశాలపై అధిక స్క్రీన్ వినియోగం ప్రతికూల ప్రభావం చూపిస్తుందని పరిశోధన పేర్కొంది. బాల్యంలో మెదడు వేగంగా అభివృద్ధి చెందే దశ కావడంతో ఆ సమయంలో పిల్లలు ఎలాంటి వాతావరణానికి, కార్యకలాపాలకు ఎక్కువగా గురవుతున్నారనేది కీలకంగా మారుతుంది. జర్నల్ ఆఫ్ పీడియాట్రిక్స్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనంలో 502 మంది పిల్లలను పరిశీలించారు. చిన్న వయసు నుంచి మధ్య బాల్య దశ వరకు వారి స్మార్ట్‌ఫోన్ వినియోగాన్ని ట్రాక్ చేశారు. చిన్న వయసులోనే స్మార్ట్‌ఫోన్లకు ఎక్కువగా పరిచయం కావడం తక్కువ జ్ఞాపకశక్తి, తగ్గిన కాగ్నిటివ్ పనితీరు, పాఠశాలల్లో తక్కువ విద్యా ప్రదర్శనతో సంబంధం కలిగి ఉంటాయని అధ్యయనం సూచించింది. పిల్లల మెదడు అభివృద్ధి చెందుతున్న సమయంలో నిజ జీవితంలో తల్లిదండ్రులు, స్నేహితులు, ఉపాధ్యాయులతో మాట్లాడటం, ఆడుకోవడం, కొత్త విషయాలను అన్వేషించడం వంటి అనుభవాలు ఎంతో ముఖ్యమైనవి. అయితే ఈ పరస్పర చర్యల స్థానంలో ఎక్కువ సమయం డిజిటల్ పరికరాలపై గడిస్తే, పిల్లల సాధారణ మానవ సంబంధాలు, అనుభవాలు తగ్గిపోతాయి. దీని ప్రభావం ఏకాగ్రత, జ్ఞాపకాలను ఏర్పరచుకునే సామర్థ్యం, సమస్యలను పరిష్కరించే నైపుణ్యం, భాషా అభివృద్ధిపై కనిపించే అవకాశం ఉంది. బాల్యంలో జ్ఞాపకశక్తి, నేర్చుకునే సామర్థ్యాలు సరిగ్గా అభివృద్ధి చెందడం పిల్లల మేధో వికాసానికి కీలకం. చదవడం, సమస్యలను పరిష్కరించడం, తరగతిలో పాఠంపై దృష్టి పెట్టడం వంటి పనులకు మెదడు సమాచారాన్ని నిల్వ చేసుకుని అవసరమైనప్పుడు గుర్తుచేసుకునే సామర్థ్యం అవసరం. జ్ఞాపకశక్తి దెబ్బతింటే నేర్చుకున్న విషయాలను గుర్తుంచుకోవడంలో ఇబ్బందులు ఎదురై, చదువుపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంటుంది. చిన్న వయసులో అధికంగా స్మార్ట్‌ఫోన్ వినియోగించడం పిల్లల విద్యా ప్రదర్శనపై ప్రభావం చూపడానికి అనేక కారణాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. స్మార్ట్‌ఫోన్ వల్ల కలిగే పరధ్యానం పెరగడం, పుస్తకాలు చదివే సమయం తగ్గడం, నిద్రకు ఆటంకం కలగడం, సోషల్ మీడియాపై ఆధారపడటం, ఒకేసారి అనేక పనులు చేయడానికి ప్రయత్నించడం వంటి అంశాలు పిల్లల చదువును ప్రభావితం చేస్తాయి.

అయితే అన్ని రకాల స్క్రీన్ వినియోగం పిల్లలకు హానికరమని చెప్పలేం. ఉపాధ్యాయులు ఉపయోగించే కొన్ని డిజిటల్ లెర్నింగ్ టూల్స్ పిల్లలు విషయాలను సులభంగా అర్థం చేసుకోవడానికి, గుర్తుంచుకోవడానికి సహాయపడతాయి. ఆడియో–విజువల్ విధానంలో బోధించడం వల్ల త్వరగా దృష్టి మరల్చుకునే పిల్లలను కూడా పాఠంపై ఆసక్తిగా ఉంచే అవకాశం ఉంటుంది. అయితే చదువు లేదా అవసరమైన కార్యకలాపాల కోసం ఉపయోగించే స్క్రీన్ సమయానికి, ఎలాంటి నియంత్రణ లేకుండా గంటల తరబడి స్క్రీన్‌ను చూస్తూ ఉండటానికి మధ్య తేడా ఉంది. ఎండ్‌లెస్ స్క్రోలింగ్, షార్ట్‌ఫార్మ్ వీడియోలు చూడటం, అధికంగా గేమ్స్ ఆడటం, సోషల్ మీడియాను ఎక్కువగా ఉపయోగించడం వంటి పాసివ్ స్క్రీన్ వినియోగ అలవాట్లు సమస్యాత్మకంగా మారుతాయి. పిల్లలు డిజిటల్ పరికరాలపై ఎక్కువగా ఆధారపడితే, వాటిని దూరంగా ఉంచినప్పుడు ప్రవర్తనలో మార్పులు కూడా కనిపిస్తాయి. అలాంటి పరిస్థితుల్లో స్క్రీన్ వినియోగాన్ని క్రమంగా నియంత్రించడం అవసరం. పిల్లలు అవసరానికి మించి స్క్రీన్ సమయం గడుపుతున్నారనే విషయాన్ని గుర్తించడానికి కొన్ని సంకేతాలు కనిపిస్తాయి. ఏకాగ్రత లోపించడం, తరచూ విషయాలను మర్చిపోవడం, చదువులో మార్కులు తగ్గడం, ఫోన్ లేదా ఇతర పరికరాలు అందుబాటులో లేనప్పుడు చిరాకు పడటం, శారీరక కార్యకలాపాలు తగ్గిపోవడం, నిద్ర సమస్యలు రావడం, గతంలో ఆసక్తిగా చేసిన హాబీలపై ఆసక్తి తగ్గడం వంటి లక్షణాలను తల్లిదండ్రులు గమనించవచ్చు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO), అమెరికన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ సిఫారసుల ప్రకారం 18 నుంచి 24 నెలల వయసు వరకు పిల్లలకు స్క్రీన్ సమయం ఇవ్వకుండా ఉండటం, 2 నుంచి 5 సంవత్సరాల పిల్లలకు రోజుకు గంటకు మించకుండా స్క్రీన్ వినియోగాన్ని పరిమితం చేయడం సూచించారు. అయితే పిల్లల వయసు, స్క్రీన్ వినియోగం వారి రోజువారీ జీవన విధానానికి ఎంతవరకు ఆటంకం కలిగిస్తోంది అనే అంశాలపై అధిక స్క్రీన్ సమయాన్ని అంచనా వేయాల్సి ఉంటుంది. చిన్న వయసులో స్క్రీన్‌కు ఎక్కువగా గురైన ప్రభావాలను పూర్తిగా వెనక్కి తిప్పడం సాధ్యం కాకపోయినా, స్క్రీన్ సమయాన్ని తగ్గించడం ద్వారా వాటిని నియంత్రించేందుకు అవకాశం ఉంటుంది. పిల్లల మెదడు సహజంగా అభివృద్ధి చెందేందుకు తగినంత శారీరక వ్యాయామం, వయసుకు అనుగుణంగా నిద్ర, కుటుంబ సభ్యులు, ఇతర పిల్లలతో సామాజిక పరస్పర చర్యలు, పుస్తకాలు చదవడం వంటి కార్యకలాపాలు అవసరం. స్మార్ట్‌ఫోన్లు లేదా డిజిటల్ పరికరాలు స్వతహాగా హానికరమైనవి కావని, వాటిపై పిల్లలు అతిగా ఆధారపడటమే సమస్యగా మారుతుందని నిపుణులు చెబుతున్నారు. తల్లిదండ్రులు, సంరక్షకులు, ఉపాధ్యాయులు పిల్లలకు డిజిటల్ పరికరాలను ఎలా పరిచయం చేస్తున్నారు, వాటి వినియోగాన్ని ఎలా నియంత్రిస్తున్నారు అనే అంశాలు వారి భవిష్యత్ స్క్రీన్ అలవాట్లపై ప్రభావం చూపిస్తాయి. డిజిటల్ లెర్నింగ్‌ను సమతుల్యంగా ఉపయోగిస్తూ, స్క్రీన్ సమయాన్ని నియంత్రిస్తే పిల్లల్లో అధిక ఆధారపడే పరిస్థితిని నివారించవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు.

## అడోబ్ కొత్త సీఈఓగా అనిల్ చక్రవర్తి



అమెరికాకు చెందిన సాఫ్ట్‌వేర్ సంస్థ అడోబ్ నూతన సీఈఓగా మళ్లీ భారతీయుడే ఎంపికయ్యారు. ఇప్పటివరకు సీఈఓగా ఉన్న శంతను నారాయణ్ ఆ పదవి నుంచి వైదొలుగుతున్న సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో అనిల్ నియమితులయ్యారు. డిసెంబరు 1 నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించనున్నట్లు కంపెనీ తెలిపింది. ప్రస్తుత కృత్రిమ మేధ (ఏఐ) యుగంలో అడోబ్ వృద్ధికి నాయకత్వం వహించడానికి అనిల్ సరైన వ్యక్తి అని నమ్ముతున్నానని శంతను నారాయణ్ పేర్కొన్నారు.




# కోల్ గ్యాసిఫికేషన్ స్కీమ్‌కు దరఖాస్తులు వచ్చాయి: కేంద్రం క్లారిటీ



కోల్ గ్యాసిఫికేషన్ స్కీమ్‌కు ఆదరణ లభించలేదంటూ వచ్చిన వార్తల్ని కేంద్రం ఖండించింది. రూ.37,500 కోట్ల ప్రోత్సాహక పథకం కింద ఈ ప్రాజెక్ట్ ఏర్పాటుకు ఎవరూ ముందుకు రాలేదన్న వాదనను తోసిపుచ్చింది. అవన్నీ అవాస్తవాలని, ఇలాంటి అసత్యాలు ప్రాజెక్ట్‌పై ఎలాంటి ప్రభావం చూపబోవని బొగ్గు గనుల మంత్రిత్వశాఖ ఓ ప్రకటనలో స్పష్టం చేసింది.

ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు తాల్చేర్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ (TFL), ఎన్‌టీపీసీ నుంచి ఇప్పటికే దరఖాస్తులు వచ్చాయని బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కంపెనీల నుంచి ఒక్క దరఖాస్తు కూడా రాలేదన్న వాదనను తోసిపుచ్చిన కేంద్రం.. తొలి రౌండ్ అప్లికేషన్ విండో ప్రక్రియ సెప్టెంబర్ 7న ముగుస్తుందని స్పష్టం చేసింది. ఈ స్కీమ్‌లో భాగంగా దాదాపు 25 ప్రాజెక్టులకు గానూ.. రూ.2.5– 3 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తోంది. తద్వారా 50 వేల ఉద్యోగాలు సృష్టించొచ్చని భావిస్తోంది. 2030 నాటికి 100 మిలియన్ టన్నుల బొగ్గును గ్యాసిఫికేషన్ చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది.

భారత్ ఇంధన అవసరాలకు దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలనే ఉద్దేశంతో దేశీయ బొగ్గు నిల్వలను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు 'బొగ్గు వాయువీకరణ (కోల్ గ్యాసిఫికేషన్)' ప్రక్రియకు కేంద్రం సంకల్పించింది. రూ.37,500 కోట్ల ప్రోత్సాహక పథకానికి మే నెలలో ప్రధాని మోదీ నేతృత్వంలోని క్యాబినెట్ ఆమోద ముద్ర వేసిన విషయం తెలిసిందే.

# 15 ట్రిలియన్ డాలర్లకు చేరిన కుబేరుల సంపద



కృత్రిమ మేధ కారణంగా ఒకవైపు చాలామంది ఉద్యోగాలు కోల్పోతుంటే.. మరోవైపు పెద్ద పెద్ద కంపెనీలు భారీగా సంపద సృష్టిస్తున్నాయి. ఏఐ రంగంలో పెట్టుబడులు కలిసి రావడంతో ప్రపంచవ్యాప్తంగా సంపన్నుల జనాభా పెరుగుతోంది. గతేడాది బిలియనీర్ల సంఖ్య దాదాపు 3800కు చేరినట్లు గ్లోబల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ అల్ట్రాటా (Altrata) తన వెల్త్ రిపోర్ట్‌లో వెల్లడించింది. వీరి మొత్తం సంపద సుమారు 15.1 ట్రిలియన్ డాలర్లకు (భారత కరెన్సీ ప్రకారం.. రూ.1,417.37 లక్షల కోట్లు) చేరుకున్నట్లు తెలిపింది. గత 5 ఏళ్లలో ఏఐ రంగంలో సగటున 30 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.283.25 కోట్లు) వరకు పెట్టుబడులు చేసిన కంపెనీలు అధిక మార్కెట్ విలువను సాధించాయని అల్ట్రాటా తన నివేదికలో పేర్కొంది. దీంతో బిలియనీర్ల సంపద 12.8 శాతం పెరగ్గా.. కుబేరుల సంఖ్య 8.2 శాతం ఎగబాకింది. ఏఐ రంగానికి సంబంధించిన టెక్నాలజీ స్టాక్స్‌లో పెట్టుబడులు భారీ సంపద సృష్టించాయని నివేదిక వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కుబేరుల మొత్తం సంపదలో.. 27శాతం కేవలం 29 మంది సూపర్ బిలియనీర్ల (50 బిలియన్ డాలర్లను మించి ఆదాయం ఉన్న వారిని ఇలా పరిగణిస్తారు) వద్దే ఉన్నట్లు పేర్కొంది. అత్యధికంగా 1,337 మంది బిలియనీర్లతో ఉత్తర అమెరికా మొదటి స్థానంలో నిలవగా, 1,081 మందితో ఐరోపా రెండో స్థానంలో ఉంది. ఆసియాలో 881 మంది బిలియనీర్లు ఉన్నారు. మొత్తం సంపన్నుల్లో మహిళలు కేవలం 13 శాతం మాత్రమే ఉండడం గమనార్హం.

# జాగ్వార్ ల్యాండ్ రోవర్లో 4వేల ఉద్యోగాలు కోత!



టాటా మోటార్స్‌కు చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్ (JLR) భారీ సంఖ్యలో ఉద్యోగులను తొలగించే యోచనలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. రాబోయే రెండేళ్లలో బ్రిటన్‌లో దాదాపు 4 వేల ఉద్యోగాలకు కోత విధించనున్నట్లు 'ది టైమ్స్' కథనం పేర్కొంది. అమెరికా టారిఫ్‌లు, వాహన తయారీ ఖర్చులు పెరగడం, విక్రయాలు తగ్గడమే ఇందుకు కారణమని తెలిపింది. మరోవైపు, ఉద్యోగాల కోతకు సంబంధించి ఇప్పటికే సిబ్బందికి సమాచారం అందజేశామని, త్వరలోనే ఇందుకు సంబంధించిన ప్రకటన వెలువడనున్నట్లు కంపెనీ పేర్కొన్నట్లు సదరు వార్తా కథనం తెలిపింది. ఆర్థికపరమైన అంశాలకు తగ్గట్టుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వేతన సిబ్బంది, మేనేజ్‌మెంట్ టీమ్‌లపై ఈ ప్రభావం పడే అవకాశం ఉంది. కాగా, బ్రిటన్‌లో అతిపెద్ద కార్ల తయారీ సంస్థల్లో ఒకటైన జేఎల్ఆర్ సంస్థ.. బ్రిటన్‌లో సుమారు 34 వేల మందికి ఉపాధి కల్పిస్తోంది. ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి అయ్యే భారీ వ్యయం, చైనా నుంచి ఎదురవుతున్న తీవ్రమైన పోటీ, అంతర్జాతీయ ఆంక్షల ఒత్తిళ్లను తట్టుకొనేందుకే కంపెనీ ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది. ఈ ఏడాది జూన్ చివరి నాటికి కంపెనీ ఆదాయం దాదాపు 10 శాతం వరకు తగ్గడం గమనార్హం. మరోవైపు, జర్మనీ కార్ల తయారీ దిగ్గజం ఫోక్స్‌వ్యాగన్ కూడా లక్ష ఉద్యోగాలకు కోత విధిస్తున్నట్లుగా ప్రకటించిన సంగతి తెలిసిందే.

# ఎన్ఎస్ఈ పబ్లిక్ ఇష్యూ 15న విడుదల!




తొలుత రూ.10,000 కోట్ల సమీకరణ లక్ష్యంతో 2016లో ఎన్ఎస్ఈని లిస్టింగ్ చేయాలని భావించారు. అయితే పాలనాపరమైన వైఫల్యాలు, కోలొకేషన్ కేసు దృష్ట్యా ఐపీఓకి తప్పనిసరి అయిన నో– అబ్జెక్షన్ సర్టిఫికేట్ (ఎన్ఓసీ)ను ఇవ్వడానికి సెబీ నిరాకరించింది.

అప్పటి నుంచి కేసుల పరిష్కారానికి చర్యలు చేపడుతూనే.. 2019, 2020, 2024లో సెబీ నుంచి ఎన్ఓసీ పొందేందుకు ఎన్ఎస్ఈ ప్రయత్నించింది.

ఎట్టకేలకు ఈ ఏడాది ప్రారంభంలో కో–లొకేషన్, డార్క్ ఫైబర్ కేసుల వ్యవహారాలను సెబీతో ఎన్ఎస్ఈ పరిష్కరించుకొని ఎన్ఓసీ పొందడంతో ఒక కీలక అడుగు పడినట్లయ్యింది.

ఈ ఏడాది జూన్ 17న ఎన్ఎస్ఈ తన ఐపీఓ ముసాయిదా పత్రాలను సెబీ వద్ద దాఖలు చేయగా.. సెప్టెంబరు 4న తుది అనుమతులు లభించాయి.


పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలోనే..

ఎన్ఎస్ఈ సమర్పించిన ఐపీఓ ముసాయిదా పత్రాల ప్రకారం...ఈ ఇష్యూ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) రూపంలో ఉంటుంది. తాజా షేర్లను జారీ చేయడం లేదు. ప్రతిపాదిత ఐపీఓ ప్రక్రియలో ప్రస్తుత వాటాదార్లు సుమారు 6% వాటాకు సమానమైన 14.89 కోట్ల షేర్లను విక్రయించనున్నారు.

ప్రధానంగా ఎస్‌బీఐ 2.48 కోట్లు, ఎంఎస్ స్ట్రాటజిక్ (మారిషస్) లిమిటెడ్ 1.60 కోట్ల షేర్ల చొప్పున విక్రయించనున్నాయి. ఎన్ఎస్ఈలో ఎస్‌బీఐకి 3.23%, అనుబంధ సంస్థ ఎస్‌బీఐ కేపిటల్ మార్కెట్స్‌కు 4.33 శాతం వాటాలు ఉన్నాయి. ఎన్ఎస్ఈలో 10.82 శాతం వాటాతో అతిపెద్ద వాటాదారుగా ఉన్న ఎల్ఐసీ ఈ పబ్లిక్ ఇష్యూ ద్వారా ఎటువంటి షేర్లను విక్రయించడం లేదు. ఎన్ఎస్ఈ మార్కెట్ విలువ సుమారు రూ.5 లక్షల కోట్లుగా ఉంటుందని అంచనా. ఐపీఓలో 6 శాతం వాటాను ప్రస్తుత వాటాదార్లు విక్రయిస్తుండటంతో ఇష్యూ పరిమాణం రూ.30,000 కోట్లుగా ఉండొచ్చని లెక్కగడుతున్నారు. ఇష్యూ ధరల శ్రేణి రూ.2000 దరిదాపులో ఉండొచ్చని బ్యాంకర్లు అంచనా వేస్తున్నాయి. ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన డిజిటల్ సేవల సంస్థ జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓకు కూడా సెబీ ఆమోదం తెలిపింది. ఈ ఇష్యూ పరిమాణం రూ.37,700 కోట్లుగా ఉండొచ్చని చెబుతున్నారు. జియో కంటే ముందే ఎన్ఎస్ఈ ఐపీఓనే వచ్చే అవకాశం ఉండటంతో.. దేశంలో ఇప్పటివరకు అతి పెద్ద ఐపీఓగా ఎన్ఎస్ఈదే అవుతుంది. ఆ తర్వాత జియో ఐపీఓ వచ్చాక... ఈ సంస్థదే అతిపెద్ద ఐపీఓగాను, ఎన్ఎస్ఈ ఐపీఓ రెండో స్థానంలో ఉంటుంది.




## పిరికిపందలతో పోటీ పడ్డా: ఒలింపిక్ పతక విజేత తీవ్ర వ్యాఖ్యలు



డైమండ్ లీగ్ ఫైనల్స్‌లో ఓడిపోవడంతో ఒలింపిక్ పతక విజేతకు పట్టరాని కోపం వచ్చింది. తన ప్రత్యర్థులపై పరుష వ్యాఖ్యలు చేశాడు. వారంతా మూర్ఖులు, పిరికిపందలు అంటూ విమర్శించాడు. ఇంతకీ అసలేమైంది?

బ్రస్సెల్స్ వేదికగా డైమండ్ లీగ్ పోటీలు జరుగుతున్నాయి. అందులో 1500 మీటర్ల రేసును ఒలింపిక్ పతక విజేత, నార్వేకు చెందిన జాకబ్ ఇంగెబ్రిట్‌సెన్ నాలుగో ప్లేస్‌తో ముగించాడు. చివరి వరకూ దాదాపు అగ్రస్థానంలో ఉన్న అతడు లైన్‌కు చేరువగా వస్తున్న తరుణంలో ఒక్కసారిగా వెనకబడ్డాడు. దీంతో టాప్–3లోనూ నిలవలేకపోయాడు. ఆస్ట్రేలియా అథ్లెట్ మేయర్స్ కామెరూన్ (3:30.14), కెన్యాకు చెందిన కోయిచ్ ఫన్యుయెల్ (3:30.18), యూఎస్ఏ అథ్లెట్ స్ట్రాండ్ ఇథన్ (3:30.50) తొలి మూడు స్థానాల్లో ఉన్నారు. ఈ క్రమంలోనే రేసు ముగిసిన తర్వాత ఇంటర్వ్యూలో జాకబ్ తీవ్ర వ్యాఖ్యలు చేశాడు. చివరి 30 మీటర్లకు వచ్చేసరికి ప్రత్యర్థులు ఒక్కసారిగా తనకు అడ్డుగా పరిగెత్తినట్లు అతడు ఆరోపించాడు.

# టీచర్స్ డే.. తండ్రి పేరిట ఫెలోషిప్‌ను ప్రకటించిన సచిన్

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తన తండ్రి ప్రొఫెసర్ రమేశ్ తెండుల్కర్ జ్ఞాపకార్థం క్రికెట్ దిగ్గజం సచిన్ తెండుల్కర్ కీలక ప్రకటన చేశారు. ప్రతి సంవత్సరం ఎండీ (డాక్టర్ ఆఫ్ మెడిసిన్) చేసే ఒక విద్యార్థికి ఆర్థికంగా సాయం అందించనున్నారు. యువ డాక్టర్లను ప్రోత్సహించేందుకు ముందడుగు వేశారు. ఇంగా హెల్త్ ఫౌండేషన్‌తో కలిసి తెండుల్కర్ ఫౌండేషన్ ఈ ఫెలోషిప్‌ను ఇవ్వనుంది. శ్రీనగర్‌లోని క్లెఫ్ట్, క్రానియోఫేసియల్ కేర్‌లో ప్రత్యేక శిక్షణ కోసం ఏటా ఎండీ చేసే ఒకరిని ఎంపిక చేయనుంది.

"నాకు చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే ఇష్టం. మా నాన్న నాలో అంతకంటే ఎక్కువ చూశారు. నేను ఏమవ్వాలో నిర్ణయించడానికి ఎప్పుడూ ప్రయత్నించలేదు. స్వయంగా కనుక్కొనేందుకు అవసరమైన స్వేచ్ఛను నాకు ఇచ్చారు. నా తండ్రి (Schin Father) జ్ఞాపకార్థం విద్యార్థుల కోసం ఫెలోషిప్‌ను అందించనుండటం సంతోషంగా ఉంది. మా నాన్న నమ్మిన సిద్ధాంతం ఇది. విద్యే అవకాశాలను సృష్టిస్తాయని ఆయన భావించారు. అది ఇతరులకు ఉపయోగపడితే అంతకుమించిన పరమార్థం మరొకటి ఉండదు. ఉపాధ్యాయుని పాఠాలు ఒక విద్యార్థితో ప్రారంభం కావచ్చు. కానీ, వారి ప్రభావం ఎందరో జీవితాలకు, ఎన్నో తరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుంది" అని సచిన్ పోస్టు పెట్టారు.



# కేఎల్ లేకపోయినా దులీప్ ట్రోఫీ ఫైనల్‌కు మేం సిద్ధం: తిలక్ వర్మ



దులీప్ ట్రోఫీ ఫైనల్‌కు సర్వం సిద్ధమైంది. ఆదివారం నుంచే ఈస్ట్ జోన్, సౌత్ జోన్ జట్ల మధ్య తుది పోరు జరగనుంది. తిలక్ వర్మ నాయకత్వంలోని సౌత్ జోన్ జట్టులో సిరాజ్, దేవదత్ పడిక్కల్ ఆడటం ఖాయమే. అయితే, కేఎల్ రాహుల్ రాకపై సందిగ్ధత ఉంది. రాహుల్ ఈ మ్యాచ్‌లో ఆడటం లేదని తిలక్ వెల్లడించాడు. ఫైనల్ నేపథ్యంలో ఇరు జట్ల కెప్టెన్లు తిలక్, ఇషాన్ కిషన్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. "సీనియర్ పేసర్ షమీని అడ్డుకొనేందుకు సిద్ధంగానే ఉన్నాం. ఈ మ్యాచ్ రసవత్తరంగానే ఉండబోతోంది. గత మ్యాచ్‌లో షమీ ఎలా బౌలింగ్ చేశాడో మేం గమనించాం. బ్యాటర్లను ఇబ్బంది పెడుతూ లైన్ అండ్ లెంగ్త్‌తో కట్టడి చేసేందుకు ప్రయత్నిస్తాడు. అతడి బౌలింగ్‌ను ఎదుర్కొని సత్తా చాటుతాం" అని తిలక్ వర్మ తెలిపాడు.

"మహ్మద్ షమీ అత్యుత్తమ ప్లేయర్. బెంగాల్ తరఫున ఆడేటప్పటి నుంచి అద్భుతమైన ప్రదర్శన చేస్తున్నాడు. వికెట్లు తీయడంతోపాటు మైదానంలో తన శక్తినంతా వినియోగిస్తాడు. భారత క్రికెట్‌కూ ఎన్నో సేవలు అందించాడు. ఇప్పుడందరూ వయసు గురించి మాట్లాడుతున్నారు. కానీ, అది కేవలం ఒక నంబర్ మాత్రమే. అతడి కష్టం గురించి ఎవరూ అనడం లేదు. ఇప్పటికీ షమీ భాయ్‌లో వికెట్ల దాహం తీరలేదు" అని ఇషాన్ (Ishan Kishan) తెలిపాడు. షమీతోపాటు యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఎలా ఆడతాడనేది ఆసక్తికరంగా మారింది. సెమీస్‌లో అద్భుతమైన ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ దులీప్ ట్రోఫీ ఫైనల్‌ను చూసేందుకు చెన్నై వెళ్లనున్నాడు. అతడి పదవీకాలంపై ఇటీవల పెద్ద చర్చే జరిగింది.

# మేం చేయలేం కానీ...: ఆటగాళ్ల వసతి కోసం బీసీసీఐ రిక్వెస్ట్‌పై ఐవోఏ




జపాన్ వేదికగా జరగబోయే ఆసియా గేమ్స్‌లో వసతి సదుపాయాలు, క్రికెట్ మైదానంలోని పిచ్ నాణ్యతపై సర్వత్రా విమర్శలు వచ్చాయి. మరీ ముఖ్యంగా క్రికెటర్లు ఉండేందుకు చాలా చిన్న గదులను సిద్ధం చేసినట్లు వార్తలు వచ్చాయి. దీంతో తమ ప్లేయర్ల కోసం ప్రత్యేకంగా వసతి ఏర్పాటు చేయాలని బీసీసీఐ విజ్ఞప్తి చేసింది. కానీ, ఈ అభ్యర్థనను భారత ఒలింపిక్ సంఘం (IOA) తిరస్కరించినట్లు తెలుస్తోంది. ప్రత్యేకంగా ఎవరికీ ఇలాంటి వసతి సదుపాయాలు కల్పించడం లేదని.. అది క్రికెటర్లకైనా తమ నిబంధనలు ఒకేలా ఉంటాయని ఐవోఏ స్పష్టత ఇచ్చినట్లు కథనాలు వస్తున్నాయి. అయితే సొంతంగా క్రికెటర్లకు వసతి కల్పించే అవకాశం మాత్రం బీసీసీఐకి ఉందని ఐవోఏ సీఈవో రఘురామ్ అయ్యర్ చెప్పినట్లు సమాచారం. "క్రీడాకారులకు వసతి ఏర్పాట్ల గురించి బీసీసీఐ (BCCI) సీఈవో హేమంగ్ అమిన్ నిరంతరం మాతో సంప్రదింపులు చేస్తూనే ఉన్నారు. ఆసియా గేమ్స్‌లో సదుపాయాలను అంచనా వేయడానికి జపాన్‌కు ఓ టీమ్‌ను పంపించాలని క్రికెట్ బోర్డు భావించింది. ఐవోఏ కూడా అందుకు సమ్మతించింది. ఆ కమిటీ ఇచ్చిన నివేదికను బట్టి ఆర్గనైజర్లు కల్పించిన సదుపాయాలను వారు వినియోగించుకుంటారా? లేకపోతే స్వతహాగా ఏర్పాట్లు చేసుకుంటారా? అనేది వారి ఇష్టం. సొంతంగా వసతి కల్పించుకుంటామంటే మాకేమీ అభ్యంతరం లేదు. మేం మాత్రం ప్రత్యేకంగా ఎలాంటి సౌకర్యాలు కల్పించబోం" అని అయ్యర్ స్పష్టం చేసినట్లు సదరు కథనాలు వెల్లడించాయి. ఆసియా గేమ్స్ ఆర్గనైజర్లు.. భారత పురుషుల జట్టు ప్లేయర్లకు త్రీస్టార్ హోటల్, మహిళా క్రికెటర్ల కోసం ఫోర్ స్టార్ హోటల్‌ను కేటాయించారు. ఒక్కో గదిని ఇద్దరు ప్లేయర్లు షేర్ చేసుకోవాలి.

# పీసీబీ వద్దే రిమోట్ కంట్రోల్.. బాబర్ 'డమ్మీ కెప్టెన్': మాజీ క్రికెటర్ విమర్శలు

పాకిస్థాన్ క్రికెట్ పతనావస్థకు చేరడానికి ప్రధాన కారణం బోర్డేనని మాజీ ఆటగాళ్లు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలోనే ఇంగ్లాండ్ చేతిలో ఘోర ఓటమిని చవిచూసిన తర్వాత ఆటగాళ్లతోపాటు కోచింగ్ సిబ్బందిపై పీసీబీ వేటు వేసింది. ప్రధాన కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌ను స్వదేశానికి పిలిపించింది. ఇక, సెలక్టర్ పదవికి మిస్బా ఉల్ హక్ రాజీనామా చేయడం సంచలనంగా మారింది. ఇప్పుడు పీసీబీ దృష్టంతా చీఫ్ సెలక్టర్ అకిబ్ జావెద్‌పైనే ఉంది. ఈ నేపథ్యంలోనే పాక్ బోర్డు తర్వాతి టార్గెట్.. కెప్టెన్ బాబర్ అజామ్ అంటూ మాజీ క్రికెటర్ రషీద్ లతీఫ్ వ్యాఖ్యానించాడు.



"మీరు (పీసీబీని ఉద్దేశిస్తూ) జట్టును 'రిమోట్ కంట్రోల్' ద్వారానే నడపాలని అనుకుంటున్నట్లు ఉంది. సర్ఫరాజ్, ఉమర్ గుల్‌ను ఎందుకు ఇంగ్లాండ్‌కు పంపారు? ఇప్పుడు ఆ ఇద్దరిని ఎందుకు వెనక్కి పిలిచారు? గ్యారీ కిరిస్టెన్, జాసన్ గిలెస్పీ నుంచి అధికారాలను ఎందుకు తొలగించారు? మీ నిర్ణయాలు ఏంటో అర్థం కావడం లేదు. మీ మాట కెప్టెన్ బాబర్ అజామ్ (Babar Azam) వినకపోతే అతడిని తొలగించి ఉండాల్సింది కదా..! అలా కాకుండా సర్ఫరాజ్, ఉమర్‌పై వేటు ఎందుకు? వీరి తర్వాత మీ లక్ష్యం ఎవరు? బాబర్ అజామేనా?" అని ఘాటుగా పోస్టు పెట్టాడు.

# 'ధర్మన్' రెండవ షెడ్యూల్ పూర్తి



**వుదయం సినిమా:** సూపర్ స్టార్ రజనీకాంత్ 'ధర్మన్' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. 'ది డెడ్లీ డాక్టర్' అనే పవర్‌ఫుల్ ట్యాగ్‌లైన్‌తో విడుదలైన ఈ పోస్టర్ ప్రేక్షకుల్లో చాలా ఆసక్తిని రేకెత్తిస్తోంది.తాజాగా మేకర్స్ రెండవ షెడ్యూల్ పూర్తి చేశారు. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన వీడియోలో సూపర్ స్టార్ తనదైన చరిస్మా, ప్రజెన్స్ తో అదరగొట్టారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కమల్ హాసన్, సూపర్ స్టార్ రజనీకాంత్ మధ్య ఉన్నంత స్నేహబంధం చాలా అరుదు. భారతీయ చలనచిత్ర రంగంలో ఐదు దశాబ్దాలకు పైగా అగ్రస్థానంలో కొనసాగుతున్న ఈ ఇద్దరు దిగ్గజాలు, 'ధర్మన్' చిత్రం ద్వారా నిర్మాత–నటుడిగా మొదటిసారిగా కలిసి పనిచేస్తున్నారు.రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై కమల్ హాసన్,ఆర్. మహేంద్రన్ నిర్మిస్తున్న ఈ చిత్రం, RKFI నిర్మాణంలో సూపర్ స్టార్ రజనీకాంత్ నటించే మొదటి సినిమా కావడం విశేషం. భారతీయ చలనచిత్ర రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుని, అత్యంత ఆసక్తికరమైన యువ దర్శకులలో ఒకరిగా పేరు తెచ్చుకున్న అశ్వత్ మారిముత్తు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు.సూపర్ స్టార్ రజనీకాంత్‌తో పాటు, దక్షిణాది చిత్రసీమలో అత్యంత ప్రజాదరణ పొందిన నటి సిమ్రాన్, తమిళ, తెలుగు, హిందీ చిత్రాలలో తన అద్భుత నటనతో గుర్తింపు పొందిన రాశీ ఖన్నా ఈ చిత్రంలో నటిస్తున్నారు.అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. భారతీయ చలనచిత్ర రంగంలో అత్యంత అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలను రూపొందించడంలో పేరుగాంచిన జాతీయ అవార్డు గ్రహీతలు 'అన్బరివ్' ద్వయం యాక్షన్ కొరియోగ్రఫీని నిర్వహిస్తున్నారు. సినిమాటోగ్రాఫర్ గా నికేత్ బొమ్మిరెడ్డి , కార్తీక్ రాజ్‌కుమార్ ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి ప్రదీప్ ఇ. రాఘవ్ ఎడిటర్‌గా వ్యవహరిస్తుండగా, అన్నదురై ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. అలాగే డిస్నీ సంస్థ దీనికి సహ–నిర్మాతగా వ్యవహరిస్తోంది.

## వుదయం సినిమా

MOVIE TIME!

# 'తెల్లకాగితం' టీజర్




**వుదయం సినిమా:** అరుణా చల క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మాత కృష్ణ కొమ్మాలపాటి సమర్పణలో హర్ష్ రోషన్ ప్రస్తుతం చేస్తున్న చిత్రం 'తెల్ల కాగితం'. అక్టోబర్2న మూవీ రిలీజ్ అవుతుంది. 'కోర్ట్', 'బ్యాండ్ మేళం' వంటి చిత్రాలతో విజయం సాధించిన హర్ష్ రోషన్ హీరోగా నటిస్తున్నారు. నక్షత్ర హీరోయిన్‌గా పరిచయం అవుతోంది. ఈ సినిమాతో రమేష్ బండ్రెడ్డి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. యూత్ ఫుల్ ఎమోషనల్ లవ్ ఎంటర్‌టైనర్‌గా రానున్న ఈ సినిమాపై ఇప్పటికే మంచి హైప్ క్రియేట్ అయింది. ఈ క్రమంలో మూవీకి సంబంధించిన టీజర్‌ను మేకర్స్ శనివారం రోజున రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నిర్మాత దిల్ రాజు, దర్శకుడు బాబీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఇంకా భాను బోగవరపు, సినిమాటోగ్రాఫర్ కెవి.గుహన్, నటుడు అజయ్, నందు, రామ్ అబ్బరాజు, బెక్కెం వేణుగోపాల్, బివిఎస్.రవి, ఈటీవీ విన్ సాయికృష్ణ, హర్ష్ రోషన్, నక్షత్ర, శ్రావ్య, డైరెక్టర్ రమేష్ బండ్రెడ్డి సహా ఇతర చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

# 'ఎపిక్' ట్రైలర్ లాంచ్



**వుదయం సినిమా:** ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా డెబ్యూ డైరెక్టర్ ఆదిత్య హాసన్ దర్శకత్వం వహిస్తున్న 'ఎపిక్ – ఫస్ట్ సెమిస్టర్' చిత్రాన్ని సితార ఎంటర్ టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఈ సినిమాని సెప్టెంబర్ 11న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో శుక్రవారం నాడు ట్రైలర్‌ను విడుదల చేశారు. 'నా పేరు ఆనంద్.. సారీ సారీ.. ఆదిత్య.. నాకు డైరెక్టర్ అవ్వాలని ఉంది.. సినిమాలో ఓ మ్యాజిక్ ఉంది.. ఓ మంచి సినిమా, మన సినిమా తీయాలని ఉంది' అంటూ సాగే ఈ ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకునేలా ఉంది. ఆ తర్వాత విదేశాలకు హీరో వెళ్లడం, అక్కడ జరిగే సన్నివేశాలు యూత్‌ని కట్టి పడేసేలా ఉన్నాయి. హీరో, హీరోయిన్ల సన్నివేశాలు, లవ్ ట్రాక్ ఇవన్నీ కూడా రీఫ్రెషింగ్‌గా కనిపిస్తున్నాయి. ఇక ఈ ట్రైలర్‌లో కళ్యాణ్ శంకర్ కనిపించిన సీన్, ఆయన చెప్పిన డైలాగ్ యూత్‌కి బాగా కనెక్ట్ అయ్యేలా ఉంది. 'లోన్ ఈఎంఐ కట్టడానికి డబ్బులు ఎందుకు పంపడం లేదురా' అని తల్లి అడగడం.. 'కన్నప్పుడు కాలేజ్ ఫీజ్ కూడా కట్టకుంటే ఇంకెందుకు మమ్మీ' అని హీరో అనే డైలాగ్‌తో ఒక్కసారిగా ఎమోషనల్ టర్న్ తీసుకుంటుంది. 'బ్రేకప్ అవ్వాలంటే.. ఇలా తిట్టుకుంటూ, ఎవరో ఒకర్ని బ్లేమ్ చేసుకుంటూ బ్రేకప్ అవ్వాలా' అని హీరో చెప్పే డైలాగ్, ఆ తర్వాత హీరోయిన్ చెప్పే మాటలు అన్నీ కూడా ఓ ఫీల్ గుడ్ ఎమోషనల్ లవ్ స్టోరీని చూడబోతోన్నామనే హింట్‌ను ఇచ్చేలా ఉన్నాయి. ఒక రిలేషన్‌షిప్ ఎప్పుడు ఎపిక్ అవుతుందో తెలుసా?.. అని హీరో అనడం.. ట్రైలర్‌లోని చివరి డైలాగ్స్ అన్నీ కూడా యూత్‌ని మెప్పించేలా ఉన్నాయి.

# పాన్ ఇండియా మూవీ టైటిల్ 'ఆపరేషన్ గంగా'



**వుదయం సినిమా:** సూపర్ స్టార్ మోహన్ లాల్ హీరోగా శ్రీ గోకులం మూవీస్ బ్యానర్‌పై గోకులం గోపాలన్ నిర్మిస్తున్న పాన్ ఇండియా మూవీ టైటిల్‌ను ప్రకటించారు. ఎల్367 గా తెరకెక్కుతున్నఈ చిత్రానికి విష్ణు మోహన్ రచన, దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాకు 'ఆపరేషన్ గంగా' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. బైజు గోపాలన్, వి.సి. ప్రవీణ్ కో–ప్రొడ్యూసర్స్‌గా వ్యవహరిస్తుండగా, కృష్ణమూర్తి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా ఉన్నారు. భారీ బడ్జెట్‌తో, గ్రాండ్ స్కేల్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా టైటిల్ అనౌన్స్‌మెంట్ కోసం అభిమానులు, సినీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూశారు. విష్ణు మోహన్ దర్శకత్వం వహిస్తున్న మూడో సినిమా ఇది. ఆయన తొలి చిత్రం 'మెప్పడియాన్'తోనే నేషనల్ అవార్డు అందుకుని గుర్తింపు తెచ్చుకున్నారు. 'ఆపరేషన్ గంగా' ఉక్రెయిన్–రష్యా యుద్ధం నేపథ్యంలో భారత్ చేపట్టిన చారిత్రాత్మక ఎవాక్యుయేషన్ మిషన్. ఈ సినిమా షూటింగ్ జార్జియాలో ప్రారంభమైంది. త్వరలో మోహన్ లాల్ షూటింగ్‌లో జాయిన్ కానున్నారు. పోలాండ్, జార్జియా, కజకిస్థాన్, ఢిల్లీ, డెహ్రాడూన్, కొచ్చి ప్రాంతాల్లో మొత్తం 180 రోజుల పాటు షూటింగ్ జరిపేలా ప్లాన్ చేశారు.మోహన్‌లాల్‌తో పాటు బాలీవుడ్ స్టార్ అర్జున్ రాంపాల్, అదిల్ హుస్సేన్, భాగ్యశ్రీ బోర్సే, పార్తిబన్ తదితర ప్రముఖ నటులు ఈ సినిమాలో భాగమయ్యారు. విదేశాలతో పాటు బాలీవుడ్‌కు చెందిన నటీనటులు, టెక్నీషియన్స్ పనిచేస్తున్న ఈ సినిమాను శ్రీ గోకులం మూవీస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న భారీ చిత్రాల్లో ఒకటిగా రూపొందిస్తున్నారు.'ఆపరేషన్ గంగా'కు మరో ప్రత్యేకత కూడా ఉంది. 'ధురంధర్' పాన్ ఇండియా సినిమా భారీ విజయాన్ని అందుకున్న తర్వాత ప్రముఖ మ్యూజిక్ కంపోజర్ శశ్వత్ సచ్‌దేవ్ సంగీతం అందిస్తున్నారు.

# 'సర్దార్ కంటే 'సర్దార్ 2' కాన్సెప్ట్ పదిరెట్లు ఎక్కువ ఇంపాక్ట్ క్రియేట్ చేస్తుంది..

**వుదయం సినిమా:** హీరో కార్తి తమిళం, తెలుగు భాషల్లో బ్లాక్‌బస్టర్ హిట్ అయిన 'సర్దార్' మోస్ట్ అవైటెడ్ సీక్వెల్ 'సర్దార్ 2' తో థియేటర్లలోకి వస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకురానుంది. పీఎస్ మిత్రన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ప్రిన్స్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్. లక్ష్మణ్ కుమార్ నిర్మించారు. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్ సినిమాపై అంచనాలను మరింత పెంచాయి. ఈ చిత్రం సెప్టెంబర్ 10న వరల్డ్‌వైడ్‌గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా హీరో కార్తి విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలను పంచుకున్నారు.

**సరార్ సినిమా చాలా ఇంపాక్ట్ క్రియేట్ చేసింది. వాటర్ బాటిల్ చూస్తే ఆ సినిమానే గుర్తొచ్చింది. సర్దార్ 2 కథ ఎలా ఉండబోతుంది?**

–ఇండియాలో స్పై సినిమాలు చాలా తక్కువ. ఆ సినిమాలు తీయడం అంత ఈజీగా కూడా కాదు. మనకి స్పై అంటే టామ్ క్రూజ్ లాంటి హీరోలు గుర్తుకొస్తారు. 'సర్దార్' కథ చెప్తున్నప్పుడు ఒక లుంగీ వేసుకున్న గూఢచారి అని చెప్పినప్పుడు వెంటనే కనెక్ట్ అయ్యాను. సర్దార్ లో వాటర్ కాన్సెప్ట్ మీకు ఎలా ఇంపాక్ట్ చేసిందో.. దానికి పది రెట్లు ఇంపాక్ట్‌ఫుల్‌గా 'సర్దార్ 2' ఉంటుంది. 'సర్దార్' సినిమాని తమిళ ఆడియన్స్ కంటే తెలుగు ఆడియన్స్ ఎక్కువగా ఆదరించారు.

**సరార్ యాక్షన్ ఎలా ఉండబోతోంది?**

–మనకి ఈ మధ్యకాలంలో స్పై యూనివర్స్‌లో 'దురంధర్' సినిమా వచ్చింది. కాకపోతే దాని కాన్సెప్ట్ వేరు. ఇప్పుడు 'సర్దార్ 2'లో కూడా కాన్సెప్ట్ పరంగా, విజువల్ పరంగా చాలా హై స్టాండర్డ్‌లో ఉండబోతుంది. సౌత్‌లో కూడా ఇంత గొప్ప స్థాయిలో సినిమా చేయగలమని చెప్పేలా 'సర్దార్ 2' ఉంటుంది.

**ఇందులో మీ క్యారెక్టర్ కోసం ఎలా ప్రిపేర్ అయ్యారు?**

ఇందులో ఫాదర్, సన్ క్యారెక్టర్స్ కలిసి ట్రావెల్ చేస్తారు. రెండు పాత్రలు ఒకేసారి చేయడం చాలా చాలెంజింగ్. అలాగే మేకప్ విషయంలో కూడా చాలా ఓపికతో చేశాం.

**హీరోయిన్స్ గురించి ?**

–ఇందులో ముగ్గురు హీరోయిన్స్ ఉన్నారు. ఆశిక రంగనాథన్, మాళవిక మోహనన్ పాత్రల్లో చాలా కొత్త డైమెన్షన్ తీసుకొస్తారు. ఆ పాత్రలు రెగ్యులర్‌కి భిన్నంగా చాలా ఇంటెలిజెంట్‌గా ఉంటాయి. అమ్మాయిలు ఎంత స్ట్రాంగ్‌గా ఉంటారో, వాళ్లు దేశం కోసం ఎలా పోరాడతారనేది ఇందులో చూపించాం.

**మీకు సరార్ విషయంలో గుర్తుండిపోయిన విషయం ఏమిటి?**

–'సర్దార్' రిలీజ్ తర్వాత నేను ఒక చోటకి షూటింగ్‌కి వెళ్లాను. ఒక ముగ్గురు కుర్రోళ్లు కారు వెనక వచ్చి.. "వాటర్ బాటిల్ ప్లాంట్స్‌ని మేము రానివ్వము" అని గట్టిగా అరిచారు. అప్పుడు చాలా హ్యాపీగా అనిపించింది. చిన్నపిల్లల వరకు అది రీచ్ కావడం చాలా హ్యాపీగా అనిపించింది.

**అన్నపూర్ణ స్టూడియోస్ సినిమా రిలీజ్ చేస్తుంది కదా.. వారితో మీ అసోసియేషన్ గురించి?**

ఒక మంచి సినిమా ఉన్నప్పుడు నేను కాన్ఫిడెంట్‌గా ఉంటాను. నాగార్జున అన్నయ్య ఉన్నప్పుడు నేను మరింత కాన్ఫిడెంట్‌గా ఉంటాను. మాకు చాలా మంచి అనుబంధం ఉంది.



హీరో కార్తి

# 'ముగ్గురు కోతులు' సాంగ్ రిలీజ్

**వుదయం సినిమా:** జీఎస్ఆర్ క్రియేషన్స్ సమర్పణలో స్కై ఫ్లేర్ నెట్‌వర్క్స్ సహ సమర్పణలో శోభారాణి గరిమెల్ల నిర్మాణంలో కార్తీక్ గరిమెల్ల తెరకెక్కించిన చిత్రం 'ముగ్గురు కోతులు'. ఈ మూవీలో తేజ కొండపల్లి, గణేష్ బొడ్డ, దేవాన్ష్ ముఖ్య పాత్రల్ని పోషించగా. వర్షిక పాశం హీరోయిన్‌గా నటించారు. ఈ మూవీకి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్ ఇప్పటికే అందరినీ ఆకట్టుకుంది. రీసెంట్‌గా రిలీజ్ చేసిన 'ముగ్గురు కోతులు' టైటిల్ సాంగ్ అందరినీ మెప్పించింది. ఇక తాజాగా ఈ సినిమా నుంచి ఓ ప్రేమ గీతాన్ని విడుదల చేశారు.మ్యూజిక్ డైరెక్టర్ అనూప్ రూబెన్స్ ఈ చిత్రం నుంచి 'తిడుతున్నా కొడుతున్నా' అనే పాటను రిలీజ్ చేశారు. అనంతరం చిత్ర యూనిట్ కు ఆల్ ది బెస్ట్ తెలిపారు. ఎస్. సుహాస్ బాణీ, జగదీష్ సాహిత్యంతో పాటుగా చైతన్య, లాస్య గాత్రం ఈ పాటను వినసొంపుగా మార్చాయి. ఇక ఈ లిరికల్ వీడియోని గమనిస్తే హీరో, హీరోయిన్.. లవ్ ట్రాక్ సినిమాకి స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచేట్టు కనిపిస్తోంది. విజువల్స్ ఎంతో ప్లెజెంట్‌గా అనిపిస్తున్నాయి.ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమాకి ఎస్. సుహాస్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ మూవీకి రాజ్ నోముల కెమెరామెన్‌గా, జమీర్ షేక్ ఎడిటర్‌గా వర్క్ చేస్తున్నారు. మున్ముందు మరిన్ని అప్డేట్‌లతో ఆడియెన్స్‌ని అలరించేందుకు టీం రెడీగా ఉంది.



# "ప్రేమనే ఊరిలో" చిత్రం పాటకు అనూహ్య స్పందన


**వుదయం సినిమా:** మహారత్న ప్రొడక్షన్స్, ఎస్‌కే పిక్చర్స్, వనిల్లా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్లపై చందు శ్రీనివాస్, సురేష్ కొండేటి, మమత దేవేంద్ర ఎం సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'ప్రేమనే ఊరిలో'. ఈ సినిమాకి మనోజ్ కుమార్ కథ, కథనం, దర్శకత్వం వహించారు. శ్రీరామ్, రమిక శివ, తపస్విని పూనాచ, రంగాయణ రఘు తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఇక తాజాగా ఈ సినిమా నుంచి 'ఏర్రై పారే హృదయం' అంటూ సాగే అందమైన పాటకు సమీరా భరద్వాజ్ తన స్వరాన్ని జోడించగా మల్లారెడ్డి విశ్వవిద్యాపీఠ్ వైస్ చైర్మన్ డా. సీహెచ్ ప్రీతిరెడ్డి



ఈ పాటను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా నటి, గాయకి సమీరా భరద్వాజ్ మాట్లాడుతూ... "అందరికీ నమస్కారం. నేను ప్రేమనే ఊరిలో సినిమాలో ఒక అద్భుతమైన పాట పాడటం జరిగింది. ప్రేక్షకులు పాటను బాగా ఎంజాయ్ చేస్తారు. నాకు ఈ పాట పాడే అవకాశం ఇచ్చిన చిత్ర బృందానికి థాంక్స్" అన్నారు. నిర్మాత చందు శ్రీనివాస్ గారు మాట్లాడుతూ... "మహారత్న ప్రొడక్షన్స్ బ్యానర్ పై రానున్న తొలిచిత్రం ప్రేక్షకులకు మంచి అనుభూతి అందించాలనే ఉద్దేశంతో ప్రేమనే ఊరిలో సినిమాను సురేష్ కొండేటి గారితో కలిసి ప్రేక్షకుల ముందుకు తీసుకుని వస్తున్నాము. ఈ చిత్రానికి రాంబాబు గోశాల గారు పాటలు రచించారు. గొప్ప గాయనీ గాయకులు ఈ సినిమాలోని పాటలకు తమ స్వరం అందించడం జరిగింది. ప్రేక్షకులు అంత కుటుంబ సమేతంగా వచ్చి ప్రేమనే ఊరిలో సినిమాను ఆశీర్వదిస్తారని కోరుకుంటున్నాను" అన్నారు. నిర్మాత సురేష్ కొండేటి గారు మాట్లాడుతూ... "నేను సినిమాలను నిర్మించడం మొదలుపెట్టిన విషయం అందరికీ తెలిసిందే.

# 'కృష్ణంభజే' ఫస్ట్ లుక్

**వుదయం సినిమా:** జయశ్రీ మీడియా సమర్పణలో తెరకెక్కుతున్న భక్తిరస చిత్రం 'కృష్ణంభజే' శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. కలాల్ శ్రీనివాస్ నిర్మాణంలో నాగరాజ్ కొట్టే దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ప్రముఖ సీనియర్ నటుడు బ్రహ్మాజీ మార్కండేయ పాత్రను పోషిస్తున్నారు. కృష్ణాష్టమి కానుకగా బ్రహ్మాజీ 'కృష్ణంభజే' ఫస్ట్ లుక్‌ను సోషల్ మీడియాలో లాంచ్ చేశారు.పోస్టర్‌లో బ్రహ్మాజీ లుక్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. బ్రహ్మాజీ మార్కండేయుడి గెటప్‌లో సంప్రదాయ ఆధ్యాత్మిక రూపంలో కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. కాషాయ వస్త్రధారణ, రుద్రాక్ష మాలలు, నుదుటిపై విభూతి, చేతిలో ఆయుధంతో ఆయన లుక్ ప్రత్యేకంగా నిలుస్తోంది. భక్తి, ఆధ్యాత్మికతకు ప్రతిబింబంగా కనిపిస్తున్న ఈ ఫస్ట్ లుక్ ప్రేక్షకుల్లో సినిమాపై ఆసక్తిని రేకెత్తిస్తోంది.పౌరాణిక, భక్తిరస అంశాలను మేళవిస్తూ తెరకెక్కుతున్న ఈ చిత్రానికి నాగరాజ్ కొట్టే రచనతో పాటు దర్శకత్వ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కథకు అనుగుణంగా ప్రత్యేకమైన పాత్రలు, ఆసక్తికరమైన సన్నివేశాలతో సినిమాను రూపొందిస్తున్నట్లు చిత్ర బృందం తెలిపింది.ఈ చిత్రంలో మురళీ గౌడ్, రచ్చ రవి, అభయ్ బెతిగంటి, గౌతమ్ రాజు, దయానంద్ రెడ్డి, యాదమ్మ రాజు తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. హీరోగా ప్రదీప్, హీరోయిన్‌గా వంగమయి పటేల్ నటిస్తున్నారు. చిత్రానికి సంబంధించిన సంభాషణలను రచ్చ రవి అందిస్తున్నారు.ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా కొనసాగుతున్న నేపథ్యంలో 'కృష్ణంభజే'కు సంబంధించిన మరిన్ని వివరాలు, టీజర్, ఇతర ప్రచార చిత్రాలను త్వరలో విడుదల చేసేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది.




Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-1-12/45/1, P.H.C. Colony, Adilabad - 504001, Telangana. Editor : Sirikonda AUGUSTIN . RNI No.: APTEL/2013/52694. E-mail: voodayam2007@gmail.com, Cell : 9247698676, 7075458621. Telefax. No. 040-27678676.